15 . 08. 2025

VELTHURU TELUGU DAILY

# వెలుతురు

శుక్రవారం | రంగారెడ్డి , నల్లగొండ

సంపుటి :07 సంచిక : 79 , పేజీలు : 12 వెల:రూ.5/-

SIMULANEOUSLY PUBLISHED FROM TELANGANA | ANDHRA PRADESH

తెలుగు దిన పత్రిక

www.velthuru.com

velthuru Newspaper



## ఆపరేషన్ సిందూర్ విజయంతో ప్రపంచానికి దేశ సైనిక శక్తి సామర్థ్యాలు తెలిసాయి

**- హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో ఎమ్మెల్యే పాయల్ శంకర్**

**ఆదిలాబాద్ వెలుతురు ఆగస్టు 14:**
ప్రపంచ దేశాలకు మన భారత దేశం నాయకత్వం వహించే విధంగా ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో దేశం పయనిస్తుందని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. ఇటీవల ఆపరేషన్ సింధూర్

# ఎన్నికల సంఘానికి గట్టి దెబ్బ




ఎన్నికల సంఘానికి గట్టి దెబ్బ తగిలింది. బీహార్ ఓటర్ జాబితా నుంచి తొలగించిన 65 లక్షల మంది పేర్లను ఎన్నికల కమిషన్ వెబ్‌సైట్‌లో పొందుపరచాలని, వారి పేర్లను తొలగించడానికి గల కారణాలను కూడా అప్‌లోడ్ చేయాలని సూచించింది. ప్రతి ఓటరు దానిని యాక్సెస్ చేయగలిగేలా ఈ జాబితాను ప్రచారం చేయాలని సూచించింది. అయితే.. ఆ 65 లక్షల మంది వివరాలను ఈ నెల 19లోపు బహిర్గతం చేయాలని ఎన్నికల సంఘానికి సుప్రీం కోర్టు ఆదేశించింది. ఈ నెల 22 నాటికి సంబంధిత నివేదికను తమముందు ఉంచాలని సూచించింది. మరో రెండు నెలల్లో ఎన్నికలు జరగనున్న బీహార్‌లో ఓటర్ జాబితాల స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌ను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లను జస్టిస్ సూర్యకాంత్ విచారించారు.

- తొలంగించిన 65లక్షల పేర్లనుప్రచురించండి
- మరణించిన 22లక్షల మంది వివరాలు వెల్లడించండి
- 19వ తేదీలోపు వివరాలు ఇవ్వండి...22 నాటికి మాకు ఇవ్వండి
- బీహార్‌లో ఓట్ల తొలగింపు వ్యవహారంపై విచారణ
- ఎన్నికల సంఘానికి సుప్రీంకోర్టు కీలక ఆదేశం

**న్యూఢిల్లీ,ఆగస్ట్14 (వెలుతురు):** జాబితా నుంచి తొలగించిన 65 లక్షల మందిలో 22 లక్షల మంది మరణించారని ఎన్నికల సంఘం కోర్టుకు తెలిపింది. 22 లక్షల మంది మరణించినట్లయితే, దానిని బూత్ స్థాయిలో ఎందుకు వెల్లడించలేదని, పౌరుల హక్కులు రాజకీయ పార్టీలపై ఆధారపడి ఉండాలని తాము కోరుకోవడం లేదని న్యాయమూర్తి వ్యాఖ్యానించారు. 65 లక్షల మంది పేర్లను, వారిని తొలగించడానికి గల కారణాన్ని ఎన్నికల కమిషన్ వెబ్‌సైట్‌లో పొందుపరచాల ని సూచించారు. ఆ విషయాన్ని గరిష్ట సర్క్యులేషన్ ఉన్న స్థానిక భాషా వార్తాపత్రికల ద్వారా, దూరదర్శన్, ఇతర ఛానెళ్ల ద్వారా ప్రచారం కల్పించాలని సూచించింది. జిల్లా ఎన్నికల అధికారికి సోషల్ మీడియా హ్యాండిల్ ఉంటే, అక్కడ కూడా నోటీసును ప్రదర్శించాలని సుప్రీంకోర్టు పేర్కొంది. ఆ జాబితాలో పేరు ఉన్న వ్యక్తులు తమ పేరును ఎందుకు తొలగించకూడదో పేర్కొంటూ తమ ఆధారాలను జిరాక్స్ కాపీలతో సహా సమర్పించుకోవడానికి అవకాశాలు కల్పించాలని పేర్కొంది. ఓటర్

## సిఎం రేవంత్‌తో అందెశ్రీ, రాహుల్ సిప్లిగంజ్ భేటీ





**హైదరాబాద్, ఆగస్ట్14(వెలుతురు):** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని జూబ్లీహిల్స్ నివాసంలో ప్రముఖ కవి అందెశ్రీ, గాయకుడు రాహుల్

## వచ్చే 24 గంటలు మరింత అప్రమత్తంగా ఉండాలి

- వరద సహాయక చర్యలకు జిల్లాకు రూ. కోటి మంజూరు
- ఉమ్మడి పది జిల్లాలకు ప్రత్యేక సీనియర్ అధికారులు
- సెలవుల్లో ఉన్న అధికారుల, సిబ్బంది వెనక్కు

### భారీ వర్షాలు, సహాయక చర్యలపై కలెక్టర్లు, ఎస్పీలతో రెవెన్యూ, విపత్తుల నిర్వహణాశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వీడియో కాన్ఫరెన్స్



**హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 14:**
రాష్ట్ర వ్యాప్తంగా మరో రెండు మూడు రోజుల పాటు భారీ వర్షాలు ఉంటాయని భారత వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో జిల్లా కలెక్టర్లు, జిల్లా ఎస్పీలు, పోలీస్ కమీషనర్లు మరింత అప్రమత్తంగా ఉండి ఏవిధమైన ప్రాణ నష్టం, ఆస్థి నష్టం జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర రెవెన్యూ, విపత్తుల నిర్వహణ. గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

## రాజ్యాంగం, ప్రజాస్వామ్యం కంటే గొప్పది ఏదీ లేదు

- ఆగస్టు 15 ప్రతి భారతీయుడికి గర్వకారణం
- ఉగ్రవాదంపై పోరాటానికి ఆపరేషన్ సిందూర్ నిదర్శనం
- ఎలాంటి దాడినైనా ఎదుర్కొనేలా సాయుధదళాలు సిద్ధం
- స్వావలంబన దేశంగా అవతరించే దిశగా భారత్
- ద్రవ్యోల్బణం తగ్గుముఖం ..బలంగా ఆర్థిక వ్యవస్థ
- స్వాతంత్ర్య దినోత్సవ సందేశంలో రాష్ట్రపతి ముర్ము



**న్యూఢిల్లీ,ఆగస్ట్14( వెలుతురు):**
స్వావలంబన దేశంగా అవతరించే దిశగా భారత్ దృఢమైన విశ్వాసంతో ముందుకు సాగుతోందని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము

## ఓట్ చోరీ పదంతో ప్రజలను అవమానించొద్దు

- ఆధారాలు ఉంటే అఫిడవిట్ ద్వారా తెలియ చేయాలి
- రాహుల్ విమర్శలకు ఇసి మరోమారు ఘాటు జవాబు

**న్యూఢిల్లీ,ఆగస్ట్14( వెలుతురు):**
దేశంలో అనేక చోట్ల ఓటర్ల జాబితాలో అవకతవకలు జరిగాయంటూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సహా విపక్ష పార్టీలు చేస్తున్న ప్రచారంపై కేంద్ర ఎన్నికల సంఘం మరోసారి తీవ్రంగా స్పందించింది. ఈ క్రమంలో 'ఓటు-చోరీ' అనే పదాన్ని




## కాశ్మీర్ క్లౌబ్ బరస్‌లో 46మృతదేహాలు లభ్యం

- 167మందిని కాపాడిన సహాయక సిబ్బంది
- వీరిలో 38మంది పరిస్థితి విషమంగా ఉన్నట్లు వెల్లడి
- మరణాల సంఖ్య కూడా పెరిగే ప్రమాదం



**శ్రీనగర్,ఆగస్ట్14( వెలుతురు):**
జమ్మూకశ్మీర్ లోని చోసిటీలో గురువారం చోటుచేసుకున్న భారీ క్లౌడ్‌బరస్ట్ పెను విషాదం నింపింది. మృతుల సంఖ్య అంతకంతకూ పెరిగే అవకాశంఉందని భావిస్తున్నారు. ఒక్కసారిగా మెరుపు వరదలు రావడంతో జరిగిన



వెలుతురు

## ఎన్నికల సంఘానికి గట్టి దెబ్బ

జాబితా నుంచి తొలగించిన పేర్లను అన్ని పంచాయతీ భవనాలు, బ్లాక్ డెవలప్‌మెంట్, పంచాయతీ కార్యాలయాల నోటీసుబోర్డుపై కూడా ప్రదర్శించాలని, తద్వారా ప్రజలు జాబితాను మాన్యువల్‌గా యాక్సెస్ చేసుకునే వీలుంటుందని తెలిపింది. బిహార్‌లో ఇటీవల నిర్వహించిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో 65 లక్షల మంది పేర్లను తొలగించిన విషయం తెలిసిందే. అదేవిధంగా.. ఓటర్ల జాబితాలో పేర్లు గల్లంతైనవారు ఆధార్ కార్డు సమర్పించవచ్చని తెలిపింది. బిహార్‌లో ఎస్ఐఆర్ ప్రక్రియను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై సుప్రీం కోర్టులో గురువారం విచారణ కొనసాగింది. ఈ సందర్భంగా ఎన్నికల సంఘం తన వాదనలు వినిపిస్తూ.. ఓటర్ల జాబితా సవరణ వంటి నిర్ణయాలు తీసుకునేందుకు ఈసీకి అధికారాలు ఉన్నాయి. రాజకీయ వాతావరణంలో పనిచేస్తున్న నేపథ్యంలో.. వివాదాస్పదం కాని నిర్ణయమంటూ ఏదీ లేదు. పార్టీల పోరు మధ్యలో చిక్కుకున్నాం. గెలిస్తే ఈవీఎంలు మంచివని, ఓడిపోతే చెడ్డవని ప్రచారం చేస్తున్నారని పేర్కొంది. ఓటర్ల జాబితాలో మరణించిన, వలసవెళ్లిన, ఇతర నియోజకవర్గాలకు తరలిన ఓటర్ల పేర్లను ఎందుకు వెల్లడించలేరని ఈసీని సర్వోన్నత న్యాయస్థానం ప్రశ్నించింది. ఆ పేర్లను ఎందుకు బహిర్గతం చేయకూడదని.. తద్వారా బాధితులు 30 రోజుల్లోపు పరిష్కార చర్యలు తీసుకోవచ్చు కదా అని తెలిపింది. పౌరుల హక్కులు రాజకీయ నేతలపై ఆధారపడి ఉండకూడదని భావిస్తున్నట్లు చెప్పింది. అయితే.. తొలగించిన వ్యక్తుల జాబితాను పార్టీలకు ఇచ్చినట్లు- ఈసీ వెల్లడించింది. జిల్లా స్థాయిలో ఈ వివరాలను పంచుకునేందుకు సిద్ధమని తెలిపింది. ఈ క్రమంలోనే ముసాయిదా ఓటర్ల జాబితా నుంచి తొలగించిన 65 లక్షల మంది ఓటర్ల వివరాలను ఆగస్టు 19 నాటికి బహిర్గతం చేయాలని ఎన్నికల సంఘానికి సుప్రీం కోర్టు ఆదేశించింది. తొలగింపునకు కారణాలు సహా ప్రచురించి.. జిల్లా రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో అందుబాటులో ఉంచాలని తెలిపింది.

### ఆపరేషన్ సిందూర్ విజయంతో ప్రపంచానికి దేశ సైనిక శక్తి సామర్థ్యాలు తెలిసాయి

విజయవంతానికి సూచికగా గ్రామ గ్రామాన పండగ వాతావరణం లో తిరంగా ర్యాలీ జరుపుకోవాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో హార్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ఆదిలాబాద్ పట్టణంలో భారీ ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షులు బ్రహ్మానంద్ తో పాటు పలువురు పార్టీ నాయకులు, విద్యార్థులు పట్టణ ప్రముఖులతో కలిసి ఎమ్మెల్యే జాతీయ జెండాను చేత పట్టుకొని పట్టణ పురవీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. ప్రజల్లో దేశభక్తి చాటేల విద్యార్థిలు దేశ భక్తి నినాదాలతో హోరెత్తించారు. అనంతరం అంబేద్కర్ చౌక్ లో ఎమ్మెల్యే మాట్లాడుతూ... అపరేషన్ సిందూర్ తర్వాత ప్రపంచానికి భారతదేశ సైనిక శక్తి సామర్థ్యాన్ని చెప్పడం జరిగిందన్నారు. 15 నిమిషాల్లోనే పాకిస్తాన్ లోని పలు స్తావరాలను నేలమట్టం చేసిన గొప్ప శక్తి గల సైన్యం మనది అన్నారు. పక్కనున్న ఉగ్ర దేశం పాకిస్తాన్ మాట్లాడిన మాటలకు, చేష్టలకు నిమిషాల వ్యవధిలోనే మన దేశం సమాధానం చెప్పడం జరిగిందన్నారు. బీజేపీ నాయకులు పాల్గొన్నారు. కార్యక్రమంలో లాలా మున్నా . ఆకుల ప్రవీణ్.. వేద వ్యాస్. దినేష్ మాటోలియా ధోని జ్యోతి, ముకుందరావు మహేందర్. కృష్ణ యాదవ్. మురళీధర్ టాకరి. సుభాష్. దయాకర్. గణేష్ ఆదిత్య. రాము. తదితరులు పాల్గొన్నారు

## సిఎం రేవంత్‌తో అందెశ్రీ, రాహుల్ సిప్లిగంజ్ భేటీ

సిప్లింగంజ్‌లు వేర్వేరుగా కలిశారు. కేవలం మర్యాదపూర్వకంగానే కవి అందెశ్రీ,సింగర్ రాహుల్ సిప్లిగంజ్.లు కలిశారు. వీరికి శాలువా కప్పి సిఎం అభినందించారు. ఇటీవల రాహుల్‌కు ప్రభుత్వం కోటి రూపాయల నజరానా ప్రకటించింది. అలాగే అందెశ్రీ గీతం తెలంగాణ గీతంగా అలరారుతోంది.

## వచ్చే 24 గంటలు మరింత అప్రమత్తంగా ఉండాలి

ఆదేశించారు. గడచిన మూడు రోజుల్లో కొన్ని ప్రాంతాల్లో ఊహించిన దానికంటే ఎక్కువ మరికొన్ని ప్రాంతాల్లో తక్కువ వర్షపాతం నమోదైందని వీటిని దృష్టిలో పెట్టుకొని వచ్చే రోజుల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి సూచనల మేరకు రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలపై తెలంగాణ చీఫ్ సెక్రెటరీ రామకృష్ణ రావుతో కలసి గురువారం నాడు సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్లు, జిల్లా ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. గడచిన 24 గంటల్లో 10 సెంటీమీటర్ల కంటే ఎక్కువ వర్షపాతం నమోదైన భద్రాద్రి కొత్తగూడెం, మంచిర్యాల, భూపాలపల్లి, ములుగు, ఆసిఫాబాద్, పెద్దపల్లి, కరీంనగర్ తదితర జిల్లాల్లో నెలకొన్న పరిస్థితులపై కలెక్టర్లను అడిగి తెలుసుకున్నారు. రాబోయే 24 గంటల్లో రెడ్ అలెర్ట్‌గా ఉన్నమెదక్, సంగారెడ్డి, వికారాబాద్ జిల్లాలలో తీసుకోవలసిన చర్యలపై కలెక్టర్లను అప్రమత్తం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి మాట్లాడుతూ భారీ వర్షాల నేపథ్యంలో తీసుకోవలసిన సహాయక చర్యల కోసం ప్రతి జిల్లాకు కోటి రూపాయిలు విడుదల చేశామని అవసరమైతే మరిన్ని నిధులు విడుదల చేయడానికి సిద్దంగా ఉన్నామని తెలిపారు. సహాయక చర్యలు పర్యవేక్షించేందుకు గాను ఉమ్మడి పది జిల్లాలకు సీనియర్ అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమించడం జరిగిందని తెలిపారు. సెలవులో ఉన్న అధికారులు, సిబ్బంది సెలవులను రద్దు చేసి వెనక్కు పిలిపించాలని, వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్లను ఆదేశించారు. లోతట్టు ప్రాంతాలు, వరద ముప్పు ప్రాంతాలలో చేపట్టవలసిన రక్షణ చర్యల గురించి ఆదేశాలు జారీ చేశారు. ప్రధానంగా గ్రేటర్ హైదరాబాద్ లో మున్సిపల్, మెట్రో వాటర్ బోర్డు, ట్రాఫిక్ విభాగాలు సమన్వయంతో పని చేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు. రైల్వే లైన్లు, లోలెవెల్ బ్రిడ్జీలు, కాజ్‌వేలు, లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి వర్షం నీరు నిల్వకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ముఖ్యంగా లోలెవెల్ బ్రిడ్జీల దగ్గర పోలీసు సిబ్బందిని నియమించాలని సూచించారు. అంటువ్యాధులు ప్రబలకుండా తగిన చర్యలు తీసుకోవాలని, అలాగే త్రాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. చిన్న చిన్న వర్షాలు 200 మిల్లీమీటర్లకే బ్యాక్ వాటర్ వల్ల అక్కడున్న ప్రజలను తరలించవలసి వస్తుందని దీనికి శాశ్వత పరిష్కారం కోసం అక్కడున్నవారిని తరలించి ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇవ్వాలని కలెక్టర్లకు సూచించారు. ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని ముఖ్యంగా హైదరాబాద్ నగరంతో పాటు జిల్లా కేంద్రాల్లో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.

## కాశ్మీర్ క్లౌబ్ బరస్‌లో 46మృతదేహాలు లభ్యం

విషాదంలో ఇప్పటివరకు 46 మృతదేహాలను వెలికితీసినట్లు అధికారులు వెల్లడించారు. శిథిలాల కింద మరికొంత మంది చిక్కుకొని ఉండటంతో.. మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉన్నట్లు- సమాచారం. ఘటనా స్థలంలో పెద్ద ఎత్తున సహాయక చర్యలు చేపట్టి 167 మందిని కాపాడగా.. వీరిలో 38మంది పరిస్థితి విషమంగా ఉన్నట్లు- అధికారులు తెలిపారు. మృతుల్లో ఇద్దరు సీఐఎస్ఎఫ్ సిబ్బంది ఉన్నట్లు వెల్లడించారు. ఘటనా స్థలంలో ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్, పోలీసులు, ఆర్మీ, స్థానిక వాలంటీర్లు ముమ్మరంగా సహాయక చర్యలు కొనసాగిస్తున్నాయి. కిశ్త్‌వాడ్ ప్రాంతంలోని చోసిటీలో ఆకస్మిక వరదలతో జమ్మూకశ్మీర్ అధికార యంత్రాంగం అప్రమత్త మైంది.ప్రజలు, యాత్రికులకు సహాయం అందించేందుకు కంట్రోల్ రూమ్, హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు- చేసింది. ఐదుగురు అధికారులను కంట్రోల్ రూమ్‌లో అందుబాటులో ఉంచింది. కిశ్త్‌వాడ్ జిల్లాలోని ప్రఖ్యాత మాచైల్ మాతా (చండీ)మందిరానికి వెళ్లే యాత్ర బేస్ పాయింట్ ఇదే. ఇక్కడే యాత్రికులు తమ వాహనాలు ఉంచి.. కాలి నడకన దర్శనానికి వెళ్తుంటారు. కిశ్త్‌వాడ్ ప్రాంతంలోని చోసిటీలో మెరుపు వరదలు చోటుచేసుకొన్నాయి. ఇది మాచైల్ మాత మందిర యాత్రకు బేస్ క్యాంప్. సహాయక కార్యక్రమాలు మొదలయ్యాయని సహాయ కమిషనర్ పంకజ్ శర్మ వెల్లడించారు. మరోవైపు కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ స్పందిస్తూ చోసిటీ-లో క్లౌడ్ బరస్ట్‌లో భారీగా ప్రాణనష్టం చోటు- చేసుకొనే ప్రమాదం ఉంది. అధికారులు తక్షణమే రంగంలోకి దిగారు. నష్టం అంచనా వేయడం.. వైద్య సౌకర్యాలు కూడా వేగంగా ఏర్పాటు- చేస్తున్నారు. నా ఆఫీస్‌కు నిరంతరం అప్‌డేట్లు- అందుతున్నాయి. అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తాం అని పేర్కొన్నారు. రెండు ఎన్డీఆర్ఎఫ్ బృందాలు ఇప్పటికే చోసిటీ-కి తరలి వెళ్లాయి. అదనపు ఎస్డీఆర్ఎఫ్ బృందాలు, హెలికాప్టర్లను సిద్ధం చేస్తున్నారు. మాచైల్ మాతా మందిరం సముద్ర మట్టానికి సుమారు 2,800 మీటర్ల ఎత్తులో ఉంది. జులై 25న ఈ యాత్ర మొదలైంది. జమ్మూ డివిజన్ నుంచి వేల సంఖ్యలో యాత్రికులు ఇక్కడకు వచ్చారు. సెప్టెంబర్ 5వ తేదీన ఈ యాత్ర ముగియనుంది. ఈ పెను విషాదం నేపథ్యంలో మాచైల్ యాత్రను నిలిపివేశారు. హిమాచల్ ప్రదేశ్‌లో కూడా భారీ వర్షాలు కొనసాగుతున్నాయి. అక్కడ బుధవారం క్లౌడ్‌బరస్ట్‌లు చోటు- చేసుకొన్నాయి. శిమ్లా, లాహోల్-స్పితి ప్రాంతాల్లో చాలా నిర్మాణాలు కొట్టుకుపోయాయి. దాదాపు జాతీయ రహదారులతో సహా 300 మార్గాలను మూసివేశారు. శిమ్లాలోని విద్యుత్తు సరఫరా కార్యాలయం కూడా దెబ్బతింది. ఇక కుల్లు జిల్లాలో క్లౌడ్ బరస్ట్ చోటు- చేసుకొందని కలెక్టర్ వెల్లడించారు.

## రాజ్యాంగం, ప్రజాస్వామ్యం కంటే గొప్పది ఏదీ లేదు

పేర్కొన్నారు. ద్రవ్యోల్బణం తగ్గుముఖం పట్టిందని, ఎగుమతులు పెరిగాయని, అన్ని కీలక సూచీలు దేశ ఆర్థిక వ్యవస్థ బలంగా ఉందని చూపిస్తున్నాయని తెలిపారు. స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకుని రాష్ట్రపతి ముర్ము జాతినుద్దేశించి ప్రసంగించారు. అలాగే దేశ ప్రజలకు శు భాకాంక్షలు తెలిపారు. అనంతరం దేశ ప్రజలను ఉద్దేశించి ముర్ము మాట్లాడుతూ.. ఆగస్టు 15 కేవలం స్వేచ్ఛా పండుగ మాత్రమే కాదని, ప్రతి భారతీయుడికి గర్వకారణమని అన్నారు. మన రాజ్యాంగం, ప్రజాస్వామ్యం కంటే గొప్పది ఏదీ లేదని అన్నారు. ప్రజాస్వామ్య మార్గంలో సవాళ్లు ఎదురైనప్పటికీ భారతదేశం విజయం సాధించిందన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాల వల్లే 78 సంవత్సరాల క్రితం దేశానికి స్వేచ్ఛ వచ్చిందని అన్నారు. రాష్ట్రపతి ముర్ము ఇటీవల జరిగిన ఆపరేషన్ సింధూర్ గురించి తన ప్రసంగంలో ప్రస్తావించారు. ఉగ్రవాదంపై మానవాళి పోరాటానికి ఉదాహరణగా ఆపరేషన్ సింధూర్ చరిత్రలో నిలిచిపోతుందని అన్నారు. పహల్గాం దాడికి భారతదేశం తీసుకున్న నిర్ణయాత్మక, దృఢమైన ప్రతిస్పందన ఇదని, దీనితో మన సాయుధ దళాలు దేశాన్ని రక్షించడానికి ఏ పరిస్థితిని అయినా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నాయని నిరూపించిందన్నారు. పహల్గాంలో అమాయక పౌరులపై జరిగిన ఉగ్రదాడిని అమానుషమైన, పిరికిపంద చర్యగా పేర్కొన్నారు. ఉగ్రవాదంపై మానవాళి పోరాటంలో 'ఆపరేషన్ సిందూర్ ఒక ఉదాహరణగా చరిత్రలో నిలిచిపోతుందని చెప్పారు. పహల్గాం ఉగ్రదాడిని దేశమంతా ముక్తకంఠంతో ఖండించింది. మనల్ని విభజించాలనుకునే వారికి దీటైన జవాబు ఇచ్చింది. 'ఆపరేషన్ సిందూర్' ద్వారా ఉగ్రమూకలకు గుణపాఠం నేర్పింది. దేశాన్ని కాపాడే విషయంలో మన సాయుధ బలగాలు ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నాయని ఈ ఆపరేషన్ చాటి చెప్పింది. రక్షణ రంగంలో 'ఆత్మనిర్భర్ భారత్' కార్యక్రమం విజయానికి నిదర్శనంగా నిలిచింది. సుపరిపాలన, అవినీతిని సహించని విధానాలతో భవిష్యత్తు వైపు దేశం పయనిస్తోంది. గత ఆర్థిక సంవత్సరంలో 6.5 శాతం జీడీపీ వృద్ధి రేటుతో.. ప్రపంచంలోని ప్రధాన ఆర్థిక వ్యవస్థల్లో భారత్ అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతోంది. కశ్మీర్ లోయలో రైలు మార్గంతో స్థానికంగా వాణిజ్యం, పర్యాటకం మరింత మెరుగుపడతాయని పేర్కొన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత, ప్రతి వయోజన పౌరుడికి ఓటు- హక్కు ప్రసాదించిన ప్రజాస్వామ్య మార్గాన్ని మనం స్వీకరించా మని గుర్తు చేశారు. దీని ద్వారా మన విధిని నిర్ణయించుకునే హక్కును మనమే ఇచ్చుకున్నామని అన్నారు. సవాళ్లు ఉన్నప్పటికీ, భారత ప్రజలు ప్రజాస్వామ్యాన్ని విజయవంతంగా స్వీకరించారని, మనకు రాజ్యాంగం, ప్రజాస్వామ్యం అన్నింటికంటే ముఖ్యమైనవి అన్నారు.ఆగస్టు 15 దేశ ప్రజల సమిష్టి జ్ఞాపకాలలో నిలిచిపోయే చారిత్రాత్మక తేదీ అని ఆమె పేర్కొన్నారు. సుదీర్ఘ వలస పాలనలో భారతీయులు తరతరాలుగా స్వేచ్ఛ గురించి కలలు కన్నారని అన్నారు. దేశంలోని ప్రతి మూల నుంచి ప్రజలందరూ విదేశీ పాలన సంకెళ్లను తెంచుకోవాలని శాంతియుత మార్గంలో పోరాడారని తెలిపారు. వారి పోరాటం అచంచల మైన ఆశావాదంతో నిండి ఉంది. ఇది స్వాతంత్ర్యం తర్వాత కూడా మన అభివృద్ధిని నడిపించిందని అన్నారు. రేపు మనం త్రివర్ణ పతాకానికి వందనం చేస్తున్నప్పుడు 78 సంవత్సరాల క్రితం ఆగస్టు 15న భారతదేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన త్యాగధనులందరికీ కూడా నివాళులు అర్పిస్తామని అన్నారు. శుభాంశు శుక్లా అంతరిక్ష ప్రయాణం.. ఒక తరాన్ని గొప్ప కలలు కనేలా ప్రేరేపించింది. అదేవిధంగా దేశ మానవసహిత అంతరిక్ష కార్యక్రమం 'గగన్‌యాన్'కు ఇది చాలా ఉపయోగకరంగా ఉంటు-ంది. మరోవైపు.. నూతన ఆత్మవిశ్వాసంతో మన యువత క్రీడల్లో తమదైన ముద్ర వేస్తున్నారు. ముఖ్యంగా చదరంగంలో మునుపెన్నడూ లేని విధంగా భారత్ ఆధిపత్యం చెలాయిస్తోంది. 'జాతీయ విద్యా విధానం- 2020' విస్తృత మార్పులు తీసుకొచ్చింది. దేశంలో ఆదాయ అసమానతలు తగ్గుతున్నాయి. ప్రాంతీయ అసమానతలు కూడా కనుమరుగవుతున్నాయి. సామాజిక సంక్షేమంతో కూడిన సమగ్ర ఆర్థిక వృద్ధి.. 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా ఎదిగే దిశగా భారత్‌ను ముందుకు నడుపుతోందని తెలిపారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని.. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చేసిన ప్రసంగం ఆలోచనాత్మకంగా ఉందని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. దేశ సమష్టి పురోగతిని, రాబోయే అవకాశాలను ప్రధానంగా ప్రస్తావించారని తెలిపారు. దేశ స్వాతంత్ర్యం÷-ర కోసం మహనీయులు చేసిన త్యాగాలను గుర్తుచేశారన్నారు. అదేవిధంగా.. దేశ నిర్మాణంలో ప్రతి పౌరుడు భాగస్వామికావాలని రాష్ట్రపతి పిలుపునిచ్చారని ప్రధాని 'ఎక్స్'లో పేర్కొన్నారు.

## ఓట్ చోరీ పదంతో ప్రజలను అవమానించొద్దు

పదే పదే వినియోగించడాన్ని తప్పుపట్టిన ఈసీ.. తప్పుడు కథనాలకు కారణమయ్యే 'అసభ్యకర పదాలు' ప్రచారం చేసే బదులు ఆధారాలు చూపించాలని పేర్కొంది. ఒక వ్యక్తి-ఒకే ఓటుకు సంబంధించిన నిబంధన తొలి ఎన్నికలు జరిగిన 1951-52 నాటి నుంచి అమల్లో ఉంది. ఏ ఎన్నికల్లోనైనా ఎవరైనా రెండుసార్లు ఓటు వేసినట్లు ఆధారాలు ఉంటే లిఖితపూర్వక అఫిడవిట్ ఎన్నికల సంఘానికి ఇవ్వండి. ఎటువంటి ఆధారాలు లేకుండా దేశంలోని ఓటర్లందర్నీ 'చోర్'గా పిలవడం సరికాదని ఎన్నికల సంఘం పేర్కొంది. ఇటువంటి చెడు పదబంధాలు ప్రచారం చేయడం కోట్లాది మంది ఓటర్లు, లక్షలాది మంది ఎన్నికల సిబ్బందిపై దాడిగా ఇసి అభివర్ణించింది. ఓటర్ల జాబితాలో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తున్న కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ.. కర్ణాటకలోని ఒక్క మహాదేవపుర నియోజకవర్గంలోనే లక్ష ఓట్లు- చోరీకి గురయ్యాయని ఇటీవల ఆరోపించారు. బెంగళూరు సెంట్రల్ లోక్‌సభ పరిధిలో ఉన్న ఈ అసెంబ్లీ స్థానంలో ఓడిపోవడం వల్లే కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి అక్కడ ఓటమి పాలయ్యారని అన్నారు. వీటిపై స్పందించిన ఎన్నికల సంఘం.. ఆరోపణలకు లిఖితపూర్వంగా డిక్లరేషన్ ఇవ్వాలని కోరిన విషయం తెలిసిందే. అయినప్పటికీ ఓటరు జాబితాల్లో తప్పిదాలకు సంబంధించి వివిధ అంశాలను లేవనెత్తుతూ ఎన్నికల సంఘం పనితీరుపై కాంగ్రెస్ నేత విమర్శలు గుప్పిస్తూనే ఉన్నారు. రాహుల్ ఆరోపణలను బిజెపి కూడా ఎప్పటికప్పుడు తిప్పికొడుతోంది.

తాజాగా సోనియా పౌరసత్వానికి ముందే ఓటరు జాబితాలో పేరు చోటు చేసుకోవడాన్ని బిజెపి బయటపెట్టింది. ఓటమి పాలైన ప్రతిపక్షం నిరాశ నిస్పృహలతో చేసే విమర్శలుగా బిజెపి ఈ ఆరోపణలను కొట్టిపారేసింది.

ప్రజల తీర్పును కాంగ్రెస్ అవమానిస్తోందని రవిశంకర్ ప్రసాద్, దేవేంద్ర ఫడ్నవీస్ వంటి వారు ఆరోపించారు. అయినా బహుళ ప్రతిపక్ష పార్టీలు, పౌరసమాజం, స్వతంత్ర దర్యాప్తు సంస్థలనుంచి ఆందోళనలు పెరుగుతూనే ఉన్నాయి.

మొదట ఇసిఐ యంత్రాలతో చదువగలిగే ఓటర్ల జాబితాలను విడుదల చేయాలి. స్వతంత్ర పరిశీలనకు సిసిటివి ఫుటేజీలను భద్రపరచడం, పారదర్శకతకు ప్రాధాన్యం ఇవ్వడం, ఓటర్ల నమ్మకాన్ని పెంచేందుకు ట్యాంపర్ ప్రూఫ్ రికార్డులను అందించడం వంటి డిమాండ్లను ప్రతిపక్షాలు చేస్తున్నాయి. తటస్థ ఏజెన్సీల ద్వారా ఓటర్ల జాబితా థర్డ్ పార్టీ ఆడిట్‌లో లోపాలు గుర్తించి సరిదిద్దాలని కూడా అంటోంది. 1951 నాటి ప్రజాప్రాతినిధ్యం చట్టానికి చట్టపరమైన సంస్కరణలు కావాలని కోరుతోంది. ఎన్నికల మోసానికి కఠిన శిక్షలు విధించాలి.

# కాశ్మీర్ క్లౌడ్ బస్ట్‌లో 38మంది మృత్యువాత

- భారీ వర్షంతో పలువురికి తీవ్ర గాయాలు
- సహాయక చర్యలకు తిగిన ఎన్‌డిఆర్‌ఎఫ్ దళాలు



శ్రీనగర్,ఆగస్ట్14( వెలుతురు):
జమ్మూకాశ్మీర్ కిష్టావర్ జిల్లా పద్దార్ సబ్ డివిజన్ పరిధిలోని చిషోటీ- గ్రామ పరిసర ప్రాంతంలో గురువారం జరిగిన క్లౌడ బస్ట్‌లో 38 మంది మృత్యువాత పడ్డారని సమాచారం. ఈ సంఖ్య మరింత పెరగవచ్చని అంటున్నారు. మేఘ విస్ఫోటనం కారణంగా సంభవించిన మెరుపు వరదలతో 38 మంది మరణించారు. 75 మంది తీవ్రంగా గాయపడ్డారు. మాచైల్ మాతా యాత్ర మార్గంలో ఈ గ్రామం ఉండడంతో మృతుల సంఖ్య మరింతగా పెరగవచ్చని ప్రభుత్వ అధికారులు భావిస్తున్నారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న జిల్లా యంత్రాంగం ఆ ప్రాంతానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టింది. ఇక క్షతగాత్రులను మెరుగైన వైద్య చికిత్స కోసం జిల్లా ప్రభుత్వాసుపత్రికి జిల్లా యంత్రాంగం తరలించింది. మరో 70 మందిని సహాయక బృందాలు రక్షించాయి. మేఘ విస్ఫోటనం అనంతరం చోటు- చేసుకున్న పరిణామాలపై గవర్నర్, సీఎంలతో కేంద్ర మంత్రి అమిత్ షా ఫోన్ చేసి మాట్లాడారు. అలాగే ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, భద్రతా దళాలు, పోలీసులు సంయుక్తంగా ఈ సహాయక చర్యల్లో పాల్గొన్నారు. సహాయక చర్యలు కొనసాగుతున్నాయని కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ వెల్లడించారు. అయితే ఈ వర్షాల కారణంగా మరణించిన వారి సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కిష్టావర్ డిప్యూటీ- కమిషనర్ పంకజ్ కుమార్ శర్మ సహాయక చర్యలను దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. ఈ ఘటనపై జమ్మూకాశ్మీర్ గవర్నర్ మనోజ్ సిన్హా స్పందించారు. భారీ వరద కారణంగా 12 మంది మరణించడంపై ఆయన దిగ్భ్రాం÷-రతి వ్యక్తం చేశారు. మృతుల కుటు-ంబాలకు సానుభూతి తెలిపారు. అలాగే సహాయక చర్యలు తీసుకోవాలంటూ పౌర, పోలీస్, ఆర్మీ, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ అధికారులకు గవర్నర్ కీలక ఆదేశాలు జారీ చేశారు. ఇంకోవైపు దేశ రాజధాని ఢిల్లీ, హిమాచల్‌ప్రదేశ్‌లో ఎడతెరపి లేని భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ రోజు అంటే గురువారం ఢిల్లీ, పరిసర ప్రాంతాల్లో మరింతగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ వెల్లడించింది. ఇక హిమాచల్ ప్రదేశ్ అంతటా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా రాష్ట్రంలో మౌలిక సదుపాయాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. రాష్ట్రంలో రుతుపవనాలు ప్రవేశించిన నాటి నుంచి ఇప్పటివరకూ 241మంది మరణించారని ఆ రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించింది. వారంతా.. వర్షాధార విపత్తులతోనే మరణించారని వివరించింది.

## యూపిలో మాఫియ ఆగడాలకుచెక్

- యోగి ప్రభుత్వంపై ఎస్పీ ఎమ్మెల్యే ప్రశంసలు
- ఎమ్మెల్యే పూజాపాల్ వ్యాఖ్యలపై అఖిలేశ్ ఆగ్రహం
- పార్టీ నుంచి బహిష్కరిస్తూ ఉత్తర్వులు జారీ

లక్నో,ఆగస్ట్14( వెలుతురు):
యూపీలో మాఫియా ఆగడాలపై ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఉక్కుపాదం మోపుతున్నారని సమాజ్‌వాదీ పార్టీ ఎమ్మెల్యే పూజా పాల్ అభినందించారు. అయితే ఆమె ప్రశంసలపై ఎస్పీ అధినేత అఖిలేశ్ యాదవ్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ..ఆమెను పార్టీ నుంచి బహిష్కరించారు. ఇక వివరాల్లోకి వెళితే...తన భర్త బీఎస్పీ మాజీ ఎమ్మెల్యే రాజు పాల్ హత్య కేసులో నిందితుడిగా ఉన్న అతీక్ అహ్మద్‌ను సమాధి చేసిన యోగి ప్రభుత్వం, తనతోపాటు- అనేక మంది మహిళా బాధితులకు న్యాయం చేసిందని పూజాపాల్ అన్నారు. అసెంబ్లీలో విజన్ డాక్యుమెంట్ 2047పై 24 గంటల పాటు- సాగిన సుదీర్ఘ చర్చలో పాల్గొన్న ఆమె.. నేరాల అదుపు కోసం తీసుకుంటున్న చర్యలపై రాష్ట్రం మొత్తం ముఖ్యమంత్రివైపే చూస్తోందన్నారు. నా భర్తను చంపింది ఎవరో అందరికీ తెలుసు. అతీక్ అహ్మద్ వంటి నేరగాళ్లపై అందరూ మౌనంగా ఉన్నప్పుడు అతడికి వ్యతిరేకంగా నా గళాన్ని వినిపించా. ఆ పోరాటంలో అలసిపోతున్న సమయంలో సీఎం యోగి నాకు న్యాయం చేశారు. నా వేదన విని న్యాయం చేసిన సీఎంకు కృతజ్ఞతలు. అతీక్ వంటి నేరగాళ్లపై తీసుకుంటున్న చర్యలు ప్రశంసనీయం. రాష్ట్రం మొత్తం నేడు ముఖ్యమంత్రిపై పూర్తి విశ్వాసంతో ఉందని పూజా పాల్ పేర్కొన్నారు. యూపీలో 2005లో బహుజన్ సమాజ్ పార్టీ ఎమ్మెల్యే రాజు పాల్ హత్యకు గురికావడం అప్పట్లో సంచలనం రేపింది. పూజా పాల్‌ను వివాహం చేసుకున్న 10 రోజులకే ఆయన హత్యకు గురయ్యారు. నాటి ఉప ఎన్నికల్లో రాజుపాల్ చేతిలో ఓటమి పాలైన అష్రాఫ్ అహ్మద్ సోదరుడు అతీక్ సాయంతో ఈ దారుణానికి పాల్పడినట్లు- ఆరోపణలు వచ్చాయి. గ్యాంగ్‌స్టర్ నుంచి రాజకీయ నేతగా ఎదిగిన అతీక్ అహ్మద్ గతంలో ఎమ్మెల్యేగా, ఎంపీగానూ పనిచేశాడు. అతీక్‌పై దాదాపు 100 క్రిమినల్ కేసులున్నాయి. ఆ తర్వాత వేర్వేరు కేసుల్లో అతీక్, అష్రాఫ్‌లు దోషులుగా తేలారు. 2023 ఏప్రిల్‌లో ఓ కేసు విచారణ సందర్భంగా వైద్య పరీక్షల కోసం తరలిస్తున్న సమయంలో జర్నలిస్టుల్లా వచ్చిన ముగ్గురు వ్యక్తులు అతీక్, అష్రాఫ్‌లను తుపాకులతో కాల్చి చంపారు. అంతకు కొన్ని గంటల ముందే అతీక్ కుమారుడు అసద్ కూడా పోలీసు ఎన్‌కౌంటర్‌లో మరణించాడు. అయితే మాఫియా ఆగడాలపై ఉక్కుపాదం మోపుతున్నారంటూ సీఎం యోగి ఆదిత్యనాథ్‌పై ఎస్పీ ఎమ్మెల్యే పూజా పాల్ ప్రశంసలు కురిపించిన వ్యవహారం కాస్త స్థానిక రాజకీయాల్లో చర్చనీయాంశమైంది. ఈ క్రమంలోనే గంటల వ్యవధిలోనే ఎస్పీ అధినేత అఖిలేశ్ యాదవ్ ఆమెపై చర్యలకు ఉపక్రమించారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడ్డారంటూ పూజా పాల్‌ను పార్టీ నుంచి బహిష్కరించారు. తక్షణమే ఇది అమల్లోకి వస్తుందని ఓ ప్రకటనలో తెలిపారు.

# 30 ఏళ్ల తర్వాత చరిత్ర తిరగరాశాం

- కష్టపడిన నేతలు, కార్యకర్తలకు అభినందనలు
- జడ్పీటిసిల విజయంపై చంద్రబాబు హర్షం

అమరావతి,ఆగస్ట్14( వెలుతురు):
రెండు చోట్లా టీడీపీ ఘన విజయంపై సీఎం చంద్రబాబు స్పందించారు. కడప జిల్లా టీడీపీ నేతలంతా పులివెందుల విజయం పట్ల స్పందించాలని ఆయన కోరారు. ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికలు జరిగాయని పేర్కొన్నారు. 30 ఏళ్ల తర్వాత చరిత్ర తిరగరాశామని ఆయన ఉద్ఘాటించారు. ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికలు జరిగాయి కాబట్టి.. పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నికలకు 11 మంది అభ్యర్థులు నామినేషన్లు వేశారని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. అలాగే ఒంటిమిట్ట గెలుపుపైనా హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఎన్నికల్లో కష్టపడి టీడీపీకి ఘన విజయాన్ని సాధించిన ప్రతి నాయకుడు, కార్యకర్తకు సీఎం చంద్రబాబు అభినందనలు తెలిపారు. పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నికలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి మారెడ్డి లతారెడ్డి ఘన విజయం సాధించారు. 6,735 ఓట్ల మెజారిటీతో టీడీపీ అభ్యర్థి లతారెడ్డి గెలిచారు. ఈ ఘన విజయంపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, తెలుగుదేశం జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు స్పందించారు.

పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నికలో టీ-డీపీ అభ్యర్థి ఘన విజయంపై మంత్రులతో మాట్లాడారు. కడప జిల్లాలోని టీడీపీ నేతలంతా పులివెందుల విజయం పట్ల స్పందించాలని చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. పులివెందుల కౌంటింగ్‌లో 30 ఏళ్ల తర్వాత ఓటు- వేశామని ఓటర్లు స్లిప్ పెట్టారని .. అంటే అక్కడ పరిస్థితులు ఎలా ఉన్నాయనేది ప్రజలు గమనించాలని సూచించారు. టీడీపీ నేతలు పులివెందుల విజయంపై ప్రజలను చైతన్యం చేసే విధంగా మాట్లాడాలని మార్గ నిర్దేశం చేశారు. పులివెందులలో జగన్ రెడ్డి అరాచకాల నుంచి ప్రజలు ఇప్పుడిప్పుడే బయట పడుతున్నారని నొక్కిచెప్పారు. 30 ఏళ్ల తర్వాత పులివెందుల ప్రజలు ఓటు వేశారనేది ఏపీలో ప్రజలకు తెలియచేయాలని సీఎం చంద్రబాబు చెప్పారు. ఎన్నికలు ప్రజాస్వామ్యయుతంగా జరిగాయని కూడా చెప్పాలని మంత్రులకు సీఎం చంద్రబాబు దిశానిర్దేశంచేశారు.

## ఢిల్లీ మెట్రో రైల్లో కేంద్ర మంత్రి బండి సంజయ్ దంపతుల ప్రయాణం



**న్యూఢిల్లీ వెలుతురు ఆగస్టు 14:**
కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ దంపతులు గురువారం రోజున న్యూఢిల్లీలో మెట్రో రైల్ లో ప్రయాణించారు. వాస్తవానికి గురువారం రోజున సాయంత్రం న్యూఢిల్లీలోని జంతర్ మంతర్ లోని తన నివాసం నుండి అంతర్జాతీయ విమానాశ్రయానికి బయలుదేరాల్సి ఉంది. అయితే భారీ వర్షాలు, ట్రాఫిక్ రద్దీవల్ల ఢిల్లీలో ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిని దృష్టిలో ఉంచుకున్న కేంద్ర మంత్రి బండి సంజయ్ తన ప్రోటోకాల్ కాన్వాయ్ ను పక్కనపెట్టి సతీమణి బండి అపర్ణతో కలిసి సమీపంలోని శివాజీ స్టేడియం వద్దనున్న మెట్రో స్టేషన్ కు వెళ్లారు. అక్కడ టిక్కెట్ తీసుకుని మెట్రో రైల్ ఎక్కి ఢిల్లీలోని ఏరో మెట్రో స్టేషన్ కు చేరుకున్నారు. అక్కడి నుండి నేరుగా ఎయిర్ పోర్టులోకి వెళ్లి ఫ్లైట్ ఎక్కి హైదరాబాద్ పయనమయ్యారు.

## పోలీస్‌లకు డిగ్రీ కనీస విద్యార్హత

**- డిగ్రీ పూర్తిచేయలేని వారికోసం అవకాశం**

**- ఓపెన్ వర్శిటీతో తెలంగాణ పోలీస్ శాఖ ఒప్పందం**




**హైదరాబాద్,ఆగస్ట్14( వెలుతురు):**
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ–, తెలంగాణ పోలీసుశాఖ మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. దూరవిద్య విధానంలో కానిస్టేబుళ్లు డిగ్రీ చదివేందుకు వీలుగా యూనివర్సిటీ–, పోలీసు అధికారులు ఎంఓయూ చేసుకున్నారు. ఈ మేరకు ఒప్పంద పత్రాలను డీజీపీ జితేందర్, వర్సిటీ– ఉన్నతాధికారులు మార్చుకున్నారు. డిగ్రీ పూర్తికాని కానిస్టేబుళ్లు, ఏఎస్సైలకు దూరవిద్య విధానం అమలు చేయనున్నారు. కానిస్టేబుళ్లకు కోర్సు మెటీ–రియల్, స్టడీ సెంటర్ యాక్సెస్ ఇస్తామని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ అధికారులు తెలిపారు. దేశంలోనే తొలిసారిగా తెలంగాణా పోలీస్ డిపోర్ట్‌మెంట్‌లో విధులు నిర్వహిస్తున్న వారందరికీ గ్రాడ్యుయేషన్ ఉండాలని నిర్ణయించామని డీజీపీ జితేందర్ తెలిపారు. అందులోభాగంగా గురువారం హైదరాబాద్‌లో తెలంగాణా పోలీస్, బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీల మధ్య ఒప్పందం జరిగింది. ఈ సందర్భంగా డీజీపీ జితేందర్ మాట్లాడుతూ.. పోలీస్ డిపోర్ట్‌మెంట్‌లో 10వ తరగతి, ఇంటర్ చదివి గతంలో ఈ పోలీస్ శాఖలో చేరారని గుర్తు చేశారు. అయితే వారికి గ్రాడ్యుయేషన్ కల్పించాలని పోలీస్ శాఖ నిర్ణయం తీసుకుందన్నారు. వాని గ్రాడ్యుయేషన్ చేయించాలనే ఉద్దేశంతో అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీతో ఒప్పందం కుదుర్చు కున్నామని వివరించారు. డిపార్ట్‌మెంట్‌లో దాదాపు కానిస్టేబుల్, హెడ్ కానిస్టేబుల్స్.. 30 వేల మంది గ్రాడ్యుయేషన్ పూర్తి చేయని వారు ఉన్నట్లు తాము గుర్తించామని పేర్కొన్నారు. వచ్చే ఐదేళ్లలో పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో అందరూ గ్రాడ్యుయేషన్ చేసిన వారిగా ఉండాలని తమ సంకల్పమని ఈ సందర్భంగా డీజీపీ జితేందర్ స్పష్టం చేశారు. ఇక అంబేడ్కర్ యూనివర్సిటీ– వీసీ గంటా చక్రపాణి మాట్లాడుతూ.. దేశంలోని అన్ని రాష్ట్రాల పోలీస్ శాఖలకంటే.. మనం అన్ని రకాలుగా ఉత్తమ స్థానంలో ఉన్నామన్నారు. డీజీపీ జితేంద్రకి వచ్చిన అలోచనే ఇప్పుడు కార్యరూపం దాల్చిందని పేర్కొన్నారు. పోలీస్ శాఖలో ప్రస్తుతం వివిధ విభాగాల్లో, పలు పోస్టుల్లో పని చేస్తున్న వారిలో కొందరికి డిగ్రీ అర్హత లేదని తెలిపారు. పలు కారణాలతో డిగ్రీ చేయకపోవడం లేదా డిగ్రీ మధ్యలోనే ఆపేసిన వాళ్లు సైతం ఉన్నారని వివరించారు. అలాంటి వారికి మా యూనివర్సిటీ– ద్వారా ఓపెన్ డిగ్రీ చేసే అవకాశం కల్పిస్తున్నామన్నారు. అంతే కాకుండా.. వీళ్లకు అదనంగా పోలీసింగ్‌కి కావాల్సిన శిక్షణ సైతం అందిస్తామని తెలిపారు. ఒక వైపు విధులు నిర్వహిస్తూనే.. మరోవైపు చదువుకునే వెసులుబాటు– కల్పించనున్నామని తెలిపారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలోని ట్రైనింగ్ సెంటర్లను తాము ఈ అభ్యర్థుల కోసం వినియోగించుకోనున్నామని వీసీ ఘంటా చక్రపాణి చెప్పారు.

## భారీ వర్షాలతో జంటనగర జలాశయాలకు జలకళ

**- మూసీకి వరదతో ప్రమాదకరంగా పలుప్రాంతాలు**

**- నీట మునిగిన పురానాపూల్ స్మశాన వాటిక**

**హైదరాబాద్,ఆగస్ట్14( వెలుతురు):**
భారీ వర్షాలకు హైదరాబాద్‌లోని జలాశయాలు నిండుకుండలా మారాయి. జంట నగరాలకు తాగు నీరు అందించే హిమాయత్ సాగర్ జలకళను సంతరించుకుంది. జలాశయానికి వరద ప్రవాహం పెరగడంతో 9 గేట్ల ద్వారా నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. హిమాయత్ సాగర్ డ్రోన్ దృశ్యాలు కనువిందు చేస్తున్నాయి. హైదరాబాద్‌లో భారీ వర్షాలకు మూసీ పరివాహకంలోని పలు కాలువలు పొంగుతున్నాయి. హిమాయత్ సాగర్ నుంచి భారీగా వరద నీరు వస్తుండటంతో మూసీలో ప్రవాహం పెరిగింది. దీంతో పురానాపూల్ శ్మశాన వాటిక నీట మునిగింది. ఫలితంగా అక్కడ జరగాల్సిన అంత్యక్రియల కు విఘాతం కలిగింది. శవాలకు కాల్చేందుకు ఉపయోగించే కట్టెలు నీటిలో తేలియాడుతున్నాయి. వర్షాల కారణంగా అంబర్‌పేటలోని మూసారాంబాగ్ బ్రిడ్జికి ఆనుకొని గత మూడు రోజులుగా వరద ప్రవహిస్తోంది. బ్రిడ్జి వద్ద వరద ప్రవాహాన్ని తగ్గించడం కోసం మూసీలో పేరుకుపోయిన గుర్రపుడెక్క, బురద మట్టిని హైడ్రా సిబ్బంది తొలగిస్తున్నారు. భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వరద నీరంతా ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్‌లోకి చేరుతుండటంతో నిండుకుండగా మారాయి. దీంతో జలమండలి అధికారులు.. హిమాయత్ సాగర్ గేట్లను ఎత్తి మూసీలోకి వరద నీటిని వదిలారు. దీంతో మూసీ నది ఉధృతంగా ప్రవహిస్తోంది. బాపుఘాట్, జియాగూడ, పురానాపూల్, నయాపూల్, ఛాదర్ ఘాట్, ముసారాంబాగ్ వద్ద మూసీ ఉరకలెత్తుతోంది. జియాగూడ, పురానాపూల్ వద్ద పరివాహక ప్రాంతాలను వరద నీరు ముంచెత్తింది. జియగూడ బైపాస్‌లోకి వరద రావడంతో ఆ మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి. అటువైపు ఎవరూ వెళ్లకుండా పోలీసులు బారికేడ్లు ఏర్పాటు–చేశారు. మూసీని అనుకొని ఉన్న పలు ఆలయాలు, శ్మశాన వాటికల్లోకి వరద నీరు చేరింది. ఛాదర్‌ఘాట్ వద్ద చిన్న వంతెనను తాకుతూ మూసీ ప్రవహిస్తోంది. మరోవైపు ముసారాంబాగ్ వద్ద వంతెనపై నుంచి వరద నీరు ప్రవహిస్తుండటంతో రెండు రోజుల నుంచి పూర్తిగా రాకపోకలను నిలిపివేశారు.

## స్వాతంత్య్ర సమరయోధుల త్యాగాలు నేటి తరానికి స్ఫూరిగా నిలవాలి

**- సినీ రచయిత, రాజ్యసభ సభ్యులు వి.విజయేంద్ర ప్రసాద్**

**- యువత భాగస్వామ్యంతోనే వికసిత్ భారత్**

**- ఆవిష్కరణల భారత్‌గా అవతరించినప్పుడే ప్రపంచంతో పోటీ**

**- హైదరాబాద్ కేంద్ర విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ బి.జగదీశ్వర్ రావు పిలుపు**

**- సీబీసీ తెలుగు స్వాతంత్య్ర సమరయోధులపై సాలార్‌జంగ్ మ్యూజియంలో ఫోటో ప్రదర్శన ఆరంభం**







**హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 14, 2025:**
కేంద్ర సమచార, ప్రసార మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ (సీబీసీ) ఆధ్వర్యంలో తెలుగు స్వాతంత్ర్య సమరయోధులపై సాలార్ జంగ్ మ్యూజియం సెంట్రల్ హాల్ లో ఏర్పాటుచేసిన 5 రోజుల ఛాయాచిత్ర ప్రదర్శనను గురువారం ప్రముఖ సినీ రచయిత, రాజ్యసభ సభ్యులు వి.విజయేంద్ర ప్రసాద్, హైదరాబాద్ కేంద్ర విశ్వవిద్యాలయం(UOH) ఉపకులపతి ప్రొఫెసర్ బి.జగదీశ్వర్‌రావు పత్రికా సమాచార కార్యాలయం, సీబీసీ అదనపు డైరెక్టర్ జనరల్ శృతిపాటిల్‌తో కలిసి ప్రారంభించారు. ఈ ప్రదర్శనలో 1857 సిపాయిల తిరుగుబాటు కాలం నాటి సమర యోధులతోపాటు కొమరం భీం, కాళోజీ నారాయణరావు, సంగం లక్ష్మీబాయమ్మ, ముఖ్దుం మొహినుద్దీన్, దాశరథి తదితర 40 మంది స్వాతంత్ర్య సమరయోధుల వివరాలతోపాటు జాతీయ పతాకం రూపొందిన తీరుపై వివరాలతో కూడిన చిత్రాలు ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా రాజ్యసభ సభ్యులు వి.విజయేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ నాటితరం చేసిన అమూల్యమైన త్యాగాలు నేటి తరానికి స్ఫూర్తినిస్తాయని పేర్కొన్నారు. జాతీయపతాకం అంటే దేశ ప్రజలందరి భావోద్వేగం అన్నారు. ఇలాంటి ప్రదర్శనలు యువతకు మరింత చేరువ చేయాలని ఉపకులపతి ప్రొఫెసర్ జగదీశ్వర్‌రావు కోరారు. ఐదురోజుల ఛాయచిత్ర ప్రదర్శనను యువత సందర్శించాలని కోరారు. ఛాయాచిత్ర ప్రదర్శన ఆరంభం అనంతరం పత్రికా సమాచార కార్యాలయం, సీబీసీ అదనపు సంచాలకులు శృతిపాటిల్ అధ్యక్షతన జరిగిన సదస్సులో ఉపకులపతి ప్రొఫెసర్ జగదీశ్వర్‌రావు మాట్లాడుతూ నూతన తరం దేశ ఆర్థిక వ్యవస్థ, ఆవిష్కరణలలో క్రియాశీల భాగస్వామ్యంతోనే నిజమైన వికసిత్ భారత్ సాధ్యం అవుతుందని హైదరాబాద్ కేంద్ర విశ్వవిద్యాలయం(%ఖూం%) ఉపకులపతి ప్రొఫెసర్ బి.జగదీశ్వర్‌రావు పేర్కొన్నారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో అగ్రభాగాన నిలవాలంటే నూతన ఆవిష్కరణలు మరింత అవసరమని, నేటి యువత ఆ వైపుగా దృష్టి పెట్టాలని కోరారు. బ్రిటీష్ రాకపూర్వం భారతదేశం వాటా ప్రపంచ స్థూల ఉత్పత్తి(జీడీపీ)లో 16శాతంపైగా ఉంటే, ఆ తర్వాత బ్రిటీష్ వారి దోపిడీ కాలంలో ఒక్కశాతం కంటే తక్కువకు పడిపోయిందని ఆవేదన వ్యక్తంచేశారు. స్వాతంత్ర్యం అనంతరం సంప్రదాయ ప్రజాస్వామ్య విలువలతో కూడిన పాలనలో ప్రపంచంలోనే నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా రూపాంతరం చెంది, ఇతర దేశాలకు ఆహార ఎగుమతులు చేస్తున్నప్పటికీ నిజమైన అభివృద్ధి ఇంకా సాధించలేకపోయామని చెప్పారు. ప్రపంచ జనాభాలో ప్రస్తుత దేశ జనాభా వాటా 17శాతం ఉంటే జీడీపీలో వాటా 4శాతం మాత్రమే ఉందన్నారు. నేటి యువత భాగస్వామ్యంతో ఆవిష్కరణలలో కూడా మనదేశ వాటా 20శాతం పెరగడంతోపాటు సాంకేతికత మరింత అభివృద్ధి సాధించి ప్రజలకు చేరువైనప్పుడే నిజమైన వికసిత్ భారత్ సాకారం అవుతుందని ఆయన ఉద్ఘాటించారు. ఈ సందర్భంగా సీబీసీ హైదరాబాద్‌లోని వివిధ డిగ్రీ, పీజీ కళాశాలల విద్యార్థులకు ఆపరేషన్ సిందూర్ – ఆత్మనిర్భర్ భారత్ అనే అంశం మీద వ్యాసరచన, కవిత్వం పోటీలు నిర్వహించింది. ఈ పోటీలలో విజేతలకు ఉపకులపతి ప్రొఫెసర్ జగదీశ్వర్‌రావు, రాజ్యసభ సభ్యులు వి.విజయేంద్ ప్రసాద్ బహుమతులు, సర్టిఫికెట్ లు అందజేశారు. ఈ సందర్భంగా కళాకారులు ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. సదస్సులో ప్రభుత్వ సిటీ డిగ్రీ కళాశాల, వివేక వర్ధిని డిగ్రీ కళాశాల విద్యార్థులు స్వాతంత్ర్య పోరాట యోధులపై కవితలు వినిపించగా వారిని వి.విజయేంద్ర ప్రసాద్ ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో సాలార్‌జంగ్ మ్యూజియం క్యూరేటర్ ఘన్‌శ్యామ్ కుసుమ్, సిబ్బంది రమణి, పీఐబీ ఉపసంచాలకులు డాక్టర్ మానస్ కృష్ణకాంత్, సీబీసీ ఉపసంచాలకులు కరీనా బి.తెంగమామ్, సహాయ సంచాలకులు జి.కోటేశ్వర్‌రావు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## ఇవిఎంలను తెచ్చిందే రాజీవ్ గాంధీ

**- రాయబరేలిలో రాజీనామాచేసి పోటీ చేసే దమ్ముందా**

**- అక్కడ దొంగ ఓట్లతోనే రాహుల్ గెలవగలిగాడు**

**- అఖిలేశ్, డింపుల్, డైమండ్ హార్బర్, వయనాడ్‌లపై అనుమానాలు**

**- మీడియా సమావేశంలో రాహుల్ పై మండిపడ్డ ఎంపి రఘునందన్**



**హైదరాబాద్,ఆగస్ట్14( వెలుతురు):**
దేశానికి ప్రతిపక్ష నేతగా ఉన్న వ్యక్తికి వ్యవస్థల మీద నమ్మకం లేకపోవడం దురదృష్టకరమని మెదక్ బిజెపి ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. హైదరాబాద్‌లోని భాజపా రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. బ్యాలెట్ పేపర్ కాదని ఆ నాటి రాజీవ్‌గాంధీ కాంగ్రెస్ ప్రభుత్వం ఈవీఎంల ద్వారా ఎన్నికలు నిర్వహించింది. రాయ్‌బరేలిలో రాహుల్ రాజీనామా చేయాలి. రాహుల్ రాజీనామా చేస్తే బ్యాలెట్ ద్వారా ఎన్నిక నిర్వహిస్తామని అన్నారు. సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, తెలంగాణ, కర్ణాటకలో కాంగ్రెస్ గెలిస్తే ఈవీఎంలు పనిచేసినట్టు–. బిహార్‌లో ఓడిపోతారు కాబట్టి ఈవీఎంలు పనిచేయడం లేదంటున్నారు. ఈవీఎంలను తెచ్చిందే రాజీవ్‌గాంధీ. రాహుల్‌గాంధీ గెలిచిన రాయ్‌బరేలిలో 2లక్షల ఓట్లు అనుమానంగా కనిపిస్తున్నాయి. అక్కడ దొంగ ఓట్లతో గెలిచారు..రాహుల్ ఎన్నికను రద్దు చేయాలని కోరబోతున్నామని అన్నారు. రాయబరేలి రాజీనామా చేసి బ్యాలెట్ పేపర్‌తో ఎన్నికకు సిద్ధమా? అని కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీని బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు ప్రశ్నించారు. మొదట్లో బీజేపీ ఈవీఎంలను వ్యతిరేకించింది.. కానీ శాస్త్రీయ అధ్యయనం చేసిన తర్వాత ఈవీఎంలకి మద్దతు ఇచ్చామన్నారు. కాంగ్రెస్ గెలిస్తే ఈవీఎంలు కరెక్ట్.. ఓడితే రాంగ్ అంటున్నారు.. రాజీవ్ గాంధీ ఆలోచన ప్రోగ్రెస్, రాహుల్ గాంధీ ఆలోచన డిస్ట్రక్టివ్ అని విమర్శించారు. స్పెషల్ ఇంటె–న్సివ్ రివిజన్‌ను కాంగ్రెస్ వ్యతిరేకిస్తుందని.. బంగ్లాదేశ్ అక్రమ వలస దారులను గుర్తించి ఓటు తీసేస్తారనే భయపట్టుకుందన్నారు. రాహుల్ గాంధీ గెలిచిన రాయబరేలిలో 2 లక్షల ఓట్లపై అనుమానం ఉందని.. 71 వేల 977 ఫేక్ ఓటర్స్ ఉన్నారనన్నారు ఎంపీ రఘునందన్‌రావు. 92 వేల 447 మాస్ ఓటర్ నమోదు చేశారని... 54 వేల ఫేక్ బర్త్ డే సర్టిఫికేట్‌లు పెట్టారని ఆరోపించారు. బెంగాల్‌లో డైమండ్ హార్బర్ నియోజకవర్గంపై, యూపీలో అఖిలేష్ యాదవ్ సతీమణి డింపుల్ యాదవ్ ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంపై మాకు అనుమానాలున్నాయని రఘునందన్ అన్నారు. ఓడిపోతే ఈవీఎంల మీద బురదజల్లి ప్రజలను అయోమయానికి గురి చేస్తున్నారు. రాజ్యాంగాన్ని, న్యాయవ్యవస్థలను కాంగ్రెస్ గౌరవించడం లేదు. ఆరోపణలు చేసే ముందు శాస్త్రీయంగా వ్యవస్థల మీద అధ్యయనం చేయాలని సూచించారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో బ్యాలెట్ పేపర్ ద్వారానే ఎన్నికలు నిర్వహించాలి. ఈవీఎంలను ట్యాంపరింగ్ చేస్తే కేసీఆర్ ఎట్లా ఓడిపోతారు. బంగ్లాదేశ్, భారత్ సరిహద్దు ప్రాంతాల్లో గోడ కట్టాలన్న ప్రతిపాదనను మమత బెనర్జీ తిరస్కరించారు. సరిహద్దు గోడ లేకపోవడం వల్లే బెంగాల్ ద్వారా చొరబాటు దారులు దేశంలోకి ప్రవేశిస్తున్నారు. కేటీఆర్‌కు ఎండదెబ్బ కొట్టి తిక్కతిక్కగా మాట్లాడుతున్నారు. కోర్టు తీర్పులు భాజపాకి ఎందుకు చెంప పెట్టు అవుతాయి. ఎమ్మెల్సీల రద్దుపై తుది తీర్పు ఉంది. తుది తీర్పు వచ్చాక చెంప దెబ్బ ఎవరికి తగులుతుందో చూద్దాం అని రఘునందన్‌రావు అన్నారు. తన నియోజకవర్గంలో కూడా రోహింగ్యలకి ఓటు ఇచ్చారన్నారు. ఫారిన్ ఆర్గనైజేషన్ లు ఏజెన్సీలు దేశ ప్రతిష్ఠను దిగజార్చే ప్రయత్నం చేస్తున్నాయని.. ఫండింగ్ చేస్తున్నాయన్నారు. దొంగ ఓట్లతో గెలిచారని కోర్టు చెబితే ఇందిరా గాంధీ ముఖం చూపించలేక కొంగు కప్పుకొని పోయిందని విమర్శించారు. తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలు బ్యాలెట్ పేపర్‌తో నిర్వహించాలని సూచించారు.

## మైనస్‌లోకి తెలంగాణ ద్రవ్యోల్బణం

**- అస్తవ్యస్త ఆర్థిక విధానాలతోనే ఈ దుస్థితి**

**- ఆర్థిక కార్యకలాపాలు మందగించడమే కారణం**

**- ప్రభుత్వ తీరుపై మండిపడ్డ కెటిఆర్, హరీష్ రావు**




**హైదరాబాద్,ఆగస్ట్14( వెలుతురు):**
వరుసగా రెండు నెలల పాటు తెలంగాణ ద్రవ్యోల్బణం మైనస్‌లోకి పోవడం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ పతనానికి స్పష్టమైన నిదర్శనమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ విమర్శించారు. కేసీఆర్ నాయకత్వంలో తొమ్మిదేండ్ల పాటు–దేశానికే ఆదర్శంగా నిలిచిన తెలంగాణ రాష్ట్రం, కేవలం ఎనిమిది నెలల కాంగ్రెస్ పాలనలో ఆర్థికంగా చితికిపోయిందని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. రేవంత్ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న అస్తవ్యస్త ఆర్థిక విధానాలతోనే తెలంగాణకు ఈ దుస్థితి వచ్చిందని ఆరోపించారు. తెలంగాణ చరిత్రలో తొలిసారిగా జూన్, జులై నెలల్లో ద్రవ్యోల్బణం మైనస్‌లో నమోదైందన్నారు. జులైలో రాష్ట్ర ద్రవ్యోల్బణం –0.44శాతం ఉండగా, జాతీయ సగటు–2.10శాతంగా ఉందని గుర్తు చేశారు. జూన్‌లో రాష్ట్రంలో –0.93శాతంగా ఉంటే, దేశవ్యాప్తంగా 1.55శాతంగా ఉందని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో ద్రవ్యోల్బణం తగ్గుదల మరింత తీవ్రంగా ఉందని కేటీఆర్ తెలిపారు. ద్రవ్యోల్బణం తగ్గడం సానుకూల సంకేతాలు కావన్న ఆయన.. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు ఇది ప్రమాదకర సంకేతమని హెచ్చరించారు. ప్రజలు అత్యవసరాలకు మాత్రమే ఖర్చు చేస్తున్నారని, వ్యాపార, వాణిజ్య, పారిశ్రామిక రంగాలన్నీ స్తంభించిపోయాయన్నారు. కొత్త ఉద్యోగాల కల్పన లేకపోవడం, ఆర్థిక కార్యకలాపాలు మందగించడమే ఈ పరిస్థితికి కారణమన్న ఆర్థిక నిపుణుల సూచనలపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని సూచించారు. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్థిక కార్యకలాపాలను పూర్తిగా నిర్వీర్యం చేసిందని కేటీ–ఆర్ మండిపడ్డారు. ఒకప్పుడు దేశంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న తెలంగాణ ఇప్పుడు తిరోగమనంలోకి వెళ్లడం బాధాకరమని.. క్లూలెస్ కాంగ్రెస్ పాలనలో శక్తివంతమైన ఆర్థిక వ్యవస్థ నాశనమవుతోందని.. హోప్‌లెస్ గవర్నమెంట్, హోప్‌లెస్ గవర్నెన్స్ అంటూ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఆచరణ సాధ్యం కాని హామీలు ఇచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఆశలు చూపించి మోసం చేసిందని కేటీఆర్ విమర్శించారు. ఉద్యోగ కల్పనకు సంబంధించి ప్రభుత్వం దగ్గర ఎలాంటి స్పష్టమైన ప్రణాళిక లేదని ఆరోపించారు. గతంలో బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రం ఐటీ–, ఫార్మా, రియల్ ఎస్టేట్ రంగాల్లో దూసుకెళ్లిందని, ఇప్పుడు ఆ రంగాలన్నీ కుదేలయ్యాయని ఆరోపించారు. ఆర్థిక వ్యవస్థను మళ్లీ గాడిలో పెట్టేందుకు ప్రభుత్వం వెంటనే సమర్థవంతమైన చర్యలు చేపట్టాలని కేటీ–ఆర్ డిమాండ్ చేశారు. రాష్ట్ర భవిష్యత్తు అంధకారంలోకి పోకుండా ఉండడానికి తక్షణమే ఆర్థిక సంస్కరణలు, ఉద్యోగ కల్పన కార్యక్రమాలను ప్రభుత్వం ప్రారంభించాలని సూచించారు. లేకపోతే, తెలంగాణ ఆర్థిక భవిష్యత్తు మరింత దిగజారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రం మళ్లీ పురోగతి పథంలో నడవాలంటే, ప్రభుత్వం తన వైఫల్యాలను సరిదిద్దుకోవాలని కేటీ–ఆర్ హితవు పలికారు. అలాగే మాజీ మంత్రి హరీష్ రావు మరోసారి కాంగ్రెస్ సర్కార్‌పై ఫైర్ అయ్యారు. సీఎం రేవంత్ రెడ్డి ఆర్థిక నిర్వహణలో వైఫల్యం చెందారని.. ఆయన ఆరోపించారు. రాష్ట్రం ప్రమాదకర ద్రవ్యోల్బణ స్థాయిలోకి ప్రవేశించిందని తెలిపారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. తెలంగాణ వరుసగా రెండో నెల కూడా ద్రవ్యోల్బణంలోకి జారుకుందని హరీష్ రావు చెప్పుకొచ్చారు. ఆర్థిక వ్యవస్థ రివర్స్ గేర్‌లో ఉందనడానికి ఇది ప్రమాదకరమైన సంకేతమని తెలిపారు. డిమాండ్ కుప్పకూలిపోతున్నా.. రేవంత్ రెడ్డి ప్రభుత్వం పక్క నుండి చూస్తోందని విమర్శించారు. ఆరోగ్యకరమైన వృద్ధిని నిర్ధారించడానికి భారత రిజర్వ్ బ్యాంక్ కూడా ద్రవ్యోల్బణాన్ని 2–6శాతం మధ్య ఉంచాలని లక్ష్యంగా పెట్టు–కుందని సూచించారు. కానీ తెలంగాణ ఇప్పుడు 0 శాతం కంటే తక్కువగా ఉందని వివరించారు. గ్రామీణ, పట్టణ ద్రవ్యోల్బణం జూన్‌లో –0.93 శాతం ఉంటే.. జూలైలో –0.44 శాతానికి కు పడిపోయిందని పేర్కొన్నారు. ఇది విజయం కాదు.. ఇది ఆర్థిక రెడ్ అలర్ట్ ఆయన స్పష్టం చేశారు.

# సంపాదకీయం.. ఆత్మవిమర్శ చేసుకునే సమయమిది !

భారతదేశం 79వ స్వాతంత్ర్య దినోత్సవం జరుపుకుంటున్న వేళ..పాలకులు, ప్రభుత్వసంస్థలు ఆత్మవిమర్శ చేసుకుని ముందుకు సాగాల్సి ఉంది. మనం నిజాయితీగా పాలన చేస్తున్నామా అని కేంద్ర, రాష్ట్ర పాలకులు ఆలోచన చేయాలి. ఇన్నేళ్లయినా ఇంకా దరిద్రం తొలగిపోలేదు. ఇన్నేళ్లయినా ఇంకా పేదలు పేదలుగా ఉండి పోతున్నారు. పెద్దలు మరింత పెద్దలుగా మారుతున్నారు. ఆస్తులు, అంతస్తులు, డబ్బులు కొద్ది మంది వద్దే పరిమితం అవుతున్నాయి. ఇలా ఎందుకు జరుగుతుందో ఆలోచన చేయాలి. పేదల ఆకలి తీర్చే పేరుతో దుబారాలు చేస్తున్నారు. రాజకీయ నేతలు తమ విలాసాలకు ప్రజాధానం వృధా చేస్తున్నారు. పెన్షన్లు పంచడానికి విమానాలు, ప్రత్యేక హెలికాప్టర్లు ఎక్కి ఊరేగుతున్నారు. 43 ఏళ్ల క్రితం కిలో రెండు రూపాయల బియ్యం ఇస్తే... ఇప్పుడు దాని ధర రూపాయికి పడిపోయింది. ఇలా అన్ని సరుకుల ధరలు పడిపోయాయా అంటే లేదు. పేదలు ఇంకా ఉన్నారంటే పాలకుల అసమర్థతగానే చెప్పుకోవాలి. సామాజిక సంక్షేమ పథకాల దుర్వినియోగం వంటి ఆరోపణలతో ఇటీవల ప్రజాస్వామ్య సమగ్రతపై నీలినీడలు కమ్మేశాయి. పాలన సక్రమంగా సాగడం లేదనడానికి ఈ పథకం ఒక్కటి చాలు. ఇకపోతే 79 ఏళ్ల తరవాత కూడా స్వేచ్ఛగా ఓటేయలేకపోతున్నాం. మనం ఓటేయడానికి వెళ్లే సరికి ఆ ఓటు ఎవరో ఒకరు వేసి పోతున్నారు. ఇదంతా కేవలం ఎన్నికల సంఘం అనుసరిస్తున్న లోపభూయిష్ట విధానంగానే చూడాలి. ఎందుకంటే పక్కాగా ఓటరు కార్డు నేటికీ అమల్లోకి రాలేదు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఓటేయాలన్న ఆంక్షలు లేవు. ఈ రెండు అమలయితే ప్రజాస్వామ్యం మరింత బలపడుతుంది. ఒకటి పక్కాగా ఓటరుకార్డు ఉండాలి. ప్రతి ఒక్కరూ విధిగా







ఓటేయాలి. ఈ రెండు అంశాలపై ఎన్నికల సంఘం దృష్టి పెట్టాలి. ఆధార్, పాన్ కార్డు తరహాలో ఓటుకు పక్కా పర్మినెంట్ నంబరు ఉంటే ఇక దొంగ ఓట్ల ప్రసక్తి రాదు. 79వ స్వాతంత్ర్య దినోత్సవంజరుపుకుంటున్న వేళ ఎన్నికల సంఘం ఈ రెండు అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలి. పాలకులు తామే నిరంతరంగా అధికారంలో ఉండేందుకు నానాగడ్డీ కరుస్తున్నారు. అదే ఇప్పుడు దొంగ ఓట్లు, బూతుల క్యాప్చర్ వంటి సమస్యలకు దారితీస్తోంది. దీనిని నివారించగలగాలి. దేశంలో ఓటరు జాబితాల తయారీ, సవరణ కసరత్తును చేపట్టే అధికారం ఎన్నికల సంఘాని ఉంది. ఇది నిరంతర ప్రక్రియ కూడా. ఓటరు జాబితాను ఏటా సవరించడంలో తప్పు లేదు. అయితే పర్మినెంట్ ఓటరు కార్డు ద్వారా చనిపోయిన వారి పేర్లు తొలగించేందుకుమాత్రమే సవరణ జరగాలి. 18 ఏళ్లు నిండిన వారు విధిగా ఓటరుగా నమోదు చేయించే ప్రక్రియ రావాలి. అంతే తప్ప ఓటరు జాబితా సవరణను పెద్ద తతంగంగా చేయరాదు. పర్మినెంట్ ఓటర్ కార్డు వస్తే..నిరంతరంగా మార్పులు చేర్పులు చేయాల్సిన అసరం రాకపోవచ్చు. ప్రపంచం లోనే అతిపెద్ద ప్రజాస్వామ్యదేశంగా భారతదేశం ఖ్యాతిని పొందింది. లక్షలాది మంది స్వేచ్ఛగా, నిష్పాక్షి కమైన ఎన్నికల ద్వారా సమర్థులైన నాయకులను ఎన్నుకునే అవకాశం మనదేశంలోనే ఉంది. శక్తివంతమైన ఎన్నికల పక్రియకు చాలా కాలంగా ప్రశంసలు పొందింది. అయితే, ఓటర్ల జాబితాలో అవకతవకలు, జెర్రీ మాండరింగ్ ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల ట్యాంపరింగ్ వంటి ఆరోపణలు తరచూ వస్తున్నాయి. ఇవన్నీ తప్పకుండా సమీక్షించాల్సిన అసవరం ఉంది. భారత ప్రజాస్వామ్యంపై వాటి ప్రభావం, ఎన్నికల పక్రియలో ప్రజల విశ్వాసాన్ని పునరుద్ధరించేందుకు తక్షణ సంస్కరణలను పరిశీలించాల్సిందే. ఇటీవల బీహార్‌లో ఓటర్ల సవరణ సందర్భంగా పెద్ద ఎత్తున ఓటర్ల జాబితా తారుమారు జరిగాయనే ఆరోపణలు వచ్చాయి. దీనిపై ప్రతిపక్షాలు ఆందోళనకు దిగాయి. నకిలీ ఓటర్లు లేదా చెల్లని చిరునామా గల ఓటర్లు, ఒకే అడ్రస్‌లో నమోదు చేసుకున్న బల్క్ ఓటర్లు, గుర్తించలేని ఫోటోలు ఉన్న ఓటర్లు, నకిలీలు, మొదటిసారి ఓటర్లను నమోదు చేసే ఫారం 6 దుర్వినియోగం వంటివాటిపై ఇసి నిష్పక్షపాతంగా విచారణ చేయాలి. ఇవన్నీ చక్కబెట్టుకుం టూనే.. స్వేచ్ఛగా, నిష్పాక్షికంగా ఎన్నికలు నిర్వహించాల్సిన బాధ్యత భారత ఎన్నికల కమిషన్ పైన ఉంది.అయితే తరచూ వస్తున్న ఇలాంటి ఆరోపణలపై స్పందించకపోవడంతో తీవ్రవిమర్శలు ఎదుర్కొంటోంది. ఇది ఎన్నికల కమిషన్ నిష్పాక్షికత, పారదర్శకత పట్ల అనుమానాలను లేవనెత్తుతోంది. స్పష్టంగా చదువ గలిగే ఓటర్ల జాబితాను అందించేందుకు నిరాకరించడం మరిన్ని అనుమానాలను రేకెత్తిస్తోంది. ఒక పార్టీకి అనుకూలంగా నియోజకవర్గ హద్దులను తారుమారు చేసే పద్ధతిపైనా ఇసి దృష్టి సారించాలి. తమకు అనుకూలమైన ఫలితాలు రాబట్టేందుకు నియోజకవర్గాల రూపురేఖలు మార్చేందుకు ఆయా రాష్ట్రాల్లో ఉన్న పాలకులు వ్యూహాత్మకంగా కొత్త ఓటర్లను చేర్చడమో, తొలగించడమో చేస్తున్నట్లు తరచూ ఆరోపణలు వస్తున్నాయి. ఓటర్ల జనాభాలో చిన్నమార్పు ఫలితాలను నిర్ణయించే అవకాశం ఉంటుంది. డీలిమిషన్ పక్రియలో పారదర్శకత లేకపోవడం, ఈ సమస్య పరిష్కారానికి ఇసి విముఖత చూపించడం వల్ల, అధికార పార్టీ ఎన్నికల సరిహద్దులు తనకు అనుకూలంగా మార్చి, పాలనా పక్రియపై తన ప్రభావం చూపుతోందనే ఆరోపణలు వస్తున్నాయి. భారత ఎన్నికలలో ఇవిఎం ట్యాంపరింగ్ ఆరోపణలు ఎంతో కాలంగా వివాదా స్పదంగా మారాయి.

ఈ మధ్య ఓటర్ల జాబితా తారుమారు కీలక అంశం అయింది. అయితే ఇవిఎంల ట్యాంపరింగ్‌కు కచ్చితమైన ఆధారాలు లేవు. ఓట్ల లెక్కింపులో పారదర్శకతను నిర్ధారించే వివి పాట్‌లను విస్తృతంగా ఉపయోగించాలన్న ప్రతిపక్షాల డిమాండ్‌ను ఎన్నికల కమిషన్ పట్టించుకోకపోవడం ఎన్నికల వ్యవస్థపై నమ్మకాన్ని క్షీణింపజేస్తోంది. అలాగే ఓటర్లను ఆకట్టుకునేందుకు ప్రభుత్వం సంక్షేమ పథకాలను దుర్వినియోగం చేస్తున్నదనే ఆరోపణలు ఉన్నాయి. ప్రత్యక్ష నగదు బదిలీ, సబ్సిడీతో ఆహారం, ఇళ్ల నిర్మాణ పథకాలు, సంక్షేమ కార్యక్రమాలను ఓటర్లను, ముఖ్యంగా గ్రామీణ, ఆర్థికంగా వెనుకబడిన ప్రాంతాలను ఆకట్టుకునే సాధనాలుగా మారాయి. ఇలాంటి ఉచిత పథకాలపైనా ఇసి దృష్టి సారించాలి. ఈ పథకాలు పేదల స్థితిగతులను మెరుగుపరచేందుకే అని చెబుతున్నా అధికార,ప్రతిపక్షపార్టీలు మాత్రం వ్యూహాత్మకంగా ఎన్నికలే లక్ష్యంగా ప్రకటనలు చేస్తున్నాయి. ఓటర్ల జాబితా తారుమారు, జెర్రీ మాండరింగ్, ఇవిఎంలపై అనుమానాలు, సంక్షేమ పథకాల దుర్వినియోగాల ప్రభావం భారత ప్రజాస్వామ్య పక్రియ చట్టబద్ధతకు తీవ్ర ముప్పును కలిగిస్తున్నాయి. ఎన్నికల కమిషన్ నిష్పాక్షికంగా వ్యవహరించలేకపోతే ప్రజాస్వామ్యం లేదనే చెప్పాలి. ఎన్నికల వ్యవస్థ పక్షపాత ధోరణితో ఉందన్న ఆరోపణలకు ఇసి జవాబుదారీగా ఉండాలి. సమస్యలపై ఆరోపణలు రాగానే నిజాయితీగా నిలబడాలి. విమర్శలకు జవాబు ఇవ్వాలి. అప్పుడే మన ప్రజాస్వామ్యం బలపడుతుంది. భారతదేశ ప్రజాస్వామ్య పరిరక్షణకు తక్షణ సంస్కరణలు అవసరం అన్న విషయం గుర్తిస్తేనే మనం మరింత బలంగా మనుగడ సాధించగలం.

# ప్రజాస్వామ్యంలో ఎన్నికల విశ్వసనీయత - రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడాల్సిన అత్యవసరం.!

భారత రాజ్యాంగం ప్రకారం ప్రతి పౌరుడు 18 సంవత్సరాలు పూర్తిచేసుకున్న వెంటనే ఓటు హక్కు పొందుతాడు. ఇది పౌరునికి లభించే అత్యంత ప్రాథమిక హక్కుల్లో ఒకటి. ప్రజాస్వామ్యంలో ఎన్నికల ప్రక్రియనే అధికారం ప్రజల చేతుల్లో ఉండేలా చేసే ప్రధాన పునాది. ఈ వ్యవస్థలో పేద, ధనిక తేడా లేకుండా అందరికీ ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం ఉంటుంది. కానీ, గత అనుభవాలను పరిశీలిస్తే ధనబలం, అధికారబలం ఎన్నికల స్వచ్ఛతకు ఎప్పటినుంచో పెద్ద ముప్పుగా నిలిచిన వాస్తవం అందరికీ తెలిసిందే.పౌరసత్వాన్ని నిరూపించుకోవాల్సిన బాధ్యత ఏ సమయంలోనూ ఓటరు పై పెట్టింది లేదు.326వ అధి కరణాన్ని గనక లోతుగా పరిశీలిస్తే ఓటు హక్కు సార్వత్రిక కల్పనపై తప్ప పౌరసత్వంపై వక్కాణింపు ఇవ్వలేదు. ఓటర్ జాబితాల పరిశీలన నిరంతరం జరుగుతుంటుంది. ఆ విధంగా తాజా పర్చే ప్రక్రియకూ భరోసా వుంటుంది. ప్రస్తుత ఇ.సి పరమ పవిత్రమైందిగా చెబుతున్న 2003 ఓట్ల సవరణలో కూడా ఓటర్ల నుంచి పౌరసత్వ ఆధారం ప్రత్యక్షంగా అడిగింది లేదు. ఇ.సి పాత రికార్డులు, ఆ కాలపు మీడియా నివేదికలు ఈ వాస్తవానికి నిదర్శనంగా వున్నాయి. కానీ సర్ ప్రక్రియ కృత్రిమంగా సృష్టించిన పేరు గనకే ఈ రికార్డులలో ఎక్కడా కనిపించదు. అది సమగ్రమైంది కాదు, స్థూలమైందీ కాదు. ఇది పౌరసత్వాన్ని నిరూపించే బాధ్యత ఓటరుపై మోపుతున్నది. మొదటి నుంచి అనుసరిస్తున్న ప్రాథమిక సూత్రాలకే ఇది వ్యతిరేకం.ఇటీవల సంవత్సరాల్లో వీటికి తోడు మరో ప్రమాదకర ధోరణి పెరుగుతోంది – ఎన్నికల ప్రక్రియలో అక్రమాలకు పాల్పడటం. ఇది ప్రజాస్వామ్య విలువలకు తిలోదకాలు ఇచ్చే చర్య. ఎన్నికలు కూడా విశ్వసనీయంగా జరగకపోతే ప్రజల్లో విశ్వాసం దెబ్బతింటుంది, దేశ రాజకీయ వ్యవస్థ బలహీనమవుతుంది.2024 లోక్‌సభ ఎన్నికల ఫలితాలు ఈ చర్చకు కొత్త ఊపునిచ్చాయి. బీజేపీ 240 సీట్లు గెలుచుకొని, సంఖ్యా బలంలో ఆధిక్యం సాధించింది. కానీ, ఇరవై ఐదు సీట్లు తక్కువగా వచ్చి ఉంటే ప్రభుత్వం ఏర్పాటు చేయడం అసాధ్యం అయ్యేదని విశ్లేషకులు చెబుతున్నారు. ముఖ్యంగా కొన్ని రాష్ట్రాల్లో ం హర్యానా, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర ం బీజేపీ ఓటమి అంచనాలను తారుమారు చేసి గెలిచిన తీరు అనేక అనుమానాలకు దారితీసింది. కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ సహా పలువురు ప్రతిపక్ష నేతలు ఎన్నికల ఫలితాలపై గంభీరమైన ప్రశ్నలు లేవనెత్తారు. భారీ స్థాయిలో అక్రమాలు జరిగాయనే ఆరోపణలు వచ్చాయి. ఇది కేవలం ఓ రాజకీయ వాదోపవాదం మాత్రమే కాకుండా, ఎన్నికల యంత్రాంగంపై ప్రజలకు ఉన్న విశ్వాసాన్ని పరీక్షించే పరిస్థితి.ఇలాంటి సందర్భాల్లో న్యాయవ్యవస్థ జోక్యం అత్యంత కీలకం. పారదర్శకమైన, సమగ్ర విచారణ జరిపితేనే నిజానిజాలు వెలుగులోకి వస్తాయి. ఎన్నికల ప్రక్రియలో ఏవైనా లోపాలు, అవకతవకలు బయటపడితే, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి. అలాంటి చర్యల ద్వారానే భవిష్యత్తులో ఎవరైనా ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీయాలనే ప్రయత్నం చేయకుండా నిరోధించవచ్చు.ఎన్నికల సంఘం (EC) రాజ్యాంగబద్ధమైన స్వతంత్ర సంస్థ. దీని బాధ్యత ఎన్నికలను నిష్పక్షపాతంగా, న్యాయంగా నిర్వహించడం. కానీ ఇది ప్రజాస్వామ్యం, రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా ప్రవర్తిస్తే దేశ భవిష్యత్తు ప్రమాదంలో పడుతుంది. ప్రజలు ఎన్నికలపై నమ్మకం కోల్పోతే, వ్యవస్థపై విశ్వాసం కుంగిపోతుంది. ఇది చివరికి ప్రజాస్వామ్యనిర్మాణానికేముప్పు.అందువల్ల, ప్రజాస్వామ్య బలపాటుకు ఎన్నికల విశ్వసనీయతను కాపాడటం తప్పనిసరి. అక్రమాలను మూలం తోలు తీయడం, దోషులను కఠినంగా శిక్షించడం, ఎన్నికల పారదర్శకతను పెంపొందించే సంస్కరణలు తీసుకురావడం ఈ దిశలో కీలక చర్యలు. ఈ ప్రయత్నాల ద్వారానే ప్రజాస్వామ్యం తన అసలు అర్థాన్ని, విలువను కాపాడుకోగలదు.

### ఎన్నికల కమిషన్ విశ్వసనీయత:

భారత ఎన్నికల నిర్వహణ విశ్వసనీయతపై మరోసారి దేశవ్యాప్తంగా తీవ్ర చర్చ నడుస్తోంది. ఎన్నికల ప్రక్రియ, ప్రజాస్వామ్య పునాది అని చెప్పుకునే వ్యవస్థపై ఉత్కంఠ కలిగించే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇదే పరిస్థితి 2009 సాధారణ ఎన్నికల తరువాత కూడా కనిపించింది. అప్పట్లో రాజకీయ పక్షాలు, కొంతమంది మేధావులు, సాంకేతిక నిపుణులు ఎన్నికలలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ల వినియోగం ప్రజాస్వామ్యాన్ని ప్రమాదంలోకి నెడుతోందని వాదించారు. ఆ ఆరోపణలు కోర్టుల వరకు వెళ్లాయి. ఎన్నికల కమిషన్‌కి కూడా అనేక ఫిర్యాదులు చేరాయి. ఇప్పుడు, ఇటీవల ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత, అదే స్థాయిలో ఈ చర్చ మళ్లీ ప్రబలింది. అంతేకాకుండా పాత పద్ధతి అయిన బ్యాలెట్ పేపర్ ద్వారానే ఎన్నికలు నిర్వహించాలన్న డిమాండ్లు దేశవ్యాప్తంగా వినిపిస్తున్నాయి. భారతదేశంలో ఇవిఎంలు పూర్తిస్థాయిలో వినియోగం మొదటిసారి 2004 సాధారణ ఎన్నికల్లో ప్రారంభమైంది. అయితే, ఈ సాంకేతిక పద్ధతి ప్రయాణం 1982లోనే మొదలైంది. కేరళలోని పరిమిత నియోజకవర్గాల్లో మొదటిసారి ఇవిఎంలను ప్రయోగాత్మకంగా ఉపయోగించారు. తరువాత 1989–90లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ , మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఢిల్లీ రాష్ట్రాల్లోని 16 అసెంబ్లీ నియోజకవర్గాల్లో వాటిని వినియోగించారు. మధ్యప్రదేశ్‌లో 5, రాజస్థాన్‌లో 5, ఢిల్లీలో 6 నియోజకవర్గాలు ఈ ప్రయోగంలో భాగమయ్యాయి. 1998 నవంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కూడా కొన్ని ప్రాంతాల్లో ఇవిఎంలను ఉపయోగించారు. ఈ యంత్రాలను బెంగళూరులోని భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (BEL), హైదరాబాదులోని ఎలక్ట్రానిక్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ECIL) తయారు చేస్తాయి. ఒక ఇవిఎం గరిష్టంగా 3,840 ఓట్లు మాత్రమే నమోదు చేయగలదు. సాధారణంగా ఒక పోలింగ్ కేంద్రంలో 1,500 కంటే ఎక్కువ ఓటర్లు ఉండరు, కనుక ఈ సామర్థ్యం సరిపోతుంది. ఒక ఇవిఎంలో గరిష్టంగా 64 మంది అభ్యర్థుల పేర్లు పొందుపరచవచ్చు. అయితే, బ్యాలెట్ పేపర్ విధానంలో ఒక పేపర్లో 16 మంది పేర్లకు మాత్రమే స్థానం ఉంటుంది. అంతకంటే ఎక్కువ అయితే మరొక బ్యాలెట్ జోడించాలి. అంటే, 64 మంది అభ్యర్థులను పొందుపరచాలంటే బ్యాలెట్ పద్ధతిలో నాలుగు పేజీలు అవసరం అవుతాయి. 64 మందికి మించి అభ్యర్థులు ఉన్న నియోజకవర్గాల్లో ఇవిఎంల వినియోగం సాధ్యం కాదు. ఆ సందర్భంలో తప్పనిసరిగా బ్యాలెట్ పేపర్ ద్వారానే ఎన్నికలు నిర్వహించాలి. 1989–90లో ఒక ఇవిఎం కొనుగోలుకు ?5,500 ఖర్చయ్యేది అని అధికారిక రికార్డులు చెబుతున్నాయి.2004లో ఇవిఎంలను దేశవ్యాప్తంగా అమలు చేసినప్పుడు రాజకీయ పార్టీలు పెద్దగా స్పందించలేదు. వ్యతిరేకం కూడా కాదు, మద్దతు కూడా కాదు. కానీ కొంతమంది సాంకేతిక నిపుణులు మొదటి నుంచే అనుమానాలు వ్యక్తం చేశారు. సిపిఎం కూడా ఈ అనుమానాలను నివృత్తి చేయాలని ఎన్నికల కమిషన్‌ను కోరింది. 2004 ఎన్నికల్లో కాంగ్రెస్ కేంద్రంలోనే కాకుండా, పలు రాష్ట్రాల్లో కూడా అధికారంలోకి వచ్చింది. ప్రజలు అప్పటి వరకు అధికారంలో ఉన్న పార్టీలను ఓడించి కాంగ్రెస్‌కు అధికారం ఇచ్చారు. దాన్ని సహజమైన అధికార మార్పిడి అనుకున్నారు. కానీ 2009 సాధారణ ఎన్నికల్లో మళ్లీ కాంగ్రెస్ గెలిచినప్పుడు బీజేపీ ఇవిఎంలపై తీవ్ర ఆరోపణలు చేసింది. యంత్రాలను ట్యాంపరింగ్ చేశారని, ఫలితాలను వక్రీకరించారని బీజేపీ ఆరోపించింది. బీజేపీతో పాటు, అప్పటి వరకు అధికారంలో ఉన్న కానీ ఓడిపోయిన పలు రాష్ట్రాల ప్రాంతీయ పార్టీలు కూడా ఇదే ఆరోపణలు చేశాయి. అవిభక్త ఆంధ్రప్రదేశ్‌లో టిడిపి వరుసగా రెండోసారి ఓడిపోయింది. తమిళనాడులో 2006 అసెంబ్లీ, 2009 పార్లమెంట్ ఎన్నికల్లో అన్నాడిఎంకె ఘోర ఓటమి చవిచూసింది. దీంతో చంద్రబాబు నాయుడు, జయలలిత ఇద్దరూ బహిరంగంగా ఇవిఎంలను విమర్శించారు. బీజేపీ దేశవ్యాప్తంగా ఉద్యమాలు చేసింది. చంద్రబాబు నేరుగా ఢిల్లీలో నిరసన నిర్వహించారు. సుప్రీంకోర్టులో పిటిషన్లు వేశారు. అంతర్జాతీయ సాంకేతిక బృందాలు ఇవిఎంల భద్రతపై అధ్యయనాలు చేశాయి. కొన్ని సంస్థలు ఇవి ట్యాంపరింగ్‌కు లోనవుతున్నాయని స్పష్టంగా నివేదికల్లో పేర్కొన్నాయి. ఇకప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యం అయిన భారతదేశం, స్వేచ్ఛా, నిష్పాక్షిక ఎన్నికల కోసం చాలా కాలంగా ప్రశంసలు అందుకుంటోంది. కానీ ఓటర్ల జాబితాల్లో అవకతవకలు, నియోజకవర్గాల పునర్విభజనలో (జెర్రీమాండరింగ్) అక్రమాలు, ఇవిఎంల ట్యాంపరింగ్, సంక్షేమ పథకాల దుర్వినియోగం వంటి ఆరోపణలు ప్రజాస్వామ్య సమగ్రతపై మబ్బులు కమ్మేశాయి. లోక్సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీతో పాటు పలు పార్టీలు, అధికార బీజేపీ ఎన్నికల మైదానాన్ని తమకు అనుకూలంగా మార్చుకునేందుకు వ్యవస్థబద్ధంగా ప్రయత్నిస్తోందని వాదిస్తున్నాయి.

ఇది కేవలం ఆరోపణల స్థాయిలోనే కాకుండా, కొన్ని ఉదంతాలు ఆ అనుమానాలకు బలాన్నిస్తున్నాయి. ఉదాహరణకు బీహార్‌లో ఐదు నెలల్లో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల ముందు ఎన్నికల కమిషన్ ప్రత్యేక ముమ్మర ఓటర్ల జాబితా సవరణ ఆదేశించింది. 7.89 కోట్ల ఓటర్లున్న రాష్ట్రంలో రెండు నెలల్లో అందరి పత్రాలు సేకరించడం, ఇంటింటి సర్వే చేసి తప్పులేని జాబితా తయారు చేయడం అసాధ్యం. 2025 జనవరి 'సమ్మరీ రివిజన్' జాబితా నుంచి 65 లక్షల పేర్లు అదృశ్యమయ్యాయి. వీరిలో ఎక్కువమంది దళితులు, మైనారిటీలు, బలహీన వర్గాలకు చెందిన వారే. ఎన్నికల కమిషన్ మొదట 'బహుశా చనిపోయి ఉంటారు లేదా శాశ్వతంగా నివాసం మార్చి ఉంటారు' అని చెప్పింది. తరువాత 'తెలుసుకున్న మేరకు చనిపోయిన వారు లేదా నివాసం మార్చిన వారు' అని సవరించింది. ప్రతిపక్షాలు దీన్ని పేదల ఓట్లను తొలగించి మెజారిటీ వాదులకు అధికారం కట్టబెట్టే కుట్రగా అభివర్ణిస్తున్నాయి. కర్ణాటకలోని మహదేవపురం అసెంబ్లీ నియోజకవర్గంలో జరిగిన సంఘటన ఈ ఆరోపణలను మరింత బలపరిచింది. రాహుల్ గాంధీ అక్కడ జరిగిన 'ఓటు చోరీ' ఉదంతాన్ని బహిర్గతం చేశారు. ఎలక్ట్రానిక్ ఓటర్ల జాబితా, పోలింగ్ సిసి టివి ఫుటేజీ ఇవ్వమని కోరగా, ఎన్నికల కమిషన్ తిరస్కరించింది. పరిమిత స్థాయిలో రిగ్గింగ్, దొంగ ఓట్ల విషయం ప్రజలకు తెలిసిందే కానీ, పెద్ద సంఖ్యలో ఒక వర్గం ఓట్లను తీసివేయడం లేదా చేర్చడం, అర్ధరాత్రి వరకు పోలింగ్ నిర్వహించడం ద్వారా ఫలితాలను మార్చడం వంటి ఆరోపణలు ప్రజలను కలవరపెడుతున్నాయి.ఇది కేవలం బీహార్ లేదా రాబోయే ఒడిశా, పశ్చిమ బెంగాల్, కేరళ, తమిళనాడు ఎన్నికల సమస్య మాత్రమే కాదు. ఇది దేశవ్యాప్తంగా ప్రజాస్వామ్యానికి ముప్పు. ఇలాంటి ఆరోపణలను ఎదుర్కొనే బదులు, ఎన్నికల కమిషన్ ప్రతిస్పందనలో సానుకూలత చూపకపోవడం మరింత అనుమానాలు రేకెత్తిస్తోంది. పార్లమెంట్ నుంచి ఎన్నికల కమిషన్ కార్యాలయానికి ఇండీ కూటమి ఎంపీలు చేపట్టిన ర్యాలీని పోలీసులు అడ్డుకోవడం, ఎంపీల బృందాన్ని కలవడానికి ఎన్నికల కమిషన్ నిరాకరించడం ప్రజాస్వామ్య దృక్పథానికి విరుద్ధం. ఎన్నికల ముందు ఓటర్ల జాబితా సవరణలో పౌరసత్వాన్ని నిరూపించుకునే బాధ్యతను ప్రజలపై మోపడం అనేది ఉద్దేశపూర్వక చర్యగా కనిపిస్తోంది.ఇదే తరహాలో మధ్యప్రదేశ్, హర్యానా, మహారాష్ట్రలో జరిగిన ఎన్నికల్లో దొంగ ఓట్లు చేర్చడం, ఫలితాలను తారుమారు చేయడం జరిగిందని ఆరోపణలు వచ్చాయి. ఇలాంటి సందర్భాల్లో ఎన్నికల కమిషన్ 'చట్టంలో నిబంధన లేదు' అనే సాకుతో వివరాలను ఇవ్వకుండా తప్పించుకోవడం వ్యవస్థపై విశ్వాసాన్ని దెబ్బతీస్తోంది. రాహుల్ గాంధీ ప్రస్తావించిన మహదేవపురం సంఘటనపై సమగ్ర దర్యాప్తు జరిపి వాస్తవాలు వెల్లడించడం ఎన్నికల కమిషన్ బాధ్యత. ప్రజాస్వామ్యం కాపాడుకోవాలంటే ఎన్నికల కమిషన్ నిజాయితీపై ప్రజల్లో విశ్వాసం పెంచాలి. కానీ ప్రస్తుతం ఆ విశ్వాసం అత్యల్ప స్థాయిలో ఉందని చెప్పాలి. ప్రజాస్వామ్యం పునాది అయిన ఎన్నికల ప్రక్రియపై ఈ స్థాయి అనుమానాలు ఉండటం, వాటి నివృత్తి కోసం సరైన చర్యలు తీసుకోకపోవడం భవిష్యత్తులో దేశ రాజకీయ వ్యవస్థపై దూరప్రభావాలు చూపే ప్రమాదం ఉంది.ఇక ప్రజాస్వామ్యంలో దొంగ ఓట్లకు ఎట్టి పరిస్థితుల్లోనూ తావు ఉండకూడదు. ప్రతి పౌరునికి ఒకే ఓటు ఉండాలి. ఒకరి పేరు మీద మరొకరు ఓటు వేయడం, నకిలీ ఓటరు గుర్తింపు కార్డులు తయారు చేయడం, లేదా లంచం, బెదిరింపుల ద్వారా ఓటు హక్కును వక్రీకరించడం,ఇవి చట్టరీత్యా తీవ్రమైన నేరాలు. భారతఎన్నికలచట్టాలప్రకారం Representation of the People Act , 1951 లోని సెక్షన్ 17, 18, 31, 171F ప్రకారం నకిలీ ఓటు, ద్వంద్వ ఓటింగ్, లేదా ఎన్నికల మోసం చేసినవారికి జైలుశిక్ష, జరిమానా లేదా రెండూ విధించవచ్చు.
Indian Penal Code (IPC) సెక్షన్ 171D ప్రకారం personation at elections (మరొకరి పేరుతో ఓటు వేయడం) నేరం.171C, 171E సెక్షన్లు ఓటర్లపై ప్రభావం చూపడం (bribery, undue influence) నిషేధిస్తాయి.నిర్వాహకులు మరియు పౌరులు ఇద్దరూ కలసి పని చేసి, ఓటు హక్కు పరిశుద్ధతను కాపాడాలి. "ఒక పౌరుడు – ఒక ఓటు – ఒక విలువ" అనే సూత్రం మాత్రమే ప్రజాస్వామ్యానికి ప్రాణం. దానిని దెబ్బతీయడం దేశ భవిష్యత్తును దెబ్బతీయడమే.



మన్నారం నాగరాజు

## డ్రీమ్స్ స్కూల్లో ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు

**వెలుతురు,హైదరాబాద్ ఆగస్టు14 :**



అంబర్ పేటలోని డ్రీమ్స్ కిడ్స్ అప్పర్ ప్రైమరీ స్కూల్ లో శ్రీకృష్ణ జన్మష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలలో చిన్నిగోపికలు, చిన్ని కృష్ణులు రంగురంగు ల వేషధారణలో కనిపిస్తూ సందడి చేశా రు. ఈ సందర్భంగా గోపికలు, కృష్ణులు నృత్య ప్రదర్శనలు చేసి, అనంతరం ఉట్టి కొట్టారు. విద్యార్థులతో కలిసి ఉపాధ్యా యునీలు ఆడిపాడి సందడి చేశారు. ఈ కార్యక్రమా నికి ప్రిన్సిపాల్ వేణుగోపాల్ ముఖ్య అతిథిగా పాల్గొని చిన్నారులను అభినందిం చి, మాట్లాడారు. కృష్ణాష్టమి విశిష్టతను, కృష్ణుని జన్మ వృత్తాంతం, బాల్యం నుంచి కంస వద తదితర అంశా లపై వివరించారు. అలాగే మోక్షం, యో గం, జ్ఞానం, భక్తి వంటి పవిత్రమైన అం శాలతో మనకు కృష్ణ గీత ద్వారా అందిం చిన భగవద్గీత ఆదర్శంగా నిలిచింద న్నా రు. విద్యార్థులకు చిన్నతనం నుంచే పం డుగల యొక్క ప్రాముఖ్యతను తె లుపు తున్నామని వివరించారు. సంస్కృతి సాంప్రదాయాలను భావి తరాలకు అందించడానికి స్కూల్లో ఇలాటి కార్యక్రమాలు చేపడుతు న్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో స్కూల్ ఉపాధ్యాయనీలు, వి ద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీ వద్దిరాజు మున్నూరుకాపు ఆత్మగౌరవ ధర్నా సేన పోస్టర్స్ ఆవిష్కరణ



**హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 14:**
బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర మున్నూరుకాపు ఆత్మగౌరవ మహాధర్నా సేన పోస్టర్లను ఆవిష్కరించారు.గల్లీ నుంచి ఢిల్లీ వరకు మున్నూరుకాపులలో మరింత చైతన్యాన్ని పాదుగొల్పేందుకు గాను సేన ఆధ్వర్యాన ఈనెల 18వతేదీ నుంచి వచ్చే నెల 6వతేదీ వరకు పాదయాత్ర చేపట్టనున్నారు.ఈ సందర్భంగా మున్నూరుకాపు సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు, ఎంపీ రవిచంద్ర సేన కన్వీనర్ ఉగ్గే శ్రీనివాస్ తదితర ప్రముఖులతో కలిసి గురువారం బంజారాహిల్స్ ఎమ్మెల్యే కాలనీలోని తన క్యాంప్ కార్యాలయంలో పోస్టర్లను ఆవిష్కరించారు. సేన ఆధ్వర్యంలో మహబూబ్ నగర్ కాటన్ మిల్లు సమీపాన ఉన్న శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయం నుంచి ఈనెల 18వతేదీ ఉదయం 9:30 గంటలకు పాదయాత్ర మొదలై సెప్టెంబర్ 6న హన్మకొండలో ముగుస్తుందని సేన కన్వీనర్ ఉగ్గే శ్రీనివాస్ తెలిపారు. సుమారు 20 రోజుల పాటు జరిగే ఈ పాదయాత్ర మహబూబ్ నగర్, నల్లగొండ,ఖమ్మం,వరంగల్ ఉమ్మడి జిల్లాలలో కొనసాగుతుందని ఆయన పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా జరుగనున్న జనగణన, కులగణన సందర్భంగా మున్నూరుకాపులందరూ తప్పనిసరిగా కులాన్ని నమోదు చేయించుకోవలసిందిగా, న్యాయమైన హక్కుల సాధనకు ఉద్యమించాల్సిందిగా ఆయన కోరారు.పోస్టర్ల ఆవిష్కరణ కార్యక్రమంలో సేన కో-కన్వీనర్స్ బత్తుల రాములు,రామిని ప్రదీప్,అమరం శ్యామ్, బత్తుల శ్రీనివాస్, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.


## తెలంగాణ విద్యుత్ ప్రధాన తనిఖీ అధికారికి ఘన సన్మానం చేసిన ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్స్



**హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 14:**
తెలంగాణ ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో గురువారం రోజున మధ్యాహ్నం నూతనంగా చార్జ్ తీసుకున్నటువంటి తెలంగాణ ప్రభుత్వ విద్యుత్ తనిఖీ అధికారిగా( సిఈఐజి) నియమితులైనటువంటి శ్రీ కే. నందకుమార్ గారిని మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. రాష్ట్ర నూతన విద్యుత్ ప్రధాన తనిఖీ అధికారి మాట్లాడుతూ తెలంగాణ వ్యాప్తంగా విద్యుత్ ప్రమాదాలు నివారణ అంశంపై ప్రతి జిల్లాలలో కాంట్రాక్టర్లను మరియు వినియోగదారులను ఇండస్ట్రీ వాళ్లకు విధ్యుత్ సంబంధించిన వారిని అందరిని కలుపుకొని ప్రతి జిల్లాకు ఒక మీటింగ్ ఏర్పాటు చేయాలని ఆలోచనతో ఉన్నానని ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్స్ కూ ఉద్దేశించి చెప్పారు. అదేవిధంగా రాష్ట్ర కమిటీ తరపు నుండి శాలువాతో మరియు పూల బొకే తో సత్కరించడం జరిగింది. ఈ కార్యక్రమానికి తెలంగాణ ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు జి సి రెడ్డి గారు. తెలంగాణ ఎలక్ట్రికల్ లైసెన్స్ బోర్డు మాజీ సభ్యుడు నక్క యాదగిరి. రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏ.మహేందర్. పెద్ద పుల్లారావు. మరియు చిన్న పుల్లారావు. జి సత్యనారాయణ. ఆర్. ప్రదీప్ రెడ్డి.యం. శ్రీనివాసరావు. వి నరేష్ కుమార్ మరియు తదితరులు పాల్గొన్నారు

## రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలి....

- కొండగట్టుకు అభిమాని పాదయాత్ర.



**మేడిపల్లి వెలుతురు ఆగస్టు 13:**
కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలని కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానం వరకు పాదయాత్ర చేస్తున్న కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అభిమాని. సూర్యాపేట జిల్లా నూతనకల్ మండలం వెంకేపల్లి గ్రామానికి చెందిన పాల్వాయి జగదీష్..

## ఆరుట్ల గ్రామంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కట్ట నరసింహ గుండెపోటుతో మృతి

- **నరసింహ మరణం కాంగ్రెస్ పార్టీ కి తీరనిలోటు**
- **కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు ఈసి శేఖర్ (మామ) గౌడ్**



**మంచాల వెలుతురు ఆగస్టు 14:**
మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కట్ట నరసింహ గుండెపోటుతో మృతి చెందిన విషయం తెలుసుకొని నరసింహ ఇంటికి చేరుకొని మృతదేహం పై పూలమాలవేసి నివాళులర్పించిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు ఈసి శేఖర్(మామ)గౌడ్ మంచాల వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ వెదిరె హన్మంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు కొంగర విష్ణు వర్ధన్ రెడ్డి ఈ సందర్భంగా ఈసి శేఖర్ గౌడ్ మాట్లాడుతూ కట్ట నరసింహ అందరితో కలసి మెలసి ఆప్యాయంగా మాట్లాడేవాడు అన్నారు నరసింహ మరణం కాంగ్రెస్ పార్టీకి తీరనిలోటు అని అన్నారు ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ డైరెక్టర్ సాతిరి ఎల్లేష్ కాంగ్రెస్ పార్టీ మంచాల మండలం కిసాన్ సె ల్ అధ్యక్షుడు కావాలి బుగ్గ రాములు ముదిరాజ్ ఆరుట్ల మాజీ ఎంపీటీసీ కావలి శ్రీనివాస్ ముదిరాజ్ పాంబల బుగ్గ రాములు ఆరుట్ల గ్రామ శాఖ అధ్యక్షుడు రావుల బాషా కార్యదర్శి దసరా మోని రమేష్ ఉపాధ్యక్షుడు తలరి కృష్ణ ఇందిరమ్మ కమిటీ సభ్యులు చెరుకు నరసింహ గౌడ్, బుట్టి కృష్ణ మార బౌరరమ్మ లక్ష్మణ్ నాయకులు కావలి రమేష్ అంతటి రాజు గౌడ్ మార సురేష్ నూకం నగేష్ అర్ల శ్రీకాంత్ యండి అశ్రఫ్ భాస్కర్ తదితరులు పాల్గొ న్నారు

## టూరిస్టుల భద్రత కోసం ప్రత్యేక పోలీస్ దళం

- **తొలిదశలో టూరిజం శాఖకు 80 మంది పోలీసుల కేటాయింపు**
- **పోలీస్ శాఖ,టూరిజంల మధ్య సమన్వయ సమావేశంలో డిజిపి**



**హైదరాబాద్,ఆగస్ట్14( వెలుతురు):**
తెలంగాణ రాష్ట్రంలో టూరిస్టుల భద్రత కోసం త్వరలో టూరిస్ట్ పోలీసులను కేటాయించనట్టు- రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ డాక్టర్ జితేందర్ వెల్లడించారు. తెలంగాణ టూరిజం శాఖ, పోలీస్ శాఖ ల మధ్య సమన్వయ సమావేశం బుధవారం నాడు డిజిపి కార్యాలయంలో జరిగింది. టూరిజం శాఖ స్పెషల్ సీఎస్ జయేష్ రంజన్, శాంతి భద్రతల అడిషనల్ డిజిపి మహేష్ ఎం భగవత్ , టూరిజం శాఖ ఎం.డి వి.క్రాంతి, ఫిలిం డెవలప్మెంట్ కార్పొరేషన్ ఎం.డి సిహెచ్ .ప్రియాంక, ఇతర పోలీసు అధికారులు ఈ సమన్వయ సమావేశం లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిజిపి మాట్లాడుతూ.... తొలిదశలో టూరిజం శాఖకు అవసరమైన 80 మంది పోలీసు సిబ్బందిని త్వరలో కేటాయిస్తామని తెలియజేశారు. సెప్టెంబర్ 27వ తేదీన జరగనున్న వరల్డ్ టూరిజం డే సందర్భంగా టూరిస్ట్ పోలీసుల వ్యవస్థ సిద్ధం చేయాలని భావిస్తున్నట్లు- పేర్కొన్నారు. రాష్ట్రంలో ఉన్న పర్యాటక ప్రాంతాలైన అనంతగిరి, సోమశిల, రామప్ప, యాదగిరిగుట్ట, పోచంపల్లి, నాగార్జునసాగర్ ,బుద్ధవనం, భద్రాచలం, అమ్రాబాద్ తదితర ప్రాంతాలలో టూరిస్ట్ పోలీసులు పని చేస్తారని అన్నారు. రాష్ట్రంలో టూరిజం అభివృద్ధి చెందేందుకు పోలీస్ శాఖ పర్యాటక శాఖకు పూర్తిగా సహకరిస్తుందని తెలిపారు. షూటింగ్ పర్మిషన్లు కోసం, ప్రత్యేక కార్యక్రమాల నిర్వహణ కోసం పర్యాటక శాఖ విధి విధానాలను రూపొందించాలని డిజిపి సూచించారు. తద్వారా ఆయా కార్యక్రమాలకు భద్రత కల్పించడం పోలీస్ సిబ్బందికి సులభం అవుతుందని తెలిపారు. ప్రత్యేక కార్యక్రమాల నిర్వహణ కోసం సినీ నిర్మతలు ముందుగా తెలియజేస్తే కార్యక్రమాలకు భద్రత కల్పించే సమయం దొరుకుతుందన్నారు. సమావేశంలో స్పెషల్ సీఎస్ శ్రీ జయేష్ రంజన్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో టూరిజం అభివృద్ధి కోసం వివిధ కార్యక్రమాలను చేపట్టనునట్లు- తెలిపారు. విదేశీ టూరిస్టులతో పాటు దేశంలో ఉన్న టూరిస్టులు విస్తృతంగా పర్యాటక ప్రాంతాలను సందర్శిస్తారని వారికి భద్రత కల్పించేందుకు టూరిస్ట్ పోలీసు అవసరం ఉందని తెలిపారు. ఆధ్యాత్మిక, మెడికల్, వినోదాత్మక పర్యాటక ప్రాంతాలను సందర్శించేందుకు వచ్చే వారి భద్రత కోసం టూరిస్ట్ పోలీసులను కేటాయించాల్సి ఉందన్నారు. హైదరాబాద్ అడిషనల్ కమిషనర్ విక్రమ్ సింగ్ మాన్, మల్టీ జోన్ -2 ఐజిపి తఫ్సీర్ ఇక్బాల్, సైబరాబాద్ జాయింట్ కమిషనర్ గజరావు భూపాల్, రాచకొండ డిసిపి ఇందిర, ఏఐజి రమణ కుమార్, తదితరులు సమన్వయ సమావేశంలో పాల్గొన్నారు.

## రాహుల్‌ను విమర్శించే అర్హత లేదు

**రఘునందన్ రావు వ్యాఖ్యలకు అంద్దంకి కౌంటర్**

**హైదరాబాద్,ఆగస్ట్14( వెలుతురు):**
రాహుల్‌గాంధీని విమర్శించే అర్హత రఘునందన్ రావుకు లేదని, బిఆర్ఎస్ సహకారంతో ఎంపిగా గెలిచి హరీష్‌రావుతో ఒప్పందం చేసుకొని రఘునందన్ రావు మెదక్ ఎంపి అయ్యారని ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ ఓ ప్రకటనలో ఆరోపించారు. నక్కకు నాగలోకానికి ఉన్న తేడా రఘునందన్ రావు, రాహుల్ గాంధీకి ఉందని ఆయన అన్నారు. పెద్ద వాళ్లపైన మాట్లాడితే పెద్ద వాడివి అయిపోతానని రఘునందన్ రావు అనుకుంటున్నారని ఆయన ఎద్దేవా చేశారు. రఘునందన్ రావుకు అంత సీన్ లేదని, రఘునందన్ రావుకు బిజెపిలో అంత బేస్ లేదని ఆయన అన్నారు. రాహుల్ గాంధీ అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పే దమ్ము రఘునందన్ రావుకు లేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ ఎన్నికల కమిషన్‌ను ప్రశ్నిస్తుంటే రఘునందన్ రావు ఎందుకు ఉలిక్కి పడుతున్నారని ఆయన ప్రశ్నించారు. చనిపోయిన వాళ్లతో టి తాగే అద్భుత అవకాశం ఈసీ రాహుల్ గాంధీకి ఇచ్చిందని, చనిపోయిన వాళ్లు ఏకంగా సుప్రీంకోర్టులో ప్రత్యక్షమవుతున్నారని రాహుల్ గాంధీ ప్రశ్నలకు సమాధానం చెప్పలేక ఈసీ నీళ్లు మింగుతోందని వారి బండారం బయటపడుతుందన్న భయంతో బిజెపి నాయకులు న్నారని ఆయన అన్నారు. మీరెంత మాట్లాడినా ఉపయోగం లేదని, మీ కథను మా రాహుల్ గాంధీ ముగిస్తారని అద్దంకి దయాకర్ పేర్కొన్నారు.

## పెద్దమ్మ గుడి కూల్చివేతపై విచారణ

- **అమ్మవారి విగ్రహం భద్రపర్చండి**
- **కూల్చివేత వివరాలు తెలపాలన్న హైకోర్టు**



**హైదరాబాద్,ఆగస్ట్14( వెలుతురు):**
బంజారాహిల్స్ రోడ్ నెం.12 పెద్దమ్మ గుడి కూల్చివేతపై గురువారం హైకోర్టు విచారణ చేపట్టింది. పెద్దమ్మ తల్లి విగ్రహాన్ని భద్రంగా భద్రపరచాలని సూచించింది. విగ్రహం కూల్చివేతపై పూర్తి వివరాలు సమర్పించాలని ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 18కు వాయిదా వేసింది. పెద్దమ్మ గుడి కూల్చివేతపై హైకోర్టులో లంచ్ మోషన్ పిటిషన్ నమోదైంది. అక్రమంగా కూల్చిన ఆలయాన్ని తక్షణమే నిర్మించాలని పల్లె వినోద్ కుమార్ అనే న్యాయవాది పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై ఇవాళ విచారణ చేపట్టిన న్యాయస్థానం విగ్రహాన్ని భద్రపరిచి.. కూల్చివేతలకు గల ఆధారాలను సమర్పించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. బంజారాహిల్స్‌లోని పెద్దమ్మగుడి కూల్చివేతపై కొద్ది రోజులుగా వివాదం సాగుతోంది. కూల్చివేతకు నిరసనగా హిందూ సంఘాలు పెద్దఎత్తున నిరసనలు తెలిపారు. ఈ మేరకు గత మంగళవారం కుంకుమార్చాన పూజకు పిలుపునిచ్చారు హిందూ సంఘాల ప్రతినిధులు. ఈ పిలుపుతో పోలీసులు అప్రమత్తమయ్యారు. బంజారాహిల్స్‌కు వెళ్లే అన్ని మార్గాలనూ మూసివేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు- చేసుకోకుండా పెద్దమ్మగుడి దగ్గర భారీగా పోలీసులను మోహరించారు. కాగా, తాజాగా ఈ ఘటనపై హైకోర్టులో విచారణ జరిగింది.

## మూసీ వంతెనల నిర్మాణంలో నిర్లక్ష్యం

- **కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై మండిపడ్డ కెటిఆర్**

**హైదరాబాద్,ఆగస్ట్14( వెలుతురు):**
మూసీ నదిపై బ్రిడ్జిల నిర్మాణంలో కాంగ్రెస్ నిర్లక్ష్యాన్ని, అలసత్వాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎక్స్ వేదికగా ఎండగట్టారు. మూసీ నదిపై వంతెనల నిర్మాణం హైదరాబాద్ వాసుల చిరకాల కల అన్నారు. ఆ కలను నిజం చేయడానికి, బీఆర్ఎస్ ప్రభుత్వం రూ. 545 కోట్లు- మంజూరు చేసి, యుద్ధ ప్రాతిపదికన పనులు ప్రారంభించిందని కేటీఆర్ గుర్తు చేశారు. మూసీ నదిపై వంతెనల నిర్మాణం ద్వారా హైదరాబాద్ వాసుల రాకపోకలను సులభతరం చేయడానికి, బీఆర్ఎస్ ప్రభుత్వం జనవరి 2022లో రూ. 545 కోట్లతో 15 వంతెనల నిర్మాణానికి మంజూరు చేసింది. ఈ వంతెనల పొడవు సుమారు 150-200 మీటర్లు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత, ఆ పనులన్నీ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టుగా ఉన్నాయి. మూసీ నదిపై ఒక్క వంతెన కూడా ఇంకా పూర్తి కాలేదు. నిర్లక్ష్యం, అసమర్థత, చేతగానితనం.. ఇవన్నీ కాంగ్రెస్ పాలనకు నిదర్శనంగా మారాయి. ఇది పనికిమాలిన ప్రభుత్వం, పనికిమాలిన పాలన అని కేటీఆర్ విమర్శించారు.

## సింగపూర్ తెలుగు సభలకుకెటిఆర్‌కు ఆహ్వానం

**హైదరాబాద్,ఆగస్ట్14( వెలుతురు):**
సింగపూర్‌లోని ప్రముఖ తెలుగు సాంస్కృతిక సంస్థ 'సింగపూర్ తెలుగు సమాజం' తన స్వర్ణోత్సవ వేడుకలకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను ప్రధాన అతిథిగా ఆహ్వానించింది. ఆగస్టు 31వ తేదీన మెరీనా బే సాండ్స్ సింగపూర్ వేదికగా ఈ వేడుకలు జరగనున్నాయి. ఈ మేరకు కేటీఆర్‌కు సింగపూర్ తెలుగు సమాజం అధ్యక్షుడు బొమ్మారెడ్డి శ్రీనివాసరెడ్డి అధికారికంగా లేఖ రాశారు. తెలుగు భాష, సంస్కృతి సంప్రదాయాల పరిరక్షణ కోసం సింగపూర్ తెలుగు సమాజం కృషి చేస్తుందని శ్రీనివాసరెడ్డి ఆ లేఖలో తెలిపారు. సింగపూర్‌లో ఉండే తెలుగు ప్రజల మధ్య ఐక్యత పెంపొందించేందుకు ఈ కార్యక్రమం దోహదపడు తుందన్నారు. తెలంగాణ సాంస్కృతిక, రాజకీయ వారసత్వానికి ప్రతినిధి అయిన కేటీ-ఆర్ రాక సింగపూర్ తెలుగు సమాజానికి స్ఫూర్తిగా నిలుస్తుందన్నారు. ఈ స్వర్ణోత్సవ వేడుకల్లో పాల్గొని తమ సంస్థకు గౌరవం ఇవ్వాల్సిందిగా ఆయన కేటీఆర్‌ను కోరారు. సింగపూర్ తెలుగు సమాజం ఆహ్వానాన్ని కేటీ-ఆర్ అంగీకరించారు.

## రేణుకాస్వామి హత్య కేసులో దర్శన్ బెయిల్ రద్దు

- **సుప్రీం తీర్పుతో దర్శన్, పవిత్ర గౌడ్‌ల అరెస్ట్**
- **హైకోర్టు బెయిల్ తీర్పును కొట్టేసిన సుప్రీం**
- **ఇలాంటి కేసుల్లో బెయిల్ సరికాదన్న ధర్మాసనం**



**న్యూఢిల్లీ,ఆగస్ట్14( వెలుతురు):**
రేణుకాస్వామి (33) హత్య కేసులో నిందితులైన నటుడు దర్శన్ నటి పవిత్రా గౌడ్‌కు సుప్రీంకోర్టులో గట్టి షాక్ తగిలింది. ఈ కేసులో నిందితుల బెయిల్ రద్దు చేస్తూ తీర్పు వెల్లడించింది. దీంతో అప్రమత్తమైన బెంగళూరు పోలీసులు తీర్పు వెలువడిన గంటల వ్యవధిలోనే వీరిద్దరినీ అరెస్టు చేశారు. తొలుత పవిత్రా గౌడను ఆమె ఇంట్లోనే కస్టడీలోకి తీసుకోగా.. ఆ తర్వాత దర్శన్‌ను అరెస్టు చేశారు. దర్శన్ బెంగళూరులోని సకెరెహళ్లిలోని తన భార్య ఇంటికి వెళ్లి మీడియా నుంచి తప్పించుకొనేందుకు ఎగ్జిట్ గేట్ ద్వారా లోపలికి ప్రవేశించాడని, తన భార్య, కొడుకును కలిసిన అనంతరం పోలీసులు అరెస్టు చేసినట్టు సమాచారం. చిత్రదుర్గ నివాసి రేణుకాస్వామి హత్య కేసులో నటి పవిత్ర గౌడ, ప్రముఖ నటుడు దర్శన్ ప్రధాన నిందితులుగా ఉన్న విషయం తెలిసిందే. ఈ కేసులో గతేడాది డిసెంబర్‌లో కర్ణాటక హైకోర్టు వీరికి బెయిల్ మంజూరు చేయగా.. దీన్ని రద్దుచేయాలని కోరుతూ కర్ణాటక పోలీసులు గతంలో దాఖలు చేసిన పిటిషన్‌పై విచారించిన సర్వోన్నత న్యాయస్థానం తాజాగా ఉత్తర్వులు ఇచ్చింది. నిందితులను కస్టడీలోకి తీసుకొని త్వరగా విచారణ చేపట్టాలని సర్వోన్నత న్యాయస్థానం అధికారులను ఆదేశించింది. కర్ణాటకలో దర్శన్ అభిమాని రేణుకాస్వామి హత్య కేసు సంచలనంగా మారిన విషయం తెలిసిందే. పవిత్రకు అసభ్య సందేశం పంపాడన్న కారణంతో అతడిని చిత్రహింసలకు గురిచేసి హత్య చేసినట్లు పోలీసులు గుర్తించారు. ఈ కేసులో దర్శన్, ఆయన స్నేహితురాలు పవిత్రగౌడ సహా 15 మందిని అరెస్టు చేశారు. రేణుకాస్వామిపై అత్యంత పాశవికంగా దాడి చేసినట్టు- విచారణలో తేలింది. అతడికి కరెంట్ షాక్ కూడా పెట్టినట్లు పోస్టుమార్టం నివేదికలో వెల్లడైంది. దర్శన్ తన అభిమాని రేణుకా స్వామి హత్య కేసులో జైలు పాలైన విషయం తెలిసిందే. కర్ణాటక హైకోర్టు ఉత్తర్వులో చాలా లోపాలు ఉన్నాయని పేర్కొంటూ జస్టిస్ జెబి పార్దివాలా, ఆర్ మహదేవన్‌లతో కూడిన ధర్మాసనం దానిని రద్దు చేసింది. 2024లో బెంగళూరులో అరెస్టు చేసినప్పుడు ఈ హత్య కేసులో నటుడు నిందితుడిగా ఉన్నాడు. పవిత్ర గౌడతో సహా చాలా మంది ఈ కేసులో నిందితులుగా ఉన్నారు. బెయిల్ మంజూరు, బెయిల్ రద్దుతో సహా ప్రతి అంశాన్ని మేము పరిగణనలోకి తీసుకున్నాము. హైకోర్టు ఉత్తర్వులో తీవ్రమైన లోపభూయిష్టత ఉందని స్పష్టంగా తెలుస్తుంది; ఇది యాంత్రిక పక్రియను ప్రతిబింబిస్తుంది. అంతేకాకుండా, హైకోర్టు విచారణకు ముందు దశలో మాత్రమే విచారణ నిర్వహించిందని బెంచ్ పేర్కొంది. దర్శన్‌ను నిర్దోషిగా విడుదల చేయడానికి సరైన కారణం లేదు. హైకోర్టు ఉత్తర్వు ఏకపక్షంగా కనిపిస్తోంది. సాక్షుల వాంగ్మూలాలను హైకోర్టు పరిశీలించింది, ఇది ట్రయల్ కోర్టు పని. ఇంత తీవ్రమైన కేసులో, సమస్యలపై పూర్తి దర్యాప్తు లేకుండా బెయిల్ మంజూరు చేయడం తప్పు, అన్యాయమని వెల్లడించింది. బలమైన ఆరోపణలు, ఫోరెన్సిక్ ఆధారాలు బెయిల్ రద్దుకు మద్దతు ఇస్తున్నాయి. పిటిషనర్ బెయిల్ రద్దు చేయబడిందని ధర్మాసనం పేర్కొంది. దర్శన్, సహ నిందితులకు బెయిల్ మంజూరు చేస్తూ రాష్ట్ర హైకోర్టు డిసెంబర్ 13, 2024న ఇచ్చిన ఉత్తర్వులను సవాలు చేస్తూ కర్ణాటక ప్రభుత్వం దాఖలు చేసిన అప్పీలుపై ఈ తీర్పు వెలువడింది. రేణుకా స్వామి హత్య కేసులో జూన్ 11, 2024న అరెస్టు అయ్యారు. ఆయన దాదాపు 7 నెలలు జైలులో ఉన్నారు. తరువాత, డిసెంబర్ 13, 2024న, కర్ణాటక హైకోర్టు ఆయనకు వైద్య కారణాలతో బెయిల్ మంజూరు చేసింది.

## మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిని కలిసిన మాజీ ఎంపీటీసీ కె. అనిల్ కుమార్.....!

**- మంత్రికి గ్రామ సమస్యలు వివరించిన అనిల్ కుమార్**

**- సానుకూలంగా స్పందించిన మంత్రి**



**జహీరాబాద్ వెలుతురు ఆగష్టు 14:**
రాష్ట్ర రోడ్డు రవాణా సిని ఆటోగ్రాఫి మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి బిలాల్ పూర్ గ్రామ సమస్యలను మంత్రికి వివరించారు. గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లు ఇంకా ఎక్కువగా మంజూరు చేయాలని ప్రస్తుతం మంజూరైనా ఇండ్లు లబ్ధిదారులకు సరిపోవడం లేదని గ్రామనికి ఇంకో 50ఇండ్లు మంజూరు చేయాలని బిలాల్ పూర్ గ్రామ తాజా మాజీ ఎంపీటీసీ కె. అనిల్ కుమార్ మంత్రిని అభ్యర్థించారు. సానుకూలంగా స్పందించిన మంత్రి వెంకట్ రెడ్డి త్వరలో జిల్లా అధికారులతో మాట్లాడి కోహిర్ మండలంలోని బిలాల్ పూర్ గ్రామానికి ఇంకో 50ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయించి సమస్య పరిష్కరిస్తానని హామీ ఇవ్వడం జరిగింది అన్నారు ఎంపీటీసీ అనిల్ కుమార్ అంతే కాకుండా రాబోయే రోజుల్లో బిలాల్ పూర్ గ్రామ అభివృద్ధికి తోడ్పాటు అందిస్తానని హామీ ఇచ్చారన్నారు. ఎంపీటీసీ అనిల్ కుమార్ వెనుకాల తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉన్నారు.

## భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**- నారాయణఖేడ్ ఎంఐఎం అధ్యక్షులు మొహీద్ పటేల్**




**వెలుతురు నారాయణఖేడ్ ఆగస్టు 14 :**
నారాయణఖేడ్ పట్టణంలో ఎడతెరిపి లేకుండా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, నారాయణఖేడ్ ఎంఐఎం అధ్యక్షులు, న్యాయవాది మొహీద్ పటేల్ విజ్ఞప్తి చేశారు. అత్యవసర పరిస్థితుల్లో తప్ప ప్రజలు బయటకు రావద్దని, పిల్లలను బయటికి పంపవద్దని, విద్యుత్ స్తంభాల వద్ద జాగ్రత్తగా ఉండాలని ఆయన సూచించారు. విద్యుత్ మరియు మున్సిపల్ డిజాస్టర్ రెస్పాన్స్ టీమ్ అందుబాటులో ఉండి, అవసరమైన సహాయ చర్యలు తక్షణమే తీసుకోవాలని కోరారు. ప్రజలకు ప్రాణ నష్టం, ఆస్తి నష్టం కలగకుండా, వర్షపు నీరు ఇళ్లలోకి ప్రవే శించకుండా, రోడ్లపై నీరు నిలిచిపోకుండా ఉండేందుకు, నీరు వెళ్లే డ్రెయిన్ లైన్లను క్లియర్ చేయాలని నారాయణఖేడ్ మున్సిపల్ కమిషనర్‌ను మొహీద్ పటేల్ కోరారు.

## శ్రీ భక్త మార్కండేయ ఆలయంలో వరలక్ష్మీ వ్రతాలు



**వెలుతురు నారాయణఖేడ్ ఆగస్టు 14 :**
నారాయణఖేడ్ పట్టణ శివారులోని వెంకటాపూర్ చౌరస్తాలోగల శ్రీ భక్త మార్కండేయ ఆలయంలో శ్రావణమాసం నాలుగో శుక్రవారం సందర్భంగా పద్మశాలి మహిళా విభాగం ఆధ్వర్యంలో సామూహిక వరలక్ష్మి వ్రత కార్యక్రమాన్ని నిర్వహించబోతున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు గురువారం ఒక ప్రకటన తెలిపారు.కార్యక్రమంలో భక్తులు,మహిళలు వరలక్ష్మి అమ్మవారి,చంద్రమౌళీశ్వరుడి కృపా కటాక్షాలు పొందాలని కోరారు.

## ఈ నెల 18న ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలు

**జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి ఎ.పురుషోత్తం**

**వెలుతురు మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఆగస్టు 14**
జిల్లాలోని నస్పూర్లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో ఈ నెల 18వ తేదీ ఉదయం 11 గం?లకు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించడం జరుగుతుందని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి ఎ.పురుషోత్తం ఒక ప్రకటనలో తెలిపారు. అధికారులు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరై వేడుకలను విజయవంతం చేయాలని కోరారు.

## మహబూబాబాద్ జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శిగా మదన్ లాల్.



**నెల్లికుదురు వెలుతురు ఆగస్టు 14:**
మహబూబాబాద్ జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శిగా నెల్లికుదురు మండలం రత్తిరాం తండాకు చెందిన గుగులోతు మదన్ లాల్ నియామకమయ్యారు.పార్టీ రాష్ట్ర చీఫ్ రామచంద్ర రావు ఆదేశాల మేరకు జిల్లా అధ్యక్షులు వల్లబు వెంకటేశ్వర్లు మదన్ లాల్ ను నియమించారు.దీంతో బిజెపి యువతకు అధిక ప్రాధాన్యమిస్తోందని మరోసారి రుజువయింది.మదన్ లాల్ బిజెపిలో చురుకైన యువ నాయకునిగా పార్టీ పటిష్టతకు కృషి చేస్తున్నారు.ఉమ్మడి వరంగల్ జిల్లా బీజేవైఎం ప్రధాన కార్యదర్శిగా,2019లో నెల్లికుదురుజనరల్ స్థానంలో జెడ్పిటిసిగా పోటీ చేశాడు.రత్తి రామ్ తండా నుంచి ఎంపీటీసీగా పోటీ చేసి అనూహ్యంగా విజయం సాధించారు.బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధిగా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా విజయవంతంగా బాధ్యతలు నిర్వర్తించారు.

**పార్టీ బలోపేతానికి కృషి చేస్తా: మదన్ లాల్.**

పార్టీలో యువతకు ప్రాధాన్యం తన నియామకమే నిదర్శనమని బిజెపి బలోపేతానికి మరింత కృషి చేస్తానని జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన మదన్ లాల్ అన్నారు.తన నియామకానికి సహకరించిన రాష్ట్ర అధ్యక్షులు రామచంద్ర



రావు,జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు జాటోతు హుస్సేన్ నాయక్,జిల్లా అధ్యక్షులు వల్లబు వెంకటేశ్వర్లు,మాజీ జిల్లా అధ్యక్షులు ఎడ్ల అశోక్ రెడ్డి,ఒద్దిరాజు రామ చందర్రావు,మాజీ ఎంపీ సీతారాం నాయక్, చీకటి మహేష్ గౌడ్,చెలుపూరి వెంకన్న,సింగారపు సతీష్ ల తో పాటు పార్టీ నాయకులు,కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.

## చట్టాల పట్ల ప్రజలు అవగాహనతో ఉండాలి

**మండల్ లీగల్ కమిటీ ప్యానల్ లాయర్ మామిడి వెంకట్ రెడ్డి, సభ్యులు బత్తుల గణేష్**

**రామన్నపేట వెలుతురు న్యూస్ ఆగష్టు 14**
జనం పల్లి గ్రామంలో అవగాహన సదస్సు చట్టాల పట్ల ప్రజలు అవగాహనతో ఉండాలని మండల్ లీగల్ సర్వీసెస్ కమిటీ అడ్వకేట్ మామిడి వెంకట్ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని జనంపల్లి గ్రామ పంచాయితీ అవరనంలో జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆదేశాలనుసారం, మండల న్యాయ సేవా అధికార సంస్థ రామన్నపేట అధ్వర్యంలో ప్రపంచ ఆదివాసులు హక్కుల దినోత్సవం సందర్భంగా ప్యానల్ అడ్వకేట్ మామిడి వెంకట్ రెడ్డి లీగల్ సెల్ సభ్యులు బత్తుల గణేష్ లు కలిసి అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయితీ కార్యదర్శి సమక్షంలో ప్రజలకి, ట్రైబల్ కుటుంబాల వారికి వారి జీవన విధాన శైలీ, ఆర్థిక స్థితిగతులు మెరుగు, హక్కులు, న్యాయ పరమైన అంశాలు, అదేవిధంగా ప్రజలకి కుటుంబ తగాదాలు, భూ తగాదాలు, మాదక ద్రవ్యాలు, డ్రగ్స్, చెడు



వ్యసనాలు, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం ప్రజలకి న్యాయ సేవా అధికార సంస్థ ఉపయోగం, వినియోగం, సమస్యలు ఉంటే లీగల్ టీమ్ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడ్వకేట్ కూనూరు శ్రీనివాస్, పంచాయితీ కార్యదర్శి రమాదేవి, ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్ సుచరిత, ఫీల్డ్ అసిస్టెంట్ నరేందర్, పోలీస్ కానిస్టేబుల్ కృష్ణమూర్తి, అజ్మద్, ఆశ కార్యకర్తలు ధనలక్ష్మి, సరిత, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

**రామన్నపేట వెలుతురు న్యూస్ ఆగస్టు 14**
మండలం శోభనాద్రిపురం గ్రామానికి చెందిన ముక్కామల దుర్గయ్య కూతురు వివాహము చౌటుప్పల్ లోని ఎస్ఎంఎస్ సార్ గార్డెన్ లో జరగగా మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించడం జరిగింది. రామన్నపేట మండలం కక్కిరేణి గ్రామానికి చెందిన నల్ల యాదయ్య కుమారుని వివాహము చిట్యాల పట్టణ కేంద్రంలోని శ్రీ లక్ష్మీ గార్డెన్లో జరగగా మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించడం జరిగింది. రామన్నపేట మండలం కుంకుడు పాముల గ్రామానికి చెందిన బొక్క శ్రవణ్ రెడ్డి కుమార్తె వివాహము నార్కట్పల్లి పట్టణ కేంద్రంలోని ఎస్ఎల్ఎస్ సార్ గార్డెన్లో జరగగా మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించడం జరిగింది. రామన్నపేట మండలం నీర్నాముల గ్రామానికి చెందిన నోముల తరుణ్ వివాహము రామన్నపేట పట్టణ కేంద్రంలోని ఎమ్మెస్ గార్డెన్ లో జరగగా మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించడం జరిగింది. ఈ కార్యక్రమాలలో ఆయన



వెంట బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పోష బోయిన మల్లేశం, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్లు బందెల రాములు, కంభంపాటి శ్రీనివాస్, మాజీ రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు బొక్క మాధవరెడ్డి, మాజీ ఎంపీటీసీలు దోమల సతీష్, గాదె పారిజాత జిల్లా నాయకులు కన్నెబోయిన బలరాం, మాజీ సర్పంచులు పిట్టె కృష్ణారెడ్డి, బందెల యాదయ్య, ముక్కామల సత్తయ్య, ఆవుల నరేందర్, జెట్టి శివప్రసాద్, ఆవుల శ్రీధర్, గంగుల రాఘవరెడ్డి, గర్దాస్ విక్రమ్, గుండు నరేష్, గొలుసుల సత్తి, చిన్న పాక రమేష్, చిప్పలపల్లి రవి, నల్ల సైదులు, ముక్కామల భూపాల్, నోముల లింగస్వామి తదితరులు పాల్గొనడం జరిగింది.

## ఘనంగా ముత్యాలమ్మ తల్లి బోనాలు ప్రారంభం

**- సర్కారు బోనమెత్తిన రామన్నపేట తాజా మాజీ సర్పంచ్ గోదాసు శిరీష పృథ్విరాజ్.**

**రామన్నపేట వెలుతురు న్యూస్ ఆగస్టు 14**
మండల కేంద్రంలో ముత్యాలమ్మ బోనాల ఉత్సవాలను ప్రారంభించిన స్థానిక మాజీ సర్పంచ్ గోదాసు శిరీష పృథ్విరాజ్ సర్కారు బోనంను వ్యాప ఆకులు పసుపు, కుంకుమలతో అలంకరించుకుని డప్పులతో ఊరేగింపుగా తీసుకువెళ్లి ముత్యాలమ్మ తల్లి కి నైవేద్యంగా సమర్పించి బోనాల ఉత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రామన్నపేట పట్టణ ప్రజలను ఆర్థికంగా, సుఖ,సంతోషాలతో, ఆయు ఆరోగ్యాలతో ఉంచాలని ముత్యాలమ్మ తల్లి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆమె తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నకిరేకంటి మొగులయ్య, ఆకవరపు మధుబాబు,బేకం నిఖిల్ స్వామి ,మాజీ ఎంపీటీసీలు సాల్వేర్ అశోక్,ఎండి రెహాన్ వనం చంద్రశేఖర్ సాల్వేర్ రోజా లింగం ,మాజీ వార్డు సభ్యులు లెంకల జ్యోతి ప్రవీణ్ మిర్యాల ప్రమీల మల్లేష్ గొలుసుల ప్రసాద్, లగోని యాదయ్య ఎండి నాసర్ ఏటెలి సునీత శ్రీనివాస్, కొమ్ము సుస్మిత, శేఖర్, బడుగు రఘు, గాదె నరేందర్, పుర ప్రముఖులు గోదాసు సుగ్రీవులు, బందెల రాములు,గర్కా సత్యనారాయణ, వీరమల్ల వెంకటయ్య, కందుల హనుమంతు,వనం బిక్షపతి, లవణం ఉపేందర్, గోదాసు శ్రీమాన్ నారాయణ, శివరాత్రి రమేష్, దండుగుల సమ్మయ్య, బాలగోని మల్లయ్య, గాదె మల్లయ్య ,బొడ్డు సాలయ్య, గంగపురం యాదయ్య, గంగపురం వెంకటయ్య, మేడి శంకర్, పాండురంగ చారి, ఊటుకూరి శ్రీను, గోదాసు శీను, సైదాచారి, పల్లపు సమ్మయ్య, లవణం సాయి, గురుకు శివ, కొక్కు అజయ్ తదితరులు పాల్గొన్నారు.



## "ప్రవీణ్ గౌడ్ భవాని"పరిణయం

**- ఆశీర్వదించిన కవిత శంకర్ నాయక్..**



**ఇనుగుర్తి/ నెల్లికుదురు వెలుతురు ఆగస్టు 14:**
మానుకోట జిల్లా ఇనుగుర్తి మండలం చిన్ననాగారం గ్రామానికి బైరు భద్రయ్య మంజుల దంపతుల కుమారుడు ప్రవీణ్ గౌడ్,అదే గ్రామానికి చెందిన బొమ్మెర రాంబాబు , రజిని దంపతుల కుమార్తె భవాని వివాహం నెల్లికుదురు ఎంకేఎస్ ఫంక్షన్ హాల్ లో గురువారం ఘనంగా జరిగింది. దీనికి మాజీ ఎంపీ,ఎమ్మెల్యేలు మా లోతు కవిత,బానోతు శంకర్ నాయక్ లు హాజరై వధువరులను ఆశీర్వదించారు. నూతన వస్త్రాలు బహుకరించారు.వారి వెంట నాయకులు పరిపాటి వెంకట్ రెడ్డి బైరు చిన్న బాలయ్య,వెన్నాకుల శ్రీను,డా.బొమ్మెర వెంకన్న,బాలాజీ నాయక్,చిర్ర శ్రీను,వీర గాని మల్లేష్,విజయ్,మాదాటి శంకర్,ఆదిరెడ్డి,ఎడ్ల మహేష్,కారం ప్రశాంత్ తదితరులు ఉన్నారు.

## 18 నుంచి పాపన్న జయంతి ఉత్సవాలు..

**- గౌడ సంఘాల జేఏసీ చైర్మన్ నర్సాగౌడ్.**



**ఇనుగుర్తి వెలుతురు ఆగస్టు 14:**
నియంతృత్వ పాలనకు చరమగీతం పాడి ప్రజాపాలన ప్రతిష్టించిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలు ఈనెల 18 నుంచి 25 వరకు నిర్వహించాలని తెలంగాణ గౌడ సంఘాల జేఏసీ చైర్మన్,మోకు దెబ్బ రాష్ట్ర అధ్యక్షులు గురువారం ఒక ప్రకటనలో అమరవేణి నర్సా గౌడ్ పిలుపునిచ్చారు.మొగల్ నవాబు పాలకుల మెడలు వంచి ఒక బహుజన పాలనకు పాలనకు బాటలు వేసిన భారతదేశ దళిత బహుజన విప్లవకారుడు పాపన్న 375 వ,జయంతి ఉత్సవాలు వారం రోజులపాటు రాష్ట్రంలోని అన్ని గ్రామాలతో పాటు దేశ వ్యాప్తంగా నిర్వహించాలని బహుజనులను,గౌడన్నలను కోరారు.

## ఇనుగుర్తి లో.. క్రీడా పాఠశాల ఏర్పాటు చేయాలి..

**- 'వేం'కు ఎమ్మెల్సీ శ్రీ పాల్ రెడ్డి వినతి**




**ఇనుగుర్తి వెలుతురు ఆగస్టు 14**
మానుకోట జిల్లా ఇనుగుర్తి మండల కేంద్రం లో క్రీడా పాఠశాల,స్టేడియం ఏర్పాటు చేయాలని కోరుతూ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డిని కోరారు.ఈ మేరకు బుధవారం వేం కు వినతి పత్రం అందజేశారు.ఇనుగుర్తి వాలీబాల్ జాతీయ అంతర్జాతీయ క్రీడాకారులను తయారు చేసిందని,క్రీడా పాఠశాల స్టేడియం ఏర్పాటు చేస్తే తెలంగాణ రాష్ట్రంలో ఇనుగుర్తి నుంచి ఎంతోమంది జాతీయ అంతర్జాతీయ క్రీడాకారులను అందించవచ్చని వినతిలో కోరారు.

## ఇంద్రపాలనగరంలో ఘనంగా బోనాల పండుగ



**రామన్నపేట వెలుతురు న్యూస్ ఆగస్టు 14**
ఇంద్రపాలనగరంలో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఎల్లమ్మ ముత్యాలమ్మ బోనాలను భక్తిశ్రద్ధలతో,ఆడపడుచులందరూ ప్రతి ఇంటి నుంచి బోనం తీసుకువచ్చి ప్రతి సంవత్సరం లానే ఈ సంవత్సరం కూడా పాడిపంటలు పిల్ల పాపలతో ,సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకొని, అమ్మవార్లకు బోనాలు సమర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు శివగల్ల ముత్యాలు, గౌరవ అధ్యక్షులు ఈర్లపల్లి మల్లయ్య, చిన్నలచి సాయిలు, చిన్నలచి మల్లయ్య, మంటి భిక్షమయ్య, రుద్రాల గోపాల్,మంటి మల్లేశం,సిరిపంగి గణేష్ ,రుద్రాల అశోక్,గొల్లేపల్లి గణేష్,ఈరపాక యాదగిరి, మంటి శివకుమార్,శివగళ్ల జ్ఞానేశ్వర్,రుద్రాల విక్కీ,శివగళ్ల సంపత్,మంటి విశ్వ తదితరులు పాల్గొన్నారు.

## ఇనుగుర్తి లో 14 గ్రా.ల బంగారు చోరీ



**ఇనుగుర్తి వెలుతురు ఆగస్టు 14:**
బీరువా పగలగొట్టి బంగారాన్ని చోరీ చేసిన ఘటన మానుకోట జిల్లా ఇనుగుర్తి మండల కేంద్రంలో చోటుచేసుకుంది. కేసముద్రం ఎస్సై మురళీధర్ రాజు ప్రకారం.. ఇనుగుర్తికి చెందిన వల్లం ల ఉప్పలమ్మ,వల్లంల శాంతమ్మ ఇండ్లలో ఈ నెల 13న,(బుధవారం) రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు బీరువాలను పగలకొట్టి 14 గ్రాముల బంగారం(5 గ్రా.రింగు,జత కమ్మలు,ముక్కుపుడక) దొంగిలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. దర్యాప్తులో భాగంగా జిల్లా క్లూస్ టీం సహాయంతో ఫోరెన్సిక్ విధానంలో నిందితుల గుర్తింపు కొరకు అన్వేషణ కొనసాగిస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

# ప్రకృతి విపత్తులలో ప్రజల రక్షణకు అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉన్నాం...

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**వెలుతురు మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఆగస్టు 14**



వాతావరణ శాఖ సూచన మేరకు రాబోవు 2 రోజులలో భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజల రక్షణ కొరకు అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉన్నామని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని మంచిర్యాల పట్టణం తిలక్ నగర్ ప్రాంతంలో గల చెరువును డి.సి.పి. ఎ.భాస్కర్ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భారీ వర్షాల నేపథ్యంలో వరద పరిస్థితులను ఎదుర్కొనేందుకు, ప్రజల రక్షణ కొరకు అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉన్నామని తెలిపారు. జిల్లాలోని కాజ్ వే లు, వాగులు, నదుల వద్దకు ప్రజలు ఎవరు వెళ్లకుండా పోలీస్, రెవెన్యూ, పంచాయతీ శాఖల అధికారుల సమన్వయంతో బందోబస్తు ఏర్పాటు నిర్వహిస్తున్నామని, లోతట్టు, వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలను వరద పరిస్థితుల దృష్ట్యా సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో వరదలకు సంబంధించి ఎలాంటి సమస్య వచ్చిన ఎదుర్కొనేందుకు 90 మంది సభ్యులతో 3 ఎస్.డి.ఆర్.ఎఫ్. బృందాలు, జిల్లా అధికారులతో సిద్ధంగా ఉన్నామని, ప్రజల రక్షణకు కావలసిన పరికరాలు అందుబాటులో పెంచడం జరిగిందని, పోలీసు అధికారులకు శిక్షణ అందించడం జరిగిందని, గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచామని తెలిపారు. ప్రభుత్వ సూచన మేరకు మత్స్యకారులు చేపల వేటకు వెళ్లవద్దని, జిల్లాలోని పాఠశాలలకు గురువారం సెలవు ప్రకటించడం జరిగిందని తెలిపారు. జిల్లాలో ప్రాణ నష్టం, పశు నష్టం, ఆస్తి నష్టం జరగకుండా సంబంధిత అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని, ఉన్నతాధికారుల మార్గదర్శకాలను పాటిస్తూ ప్రజల రక్షణకు కృషి చేయాలని తెలిపారు.ంఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వార్షిక పాస్ సదుయాపాన్ని వాహనదారులు వినియోగించుకోవాలి

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**వెలుతురు మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఆగస్టు 14**

జాతీయ రహదారుల సంస్థ 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కల్పించిన వార్షిక పాస్ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ చాంబర్ లో జాతీయ రహదారుల సంస్థ మంచిర్యాల పి.ఐ.యు. డిప్యూటీ మేనేజర్ (టెక్) హర్షకుమార్ గుప్తా, అధికారులతో కలిసి వార్షిక పాస్ సంబంధిత గోడప్రతులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వార్షిక రుసుము 3 వేల రూపాయలతో 200 ఉచిత టోల్ ప్రవేశాల అనుమతి సదుపాయాన్ని జాతీయ రహదారుల సంస్థ విడుదల చేసిందని, దేశంలోని జాతీయ రహదారులు, ఎక్స్ప్రెస్ హైవేలపై వర్తించేలా ఈ నెల 15వ తేదీ నుండి అమల్లోకి రానుందని తెలిపారు. ఈ సదుపాయం సొంత వాహనాలకు ఎంతో ప్రయోజనకరమని, యాక్టివేషన్ తేదీ నుండి ఒక సంవత్సరం కాలంలో 200 ట్రిప్పులు ఉచితంగా ప్రయాణించేందుకు అవకాశం ఉంటుందని, ఒక జత ఎంట్రీ, ఎగ్జిట్ ఒక ట్రిప్పుగా లెక్కించబడుతుందని, వాణిజ్యపరమైన వాహనాలకు ఈ సదుపాయం వర్తించదని తెలిపారు. ఈ వార్షిక పాస్ను రాజ్మార్గ్ యాత్ర మొబైల్ అప్లికేషన్, ఎన్.హెచ్.ఎ.ఐ. వెబ్సైట్లో పొందవచ్చని, ఫాస్ట్ టాగ్ ధృవీకరించబడిన తరువాత వార్షిక పాస్ పని చేస్తుందని, రుసుము చెల్లించిన 2 గంటల లోపు సంబంధిత రిజిస్టర్ పాస్ టాగ్ అమల్లోకి వస్తుందని, ఫాస్టాగ్ ఉన్న పాత బాలెన్స్ నూతన విధానాలకు వర్తింపజేయదని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఈ నెల 18న లైసెన్స్ సర్వేయర్లకు శిక్షణ

**- జిల్లా సర్వే, భూరికార్డుల ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వే శ్రీనివాస్**

**వెలుతురు మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఆగస్టు 14**

జిల్లా కేంద్రంలోని కాలేజ్డులో గల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 18న ఉదయం 10 గం?ల నుండి రెండవ బ్యాచ్ కోసం ఎంపిక చేయబడిన లైసెన్స్ సర్వేయర్ల అభ్యర్థులకు శిక్షణ అందించడం జరుగుతుందని జిల్లా సర్వే, భూరికార్డుల ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వే శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు తమ ఎస్.ఎస్.సి., విద్యార్హత, కమ్యూనిటీ సర్టిఫికెట్లు నిజ ప్రతులతో పాటు ఒక సెట్ నకలు ప్రతులతో సకాలంలో హాజరు కావాలని, సివిల్ సర్జన్చే జారీ చేయబడిన శారీరక ధృఢత్వ ధృవీకరణ పత్రాన్ని కూడా సమర్పించాలని తెలిపారు. ఇతర వివరాలకు 9676993237 నంబర్లో సంప్రదించాలని తెలిపారు.

# మున్సిపల్ చట్టసవరణ ఆర్డినెన్స్కు గవర్నర్ ఆమోదం

**హైదరాబాద్,ఆగస్ట్14( వెలుతురు):**

తెలంగాణ మున్సిపల్ చట్ట సవరణ ఆర్డినెన్స్కు గవర్నర్ ఆమోదం లభించింది. ఆర్డినెన్స్ 3కి గవర్నర్ ఆమోదం లభించడంతో న్యాయశాఖ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ ఆర్డినెన్స్ ద్వారా సంగారెడ్డి జిల్లాలో ఇంద్రీశం, జిన్నారం మున్సిపాలిటీల ఏర్పాటుకు ఆమోదం లభించింది. మున్సిపల్ ఛైర్మన్లు, వైస్ ఛైర్మన్లు, కార్పొరేషన్ల మేయర్లు, డిప్యూటీ- మేయర్ల ఎన్నికల్లో రాజ్యసభ సభ్యులకు సైతం ఓటు-హక్కు కల్పించేలా తెలంగాణ మున్సిపల్ చట్టంలోని సెక్షన్-20కి సవరణ చేశారు.

# సమస్యల వలయంలో గ్రామాలు

**- నిధులు లేక కుంటుపడిన గ్రామాల అభివృద్ధి**

**- ఆనగంటి వెంకటేష్ డివైఎఫ్ఐ రాష్ట్రకార్యదర్శి**



**రామన్నపేట వెలుతురు న్యూస్ ఆగస్టు 14**

రాష్ట్రంలో ఉన్న గ్రామాల్లో ఇంచార్జి అధికారుల పాలనలో నిధులు లేక గ్రామాల అభివృద్ధి కుంటుపడిందని,ప్రభుత్వాలు గ్రామపంచాయతీలకు నిధులు కేటాయించకపోవడంతో సమస్యలు పేరకు పోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఆనగంటి వెంకటేష్ అన్నారు.భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) ఆధ్వర్యంలో మండలంలోని దుబ్బాక గ్రామంలో స్థానిక సమస్యలపై సర్వే నిర్వహించడం జరిగింది. ఈ సర్వే కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన రాష్ట్ర కార్యదర్శి ఆనగంటి వెంకటేష్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా గ్రామాల్లో ప్రభుత్వాలు నిధులు కేటాయించకపోవడంతో గ్రామాలు అభివృద్ధికి నోచుకోవడంలేదని అన్నారు. దుబ్బాక గ్రామంలో రోడ్లు పెద్ద పెద్ద గుంతలు పడడంతో వర్షం నీరు చేరడంతో ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారని అన్నారు. అదేవిధంగా సుందరయ్య కాలనీ లో డ్రైనేజీ లేకపోవడం వల్లన ఇండ్ల మధ్యనే డ్రైనేజీ నీళ్లు ఉండడంతో తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారు.నీళ్ల ట్యాంక్ మెట్లు సరిగ్గా లేకపోవడంతో ట్యాంక్ ను గత మూడు సంవత్సరాలుగా శు భ్రం చేయకుండా అదే వాటర్ ను సప్లై చేస్తున్నారు.స్థానిక ఎమ్మెల్యే స్పందించి గ్రామాల్లో పేరుకుపోయిన సమస్యలను పరిష్కరించాలని, ప్రభుత్వాలు గ్రామాలకు నిధులు కేటాయించాలని డిమాండ్ చేసారు. గ్రామంలో సర్వే అనంతరం గ్రామ సమస్యలను పరష్కరించాలని గ్రామ పంచాయతీ కార్యదర్శి కి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ మండల అధ్యక్ష కార్యదర్శులు శానగొండ రాము, మెట్టు శ్రవణ్, నాయకులు గుండాల నరేష్, లెనిన్, గుండాల ప్రసాద్, గుండాల అనిల్,కంబాలపల్లి మచ్చ గిరి,గట్టు మహేష్, గట్టు సుందర్, గట్టు జ్యోతిబసు, గుండాల నరేష్,పుట్టల ఉదయ్, పైళ్ల చింటూ, టంటం శివ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# రామకృష్ణ కాలనీలో మహనీయుల విగ్రహాల శుద్ధి, తిరంగా ర్యాలీ...

**- ఆపరేషన్ సింధూర్ విజయానికి ప్రతీకగా పంద్రాగస్టు వేడుకలు..**

**- ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరవేయండి...**

**- బిజెపి జిల్లా అధికార ప్రతినిధి, సెంట్రల్ ఫిలిం సెన్సార్ బోర్డ్ సభ్యులు బొంతల కళ్యాణ్ చంద్ర**





**కరీంనగర్ వెలుతురు ఆగస్టు 14:**

తిరంగా అభియాన్ ప్రోగ్రాంలో భాగంగా తిమ్మాపూర్ మండల బిజెపి శాఖ ఆధ్వర్యంలో గురువారం రోజున రామకృష్ణ కాలనీలోని మహాత్మ జ్యోతిరావు పూలే, అంబేద్కర్ విగ్రహాల



శుద్ధి కార్యక్రమాన్ని చేపట్టి, ఆ మహనీయులకు ఘన నివాళు లు అర్పించారు. అనంతరం తిరంగా ర్యాలీ చేపట్టారు. ఇట్టి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బిజెపి జిల్లా అధికార ప్రతినిధి, సెంట్రల్ ఫిలిం సెన్సార్ బోర్డు సభ్యులుమాట్లాడుతూ ఆపరేషన్ సింధూర్ విజయానికి ప్రతీకగా పంద్రాగస్టు వేడుకలు నిర్వహించుకొని , ప్రతి ఒక్కరు తమ ఇంటిపై జాతీయ జెండా ఎగరవేయాలని పిలుపునిచ్చారు. పార్టీ సూచన మేరకు ప్రజలతో కలిసి తిరంగా కార్యక్రమాలు నిర్వహించాలని, దేశభక్తి పూరిత కార్యక్రమాలు చేపట్టేలా ప్రోగ్రాములు నిర్వహిస్తూ , దేశ సమైక్యత సమగ్రత కోసం ప్రతిజ్ఞ చేయాలని సూచించారు. ముఖ్యంగా ఆపరేషన్ సింధూర్ విజయం దేశానికి గర్వకారణంగా నిలిచిందన్నారు. యావత్ ప్రపంచమే సింధూర్ ఆపరేషన్ , భారత్ ధైర్య సాహసాలు , శక్తి సామర్థ్యాలను చూసి నివ్వరపోయిందన్నారు. సింధూర్ తో దేశ ఖ్యాతి విశ్వంలో మార్మోగిపోతుందన్నారు. అందుకే ఆపరేషన్ సింధూర్ పంద్రాగస్టు వేడుకలను మరింత ఘనంగా నిర్వహించేలా కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకొని, ఆగస్టు 15న ఆ దిశగా కార్యక్రమాలను చేపడుతుందని ఆయన ఈ సందర్భంగా వివరించారు. పార్టీ ఆధ్వర్యంలో తిరంగా ప్రోగ్రాములు చేపట్టాలని సూచించిన నేపథ్యంలో ఆగస్టు 15 న నిర్వహించే కార్యక్రమంలో ప్రజల భాగస్వామ్యం పెద్ద సంఖ్యలో ఉండేలా చూడాలన్నారు. ముఖ్యంగా పార్టీ కార్యకర్తలు అందరి ఇంటిపై, కార్యాలయాల భవనాలపై త్రివర్ణ పతాకం ఎగరవేయాలని, సాధ్యమైనంతవరకు పిల్లల చేత జెండాలు ఎగర వేయించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో



బిజెపి నాయకులు, కిసాన్ మోర్చా రాష్ట్ర నాయకులు మైపాల్ రెడ్డి మాజీ జెడ్పిటిసి ఎడ్ల జోగిరెడ్డి బీజేవైఎం జిల్లా ఈసీ మెంబర్ బండి సాగర్, మండల ప్రధాన కార్యదర్శి తిరుపతి రెడ్డి, సీనియర్ నాయకులు వేల్పుల ఓదెలు కిషన్ మోర్చా జనరల్ సెక్రెటరీ బుర్ర శ్రీనివాస్ చింతం లక్ష్మణ్ కామెర వెంకటేష్ భూత్ అధ్యక్షుడు కోతి రాజు పల్లె శ్రీనివాస్ రెడ్డి బిజెపి కార్యకర్తలు పాల్గొన్నారు.. ప్రోగ్రాం అనంతరం మండల బిజెపి ప్రధాన కార్యదర్శి తిరుపతి రెడ్డి ఆధ్వర్యంలో పర్లపల్లి గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల తిరంగా ర్యాలీ ప్రోగ్రాం జరిగింది.

**ఇంటిపై, వాణిజ్య సముదాయ భవనంపై జాతీయ జెండా ఎగరవేసిన బొంతల కళ్యాణ్ చంద్ర**

హర్ ఘర్ తిరంగా అభియాన్ ప్రోగ్రాం లో భాగంగా గురువారం రోజున అలుగునూరులోని శ్రీ వెంకటేశ్వర కాలనీ గల నివాస గృహంపై, రామకృష్ణ కాలనీ , సుభాష్ నగర్ లో గల వాణిజ్య సముదాయ భవనంపై బొంతల కళ్యాణ్ చంద్ర జాతీయ జెండా ఎగరవేశారు.

# బందరు దొడ్డిని తలపిస్తున్న కడుకుంట్ల బీసీ గురుకుల పాఠశాల

**- గురుకులాకు శాశ్వత భవనాలు నిర్మించాలి**

**- బీసీ పొలిటికల్ జెఎసి స్టేట్ చైర్మన్ డా.రాచాల యుగంధర్ గౌడ్**



**వనపర్తి వెలుతురు ఆగస్టు 14:**

నాగవరం రేకుల షెడ్డులో నడుస్తున్న బీసీ గురుకుల పాఠశాలను విద్యార్థుల సౌకర్యార్థం వైటిసి బిల్డింగులోకి మార్చాలని బీసీ పొలిటికల్ జెఎసి స్టేట్ చైర్మన్ డా. రాచాల యుగంధర్ గౌడ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గురువారం వనపర్తి జిల్లా నాగవరంలోని మహాత్మా జ్యోతిభా పూలే బీసీ గురుకుల పాఠశాలను సందర్శించి అక్కడి వసతులను పరిశీలించిన అనంతరం మీడియాతో మాట్లాడారు. కడుకుంట్ల బీసీ గురుకుల పాఠశాలను ఇక్కడ నిర్వహిస్తున్నారని, ఈ పాఠశాలలో 465 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని, విద్యా బోధన, భోజనం అన్నీ బాగానే ఉన్నాయని, కానీ వసతి మాత్రం చాలా దారుణంగా ఉందని, బందరు దొడ్డిని తలపిస్తుందన్నారు. గత ప్రభుత్వం గురుకులాలను అట్టహాసంగా ఏర్పాటు చేసి, పక్కా భవనాలను నిర్మించడంలో నిర్లక్ష్యం చేసిందన్నారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత విద్యపై ప్రత్యేక దృష్టి పెట్టి విద్యార్థులకు మెస్ ఛార్జీలు, కాస్మొటిక్ ఛార్జీలు పెంచడమే గాక, విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా టీచర్లను కూడా భర్తీ చేసిందన్నారు. గురుకులాకు పక్క భవనాలు లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, దీనిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి శాశ్వత భవనాలు నిర్మించి విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఇక్కడ విద్యార్థులకు తగిన వసతి లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఇక్కడి పాఠశాలను వేరే చోటికి మార్చాలని స్థానిక ఎమ్మెల్యే మేఘారెడ్డి గారికి రాఛాల ఫోన్ చేసి మాట్లాడారు.. స్పందించిన ఎమ్మెల్యే గారు అధికారులతో మాట్లాడి వీలైనంత త్వరగా వేరే చోటికి తరలించేవిధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ పొలిటికల్ జెఎసి వనపర్తి పట్టణ అధ్యక్షుడు దేవర శివ, కొత్తకోట మండల అద్యక్షులు అంజన్న యాదవ్, జిల్లా కార్యదర్శి బత్తుల జితేందర్, శ్రీరంగాపూర్ మండల ప్రధాన కార్యదర్శి అస్కని రమేష్, మ్యాదరి రాజు, యశ్వంత్, బాలరాజు మరియు విద్యార్థుల తల్లితండ్రులు పాల్గొన్నారు.



# కాశ్మీర్‌కు ప్రత్యేకహోదా పునరుద్ధరణ

**- ప్రభుత్వం స్పందన కోసం ఎదురుచూపు**

**- సుప్రీంలో విచారణ సందర్భంగా చీఫ్ జస్టిస్**



**న్యూఢిల్లీ,ఆగస్ట్14( వెలుతురు):** జమ్మూ కాశ్మీర్‌కు రాష్ట్ర హోదాను పునరుద్ధరించటంపై సుప్రీం కోర్టు స్పందించింది. దేశ అత్యున్నత న్యాయస్థానం ఏప్రిల్ నెలలో జరిగిన పహల్గామ్ ఉగ్రదాడిని ప్రస్తావించింది. ఉగ్రదాడిని, దాడి వల్ల ఏర్పడ్డ ప్రాంతీయ భద్రతా సమస్యలను విస్మరించలేమని తేల్చి చెప్పింది. గురువారం జమ్మూ కాశ్మీర్‌కు రాష్ట్ర హోదాను పునరుద్ధరించాలన్న పిటిషన్‌పై చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయ్ నాయకత్వంలోని ధర్మాసనం విచారణ జరిపింది. జమ్మూకాశ్మీర్‌కు రాష్ట్ర హోదాపై కీలక వ్యాఖ్యలు చేసింది. పహల్గామ్ ఉగ్రదాడిని, దాడి కారణంగా జమ్మూకాశ్మీర్‌లో నెలకొన్న ప్రాంతీయ భద్రతా సమస్యల్ని విస్మరించలేము' అని ధర్మాసనం పేర్కొంది. జమ్మూ కాశ్మీర్‌కు రాష్ట్ర హోదాను పునరుద్ధరించాలంటూ దాఖలు అవుతున్న పిటిషన్లను కలిపి ఓ జాబితా చేయాలని విచారణ సందర్భంగా సీనియర్ న్యాయవాది గోపాల్ శంకరనారాయణ్ కోర్టును కోరారు. ఓ బెంచ్ ఏర్పాటు– చేసి, ఓ కచ్చితమైన సమయాన్ని నిర్ణయిస్తే బాగుంటుందని అన్నారు. దీనికి చీఫ్ జస్టిస్ సమాధానం ఇస్తూ 'ప్రభుత్వం నుంచి ముందు స్పందన రానివ్వండి' అని అన్నారు. కాగా, 2023 డిసెంబర్ నెలలో సుప్రీంకోర్టు జమ్మూకాశ్మీర్‌కు రాష్ట్ర హోదాపై విచారణ జరిపింది. అసెంబ్లీ ఎన్నికలు జరిగిన తర్వాత రాష్ట్ర హోదా పునరుద్ధరించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. 2024 సెప్టెంబర్ నుంచి అక్టోబర్ మధ్యలో జమ్మూకాశ్మీర్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. కూటమి ప్రభుత్వం విజయం సాధించింది. 42 సీట్లకు గానూ కూటమి ప్రభుత్వం 27 సీట్లు గెలిచింది. ఒమర్ అబ్దుల్లా ముఖ్యమంత్రి అయ్యారు. అయితే, కొత్త ప్రభుత్వం ఏర్పా–టై సంవత్సరం అవుతున్నా రాష్ట్ర హోదా పునరుద్ధరించకపోవటంపై సుప్రీం కోర్టులో వరుసగా పిటిషన్‌లు దాఖలు అవుతున్నాయి.

# ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు

## - జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**వెలుతురు మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఆగస్టు 14** ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని హాజీపూర్ మండల కేంద్రంలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి వార్డులు, మందుల నిల్వలు, ల్యాబ్, రిజిస్టర్లు, పరిసరాలను పరిశీలించి ప్రజలతో మాట్లాడి ఆరోగ్య కేంద్రంలో పొందుతున్న వైద్య సేవల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజల ఆరోగ్యం దృష్ట్యా వైద్య రంగాన్ని బలోపేతం చేస్తూ అనేక చర్యలు తీసుకుంటుందని, ప్రభుత్వ ఆసుపత్రులు, సామాజిక, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆధునికరించి ప్రజలకు మెరుగైన, వేగవంతమైన వైద్య సేవలు అందించడం జరుగుతుందని తెలిపారు. వర్షాకాలం అయినందున సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా పాటించవలసిన జాగ్రత్తలను ప్రజలకు వివరించాలని, అవసరమైన మందులను ఆసుపత్రిలో అందుబాటులో ఉంచుకోవాలని, వైద్యులు, సిబ్బంది విధుల పట్ల బాధ్యతగా వ్యవహరించి సమయపాలన పాటించాలని తెలిపారు. అనంతరం కస్తూరిభా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి తరగతి గదులు, మధ్యాహ్న భోజనం నాణ్యత పరిశీలించారు. ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమం లో భాగంగా అమలు చేస్తున్న మెనూ ప్రకారం సకాలంలో విద్యార్థులకు పోషక విలువలు కలిగిన ఆహారం, శుద్ధమైన త్రాగునీటిని అందించాలని, విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. మధ్యాహ్న భోజనం తయారీలో తాజా కూరగాయలు, నాణ్యమైన నిత్యవసరాలను వినియోగించాలని తెలిపారు. వర్షాకాలం దృష్ట్యా అంటూ వ్యాధులు వ్యాప్తి చెందకుండా పాటించవలసిన జాగ్రత్తలను విద్యార్థులకు వివరించాలని, వ్యక్తిగత పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని తెలిపారు. తరగతి గదులు, వంటశాల, మూత్రశాలలు, పరిసరాల పరిశుభ్రత పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. ఉపాధ్యాయులు విద్యార్థినులకు అర్థమయ్యే విధంగా విద్యాబోధన చేయాలని, తరగతిలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.





# ప్రేలాపనలు మానండి

**పాక్ నేతలకు జైశ్వాల్ హెచ్చరిక**



**న్యూఢిల్లీ,ఆగస్ట్14( వెలుతురు):** పాకిస్థాన్ ఎలాంటి దుస్సాహసాలకు పాల్పడినా, బాధాకరమైన పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని విదేశాంగ శాఖ తీవ్ర హెచ్చరికలు చేసింది. పాక్ నేతలు తమ నోటిని అదుపులో ఉంచుకోవాలని, లేకపోతే పరిస్థితులు తీవ్రంగా ఉంటాయని కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ హెచ్చరించారు. పహల్గామ్ ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్ (క్షూ।సశష÷ఎస) కారణంగా భారత్, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు తీవ్ర రూపం దాల్చాయి. రెండు దేశాల్లోనూ ఉద్రిక్తతలు ఇప్పుడే చల్లబడుతున్న నేపథ్యంలో పాక్ నేతలు కవ్వింపు చర్యలకు దిగుతున్నారు (శీషశ). అణుదాడికి దిగుతామంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారు. పాకిస్థాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్, పాక్ ఆర్మీ చీఫ్ అసిమ్ మునీర్, మాజీ విదేశాంగ మంత్రి బిలావల్ భుట్టో సహా పలువురు నేతలు భారత్‌ను రెచ్చగొట్టే తరహాలో ప్రకటనలు చేస్తున్నారు. ఇటీవలి అమెరికాలో పర్యటనలో పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ అసిమ్ మునీర్ (ఆప ఃషస).. భారత్‌పై అణు బెదిరింపులకు దిగారు. తమ అస్థిత్వానికి భారత్ ముప్పు తీసుకువచ్చే పరిస్థితి ఎదురైతే ప్రపంచంలో సగభాగాన్ని నాశనం చేస్తామంటూ బెదిరించారు. ఈ వ్యాఖ్యలకు భారత్ దీటుగానే కౌంటర్ ఇచ్చింది. తాజాగా కేంద్ర విదేశాంగ శాఖ కూడా తీవ్రంగా స్పందించింది.

# విజయవాడ స్టేడియంలో నేడు జండా ఆవిష్కరణ


**- నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు విధించిన పోలీసులు**



**విజయవాడ,ఆగస్ట్14( వెలుతురు):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ముస్తాబు అవుతుంది. ఈ మేరకు రాష్ట్రమంత జాతీయ జెండాలతో కళకళలాడుతుంది. సీఎం చంద్రబాబు నేతృత్వంలో స్వాతంత్ర్య దినోత్సవం ఘనంగా నిర్వహించేందుకు అధికారులు సర్వం సిద్ధం చేస్తున్నారు. విజయవాడ స్టేడియంలో జెండా ఆవిష్కరణ నేపథ్యంలో పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు.స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా 15వ తేదీ ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు ట్రాఫిక్‌ను వివిధ మార్గాలకు మళ్లించనున్నారు పోలీసులు. ఉదయం 7 గంటల నుండి కంట్రోల్ రూమ్ వైపు నుండి బెంజ్ సర్కిల్ వైపుకు వెళ్లే వాహనాలను ఆర్.టి.సి. వై జంక్షన్ నుంచి ఏలూరు రోడ్ మీదుగా చుట్టు–గుంట –గుణదల – రామవరప్పాడు రింగ్ మీదుగా బెంజ్ సర్కిల్ వైపుకు మళ్లించనున్నట్లు– పోలీసులు తెలిపారు. అలాగే.. బెంజ్ సర్కిల్ వైపు నుంచి బందర్ రోడ్డులోనికి వచ్చే వాహనాలను బెంజ్ సర్కిల్ నుంచి ఫకీర్‌గూడెం – స్క్యూ బ్రిడ్జ్ – నేతాజీ బ్రిడ్జ్ – బస్టాండ్ వైపుకి మళ్లించనున్నారు. రెడ్ సర్కిల్ నుంచి ఆర్.టి.ఎ. జంక్షన్, శిఖామణి సెంటర్ నుంచి వెటరినరీ జంక్షన్ వరకు ఏ విధమైన వాహనములు అనుమతించబడవని అధికారులు స్పష్టం చేశారు. కాగా, ఆఅ, ఆ1, ఆ2, ఇ1, ఇ2 పాస్ కలిగిన వారు నిర్దేశిరచిన మార్గాల్లో స్టేడియంలోకి రావాలని సూచిస్తున్నారు. సాయంత్రం విజయవాడ పండిట్ నెహ్రూ బస్ స్టేషన్‌లో స్త్రీ శక్తి పథకం క్రింద మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని సీఎం చంద్రబాబు ప్రారంభించనున్నారు. రేపు మధ్యాహ్నం 01.00 గంట నుండి సాయంత్రం 05.00 గంటల వరకు బందరు రోడ్డు, ఏలూరు రోడ్డుల నుండి పాత కంట్రోల్ రూం వరకు ఎలాంటి ఆటోలకు అనుమతులు లేవని అధికారులు ప్రకటన విడుదల చేశారు.



# రానున్న 24 గంటలు అత్యంత కీలకం



## రాష్ట్ర రెవెన్యూ, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

**వెలుతురు మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఆగస్టు 14**
వచ్చే 3 రోజులలో రానున్న 24 గంటలు అత్యంత కీలకమని రాష్ట్ర రెవెన్యూ, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గురువారం హైదరాబాద్ నుండి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఇతర ఉ న్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, పోలీసు ఉన్నతాధికారులతో వర్ష పరిస్థితులలో చేపట్టవలసిన చర్యలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ వాతావరణ సూచన మేరకు వచ్చే 3 రోజులలో భారీ నుండి అతి భారీ వర్షాలు కురువనున్న నేపథ్యంలో రానున్న 24 గంటలు అత్యంత కీలకమైన సమయమని, ప్రజల రక్షణ దిశగా అధికార యంత్రాంగం మరింత అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని, ముఖ్యంగా లోతట్టు, వరద ప్రభావితం ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించి పునరావాసం ఏర్పాటు చేయాలని తెలిపారు. శిథిలావస్థలో ఉన్న భవనాలలో నివసించే వారిని వెంటనే తరలించాలని, వాగులు, నదులు ఉధృతంగా ప్రవహించే



సమయంలో ప్రజలను, వాహనదారులను అటువైపుగా వెళ్లకుండా అడ్డుకొని సిబ్బందితో పహారా ఉండాలని తెలిపారు. విద్యుత్ శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండి విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలని, రహదారులు, కల్వర్టులు దెబ్బతింటే ఆ ప్రాంతంలో ప్రమాద సూచికలు ఏర్పాటు చేసి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని తెలిపారు. త్రాగునీటికి ఇబ్బంది లేకుండా చూడాలని, వైద్య సిబ్బంది వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రాణ నష్టం, ఆస్తి నష్టం, పశు నష్టం



జరగకుండా జిల్లా అధికారులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. భారీ వర్షాలు నేపథ్యంలో సహాయ చర్యల నిమిత్తం ప్రతి జిల్లాకు కోటి రూపాయలు విడుదల చేయడం జరిగిందని, ఉమ్మడి జిల్లాలకు సీనియర్ అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమించడం జరిగిందని తెలిపారు. సెలవులలో ఉన్న అధికారులు, సిబ్బందిని సెలవులు రద్దు చేసి వెనక్కు పిలిపించాలని, రైల్వే లైన్లు, లో లెవెల్ వంతెనలు, కాజ్ వే లు, లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారచి వర్షం నీరు నిలవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, లో లెవెల్ వంతెనల వద్ద పోలీసు సిబ్బందిని నియమించి బందోబస్తు ఏర్పాటు చేయాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజారక్షణ దిశగా చర్యలు తీసుకుంటున్నామని, అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేస్తూ రక్షణ చర్యలు చేపడుతున్నామని తెలిపారు. మంగళవారం రాత్రి జిల్లాలోని భీమిని, కన్నేపల్లి, తాండూర్, బెల్లంపల్లి మండలాలలో కురిసిన భారీ వర్షాల కారణంగా వాగులు, ఒర్రెలు ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తున్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో 5 కుటుంబాలను సురక్షిత ప్రాంతాలకు తరలించి పునరావాసం కల్పించడం జరిగిందని తెలిపారు. రైల్వే అండర్ పాస్ పూర్తిగా నీళ్లతో నిండడం వల్ల భారీ గేట్లు ఏర్పాటు చేసి బందోబస్తు చర్యలు చేపట్టిన జరిగిందని, జన్నారం లోని నీటి కుంట గండి పడటంతో పునరుద్ధరణ చేయడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలోని ప్రజల ప్రాణ, పశు నష్టం, ఆస్తి నష్టం జరగకుండా అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటున్నామని, ప్రజల తక్షణ సహాయం కోసం సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి 24 గంటలు అందుబాటులో ఉంటున్నామని తెలిపారు. వర్షాల కారణంగా పంట నష్టానికి నిబంధనల ప్రకారం రైతులకు నష్టం జరగకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో 90 మంది సభ్యులతో కూడిన 3 ఎస్.డి. ఆర్. ఎఫ్. బృందాలు, రక్షణ పరికరాలతో తక్షణ సహాయం కోసం సిద్ధంగా ఉన్నామని తెలిపారు. లో లెవెల్ కాజ్ వేల వద్ద ప్రజలు వెళ్లకుండా భారీ కేడ్లు ఏర్పాటు చేసి బందోబస్తు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. జిల్లా యంత్రాంగం రాబోవు మూడు రోజులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండి అప్రమత్తత చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డి.సి.పి. ఎ. భాస్కర్, జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) చంద్రయ్య, మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఎప్పటికైనా అఖండ భారత్ ఏర్పాటు తప్పదు

**- అనివార్య పరిస్థితుల్లో ఆనాడు దేశ విభజన**

**- కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ**

**నాగపూర్,ఆగస్ట్14( వెలుతురు):**



అనివార్య పరిస్థితుల్లో ఆనాడు దేశ విభజన జరిగిందని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ అన్నారు. భారత్-పాకిస్థాన్‌లు విభజనను గుర్తుచేసుకుంటే.. అనివార్య పరిస్థితుల్లోనే నాడు దేశ విభజన జరిగిందని గుర్తించాలని అన్నారు. ఏదో ఒకరోజు మళ్లీ అఖండ దేశంగా భారత్ మారుతుందని గడ్కరీ పేర్కొన్నారు. భారత్‌ను సూపర్ పవర్, విశ్వగురువుగా మార్చాలని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ పిలుపునిచ్చారు. ప్రతి రంగంలో మనం బలంగా ఉంటేనే ప్రపంచం భారత్ మాట వింటుందన్నారు. నాగ్‌పుర్‌లో రాష్ట్ర నిర్మాణ్ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో మాట్లాడిన ఆయన.. అప్పట్లో భిన్నత్వంలో ఏకత్వం భావనతో భారత్ దూసుకెళ్తోందన్న ఆయన.. సాయుధ బలగాల పనితీరుపై ప్రశంసలు కురిపించారు. భారత్‌ను 5 ట్రిలియన్ డాలర్లతో ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దేందుకు మోదీ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఆత్మనిర్భరత సాధించడంతోపాటు- విశ్వగురువుగా భారత్ మార్చేందుకు కృషి చేయాలని గడ్కరీ పిలుపునిచ్చారు. ప్రతి రంగంలో భారత్ బలంగా ఉంటేనే ప్రపంచం మన మాట వింటుందన్నారు. ఆర్థికంగా, రక్షణ, సైన్స్ అండ్ -టె-క్నాలజీ, వ్యవసాయ, వాణిజ్య రంగాల్లో అగ్రగామిగా ఉండటంతోపాటు- ప్రతి పౌరుడు దేశభక్తితో ఉన్నప్పుడే 'విశ్వగురువు'గా మారుతుందన్నారు.

# క్లౌడ్ బరస్ట్ ప్రమాదంతో ఎట్‌హోమ్ రద్దు

**- సాంస్కృతిక కార్యక్రమాలు కూడా నిలిపివేత**

**- సిఎం ఓమర్ అబ్దుల్లా ప్రకటన**



**శ్రీనగర్,ఆగస్ట్14( వెలుతురు):**
కిశ్త్‌వాడ్‌లో క్లౌడ్ బరస్ట్ వల్ల చోటు-చేసుకున్న విషాదంతో జమ్మూకశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా కీలక నిర్ణయం తీసుకున్నారు. శుక్రవారం సాయంత్రం జరగాల్సిన 'ఎట్ హోం' టీ- పార్టీని రద్దు చేసుకున్నట్లు తెలిపారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలను సైతం నిలిపివేయాలని నిర్ణయించినట్లు- తెలిపారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా పోస్టు పెట్టారు. ప్రసంగం, మార్చ్ ఫాస్ట్ వంటి అధికారిక కార్యక్రమాలు మాత్రమే జరుగుతాయని తెలిపారు. శ్రీనగర్‌లోని బక్షి స్టేడియంలో జరిగే మార్చ్‌ఫాస్ట్‌లో ఒమర్ అబ్దుల్లా గౌరవ వందనం స్వీకరించనున్నారు. ఈ ఘటనపై కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో మాట్లాడినట్లు- సీఎం ఒమర్ అబ్దుల్లా తెలిపారు. ప్రస్తుతం నెలకొన్న తాజా పరిస్థితులను ఆయనకు వివరించానన్నారు. ఈ ఘటనకు సంబంధించిన కచ్చితమైన సమాచారం ఇప్పుడిప్పుడే అందుతోందన్నారు. తాజా పరిస్థితులు, సహాయక చర్యలపై ఎప్పటికప్పుడు సమాచారాన్ని ప్రజలతో షేర్ చేసుకుంటామన్నారు. కిశ్త్‌వాడ్‌లో క్లౌడ్ బరస్ట్ కారణంగా చోటుచేసుకున్న మెరుపు వరదలు పెను విషాదం రేపాయి. ఈ ఘటనలో 46 మృతదేహాలను వెలికి తీసినట్లు- అధికారులు వెల్లడించారు. శిథిలాల కింద ఇంకా అనేకమంది చిక్కుకొని ఉండొచ్చని భావిస్తున్నట్లు- తెలిపారు.




## పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటిసిల గెలుపు

**- ప్రజలు అభివృద్ధిని కోరుకుంటున్నారన్న లోకేశ్**

**- లతారెడ్డిని ఫోన్‌లో అభినందించిన నారా భువనేశ్వరి**



**అమరావతి,ఆగస్ట్14( వెలుతురు):**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఉప ఎన్నికలకు తెరపడింది. రెండు స్థానాలను భారీ మెజార్టీతో టీడీపీ కైవసం చేసుకుంది. ఏపీ మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి సొంత గడ్డపై 30 ఏళ్ల తర్వాత టీడీపీ తన జెండా ఎగరవేసింది. దీంతో పార్టీ అగ్రనేతలతో సహా ప్రతి ఒక్కరూ.. సంబరాలు చేసుకుంటున్నారు. ప్రజలు ప్రజాస్వామ్యానికి మద్దతు తెలిపారని హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో టీడీపీ ఘన విజయంపై ఏపీ ఐటీ-, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ స్పందించారు. పులివెందుల, ఒంటిమిట్ట ప్రజలు వెనుకబడిన తనాన్ని వదిలి అభివృద్ధిని కోరుకున్నారని తెలిపారు. గడచిన 30 ఏళ్లలో తొలిసారి పులివెందులలో నిజమైన ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలు జరిగాయని పేర్కొన్నారు. అక్కడి ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటు- హక్కును వినియోగించుకునే అవకాశం లభించిందని చెప్పారు. ఎన్నికల్లో గెలుపొందిన లతా రెడ్డి, కృష్ణారెడ్డికి అభినందనలు తెలిపారు. టీడీపీ అభ్యర్థులను గెలిపించిన స్థానిక ప్రజలకు హృదయపూర్వక ధన్యవాదాలను మంత్రి లోకేశ్ తెలియజేశారు. పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో గెలిచిన లతా రెడ్డికి సీఎం చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి ఫోన్ చేశారు. ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిచినందుకు లతారెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎన్నికల నిర్వాహణ, ఫలితాలపై ఆరా తీశారు. ఈ విజయం ప్రజాస్వామ్యానికి లభించిన గెలుపని ధీమా వ్యక్తం చేశారు. ప్రజలు కూటమి పట్ల ఉంచిన నమ్మకానికి ఇది నిదర్శనమని హర్షం వ్యక్తం చేశారు. టీడీపీ కోసం కష్టపడిన ప్రతి నాయకుడికి, కార్యకర్తలకు ఆమె ధన్యవాదాలు తెలిపారు. మహిళలు రాజకీయాల్లో రాణించాలని పేర్కొన్నారు. ప్రజలతో కలిసి పనిచేస్తూ.. ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని భువనేశ్వరి దిశానిర్దేశర చేశారు.

## పులివెందులలో ప్రజాస్వామ్యం గెలిచింది: బాలకృష్ణ



**అమరావతి,ఆగస్ట్14( వెలుతురు):**
గతంలో పులివెందుల ఎన్నికలు అప్రజాస్వామ్యంగా జరిగాయని హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ తెలిపారు. ప్రస్తుతం ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు జరిగాయన్నారు. పులివెందుల ప్రజలకు స్వాతంత్య్రం వచ్చిందని.. వారు స్వేచ్ఛా వాయువులు పీల్చుకున్నారని పేర్కొన్నారు. ప్రజలు తమ ఓటు-హక్కును ధైర్యంగా వినియోగించుకున్నారన్నారు. గతంలో నామినేషన్ వేయడానికి నాయకులు కూడా భయపడే పరిస్థితి ఉందన్నారు. ఈసారి మాత్రం స్వేచ్ఛగా నామినేషన్లు వేశారని వివరించారు

## ప్రజలు తొలిసారి ధైర్యంగా ఓటేశారు: బిటెక్ రవి



**కడప,ఆగస్ట్14( వెలుతురు):**
పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నికలో తెదేపా విజయంపై ఆ పార్టీ నేత బీటెక్ రవి స్పందించారు. గతంలో పులివెందులలో ధైర్యంగా ఓట్లు- వేసే పరిస్థితులు లేవన్నారు. ధైర్యంగా ఓటు- వేసేందుకు ఏర్పాట్లు చేస్తామని తాము ప్రజలకు భరోసా ఇచ్చినట్లు తెలిపారు. గతంలో పోలింగ్ కేంద్రాలకు రానీయకుండా చేశారు. ఇవాళ స్వేచ్ఛాయుత వాతావరణంలో ప్రజలు ఓట్లు- వేశారు. జగన్‌కు బుద్ధి చెప్పాలనే ప్రజల ఆలోచన, తెదేపా అమలుచేసిన పథకాలే పార్టీ విజయానికి దోహదం చేశాయని బీటెక్ రవి అన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు జరిగితే తెదేపాకు ఓట్లు- వేస్తారనేందుకు నిదర్శనం ఈ ఎన్నికలు అని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అన్నారు. వైకాపా చేతుల్లో ఉన్న సిట్టింగ్ స్థానాలను గెలుచుకున్నామని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలపై నమ్మకంతో ప్రజలు తెదేపాకు విజయం కట్టబెట్టారని పేర్కొన్నారు.

## నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పథకం

**- భూనిర్వాసితులకు వెంటనే పరిహారం చెల్లించాలి**

**- మక్తల్ తహసిల్కార్యాలయం వరకు రైతుల పాదయాత్ర**

**మక్తల్,ఆగస్ట్14( వెలుతురు):**
నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పథకంలో భూములు కోల్పోతున్న రైతులకు న్యాయపరమైన పరిహారం చెల్లించేంతవరకు భూసేకరణ చేపట్టరాదని డిమాండ్ చేస్తూ నిర్వహిస్తున్న పాదయాత్రను పోలీసులు అడ్డుకున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంత నియోజవర్గానికి చెందిన వందలాది మంది మక్తల్ మండలంలోని కాట్రేవపల్లి, ఎర్నాగానిపల్లి, కాచ్ వార్ గ్రామాల రైతులు మక్తల్ తహసీల్ కార్యాలయం వరకు పాదయాత్రను ప్రారంభించారు. జిల్లా భూ నిర్వాసితుల జిల్లా అధ్యక్షులు వెంకటరామిరెడ్డి అధ్యక్షతన ప్రారంభించిన పాదయాత్రను అనుమతుల పేరిట పోలీసులు అడ్డుకొని రైతులను అడ్డుకున్నారు. పాదయాత్రకు నేషనల్ హైవే అథారిటీ- అనుమతులు కావాలంటూ దాదాపు నాలుగు గంటల వరకు కచ్‌వార్ గ్రామం వద్ద పోలీసులు అడ్డుకున్నారు. చివరకు నారాయణపేట డీఎస్పీ లింగయ్య ఆంక్షలతో అనుమతి ఇవ్వడంతో పాదయాత్ర కొనసాగింది. మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి పాదయాత్రకు సంఘీభావం తెలిపారు. ఆయన మాట్లాడుతూ నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పథకానికి బలవంతపు భూసేకరణ నిలిపివేయాలని, భూముల బేసిక్ ధరను నిర్ణయించేందుకు ప్రత్యేక కమిషన్ ఏర్పాటు- చేయాలని డిమాండ్ చేశారు. నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పథకానికి ఎలాంటి డీపీఆర్, అనుమతులు లేకుండానే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆగమేఘాలపై రైతుల వద్ద భూములు లాక్కోవాలని ప్రయత్నం చేస్తున్నారని దుయ్యబట్టారు. నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలిచి రాష్ట్ర క్యాబినెట్‌లో మంత్రిగా ఉన్న శ్రీహరి నియోజకవర్గంలో రైతులకు కొడంగల్ మాదిరిగా పరిహారం ఎందుకు ఇప్పిస్తాలేరో బహిర్గత పరచాలన్నారు. రైతులను ఇబ్బందుల పాలు చేస్తూ బలవంతంగా భూసేకరణ కార్యక్రమాన్ని బీఆర్ఎస్ అండగా ఉండడంతోపాటు-, రైతులకు న్యాయం జరిగేంతవరకు పోరాటాలు చేస్తూనే ఉంటు-ందని పేర్కొన్నారు. అనంతరం రైతులు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర భూ నిర్వాసితుల కార్యదర్శి కిలే గోపాల్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రాజుల ఆశి రెడ్డి, నాయకులు అన్వర్ హుస్సేన్, నరసింహారెడ్డి, తరుణ్, షమీ, సాగర్, రైతులు రాఘవేందర్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, కేశవులు, శివ, తదితరులు ఉన్నారు.

# జగన్ ఇలాఖాలో టిడిపి పాగా

**- పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటిసీల్లో ఘన విజయం**

**- 30 ఏళ్ల తరవాత తొలిసారి పులివెందులలో గెలుపు**

**కడప,ఆగస్ట్14( వెలుతురు):**
ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఉత్కంఠ రేపిన పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఉప ఎన్నికలకు తెరపడింది. నువ్వా...నేనా అంటూ.. రసవత్తరంగా సాగిన ఎన్నికల సమరంలో టిడిపి పైచేయి సాధించింది. మాటల యుద్ధాలు.. సవాళ్లకు ప్రతి సవాళ్లు.. ఘర్షణల మధ్య సాగిన ఎన్నికలకు ప్రజలు తీర్పు వెలువరించారు. వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డి సొంత గడ్డపై టీడీపీకి ప్రజలు నీరాజనం పట్టారు. 30 సంవత్సరాల తర్వాత పులివెందుల గడ్డపై టీడీపీ తన సత్తా చాటుతూ విజయభేరి మోగించింది. అలాగే ఒంటిమిట్టలోనూ.. టీడీపీ భారీ విజయం సొంత చేసుకుంది. అయితే ప్రస్తుతం జరిగింది జడ్పీటీసీ ఉపఎన్నిక మాత్రమే. ఏడాది మాత్రమే పదవీ కాలం ఉంటుంది. అయినా రాజకీయ పార్టీలు అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని ప్రచారం చేశాయి. అందుకే ఈ ఎన్నికలు రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి. పోటాపోటీగా సాగిన పులివెందుల ఉపఎన్నిక స్థానాన్ని టీడీపీ కైవసం చేసుకుంది. జడ్పీటీసీ ఉప ఎన్నికలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి మారెడ్డి లతారెడ్డి ఘన విజయం సాధించారు. 6,735 ఓట్ల మెజారిటీతో 30 ఏళ్ల తర్వాత పులివెందుల గడ్డపై ఆమె విజయభేరి మోగించారు. వైకాపా అభ్యర్థి



హేమంత్‌రెడ్డి డిపాజిట్ కోల్పోయారు. వైకాపాకు 683 ఓట్లు లభించాయి. స్వతంత్ర అభ్యర్థులు, కాంగ్రెస్‌కు 100 లోపు ఓట్లు- లభించాయి. ఈ ఉప ఎన్నికలో 74 శాతం ఓటింగ్ నమోదైందని అధికారులు తెలిపారు. ఈ స్థానానికి తెదేపా, వైకాపా, కాంగ్రెస్ పార్టీలతో పాటు స్వతంత్ర అభ్యర్థులతో కలిపి 11 మంది బరిలోకి దిగారు. ఈ ఎన్నికలో లతారెడ్డి గెలుపొందినందుకు రాష్ట్ర బిసి సంక్షేమశాఖా మంత్రి సవిత అభినందించారు. ఈ విజయం కోసం కష్టపడ్డ కార్యకర్తలకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.ఒంటిమిట్ట జడ్పీటీసీ ఎన్నికలోనూ తెలుగుదేశం పార్టీ ఘన విజయం సాధించింది. రెండు రౌండ్లలో కలిపి వైసీపీ అభ్యర్థి సుబ్బారెడ్డికి 6,351 ఓట్లు- రాగా.. టీడీపీ అభ్యర్థి ముద్దుకృష్ణారెడ్డికి 12,505 ఓట్లు- వచ్చాయి. టీడీపీ మెజారిటీ 6,154కు చేరింది. ఒంటిమిట్టలో టీడీపీ గెలవడంతో ఆ పార్టీ నేతలు టపాసులు కాల్చి సంబురాలు చేసుకున్నారు.

## గిరిజన రైతులకుమద్దతుగా నిలిస్తే అరెస్టులా

**- ఆర్ఎస్ ప్రవీణ్ తదితరుల అరెస్ట్‌పై మండిపడ్డ కెటిఆర్**

**హైదరాబాద్,ఆగస్ట్14( వెలుతురు):**
ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తూ.. ప్రజల పక్షాన పోరాడుతున్న బీఆర్ఎస్ పార్టీ నాయకులపై కర్కశంగా విరుచుకుపడుతున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వ పతనం దగ్గరలోనే ఉందని ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ జోస్యం చెప్పారు. గురువారం హైదరాబాద్‌లో కేటీఆర్ మాట్లాడుతూ.. పోడు భూముల పట్టాల కోసం ఉద్యమిస్తున్న కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని దిందా రైతన్నలకు మద్దతుగా నిలిచిన బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ సహా ఇతర నేతలను అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని ఈ సందర్భంగా ఆయన తీవ్రంగా ఖండించారు. రైతుల చేతులకు సంకెళ్లు వేసి.. వారి పక్షాన పోరాడుతున్న వారిని అక్రమంగా నిర్భందించడం రేవంత్ ప్రభుత్వ గుండాగిరికి నిదర్శనమని కేటీఆర్ అభివర్ణించారు. పోడు రైతులను వేధించడం ఆపి.. వారికి వెంటనే పట్టాలు ఇవ్వాలంటూ రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని ఈ సందర్భంగా కేటీఆర్ డిమాండ్ చేశారు. కుట్రపూరిత అరెస్టులను మానుకుని కౌటాల పోలీసుల అదుపులో ఉన్న ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్‌తో సహా బీఆర్ఎస్ పార్టీ నేతలను తక్షణమే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని ఆయన హెచ్చరించారు. కుట్రపూరిత అరెస్టులను మానుకుని కౌటాల పోలీసుల అదుపులో ఉన్న ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌తో సహా బీఆర్ఎస్ నాయకులను తక్షణమే విడుదల చేయాలి. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తూ, ప్రజల పక్షాన పోరాడుతున్న బీఆర్ఎస్ నాయకులపై కర్కశంగా విరుచుకుపడుతున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వ పతనం దగ్గర్లోనే ఉందని కేటీఆర్ హెచ్చరించారు.

## పులివెందుల,ఒంటిమిట్టలపై వైకాపా లంచ్ మోషన్

**- రీ పోలింగ్ జరపాలన్న అభ్యర్థనను తిరస్కరించిన హైకోర్టు**

**అమరావతి,ఆగస్ట్14( వెలుతురు):**
వైఎస్సార్ కడప జిల్లాలోని పులివెందుల, ఒంటిమిట్టలో జడ్పీటీసీ ఉప ఎన్నికలకు సంబంధించి వైకాపా దాఖలు చేసిన లంచ్‌మోషన్ పిటిషన్‌ను ఏపీ హైకోర్టు కొట్టివేసింది. పులివెందుల జడ్పీటీసీ పరిధిలోని 15 పోలింగ్ కేంద్రాల్లో, ఒంటిమిట్టలోని 30 పోలింగ్ కేంద్రాల్లో రీ పోలింగ్ నిర్వహించాలని వైకాపా పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై విచారణ చేపట్టిన న్యాయస్థానం పిటిషన్‌ను కొట్టివేస్తూ ఆదేశాలు జారీ చేసింది. రీ పోలింగ్ అంశంపై ఈసీ నిర్ణయం తీసుకుంటుందని, ఈసీ నిర్ణయాల్లో తాము జోక్యం చేసుకోలేమని ధర్మాసనం స్పష్టం చేసింది.



పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఉప ఎన్నికలో వైకాపాకు ఘోర పరాభవం ఎదురైంది. పులివెందులలో తెదేపా అభ్యర్థి లతారెడ్డి 6,035 ఓట్ల మెజార్టీతో గెలిచారు. వైకాపా అభ్యర్థి హేమంత్‌రెడ్డి డిపాజిట్ కోల్పోయారు. వైకాపాకు 683 ఓట్లు- లభించాయి. స్వతంత్ర అభ్యర్థులు, కాంగ్రెస్‌కు 100 లోపు ఓట్లు- లభించాయి. ఈ స్థానానికి తెదేపా, వైకాపా, కాంగ్రెస్ పార్టీలతో పాటు స్వతంత్ర అభ్యర్థులు కలిపి 11 మంది పోటీ-పడ్డారు. పులివెందుల జడ్పీటీ-సీ ఉప ఎన్నికలో 74 శాతం ఓటింగ్ నమోదైంది. ఒంటిమిట్ట జడ్పీటీ-సీ ఎన్నికల్లో తెదేపా అభ్యర్థి ముద్దుకృష్ణారెడ్డి విజయం సాధించారు. ఈ ఉప ఎన్నికలో ముద్దుకృష్ణారెడ్డికి 12,780 ఓట్లు- రాగా, .. వైకాపా అభ్యర్థి ఇరగంరెడ్డి సుబ్బారెడ్డికి 6,513 ఓట్లు- మాత్రమే వచ్చాయి. దీంతో తెదేపా అభ్యర్థి ముద్దు కృష్ణారెడ్డి 6,267 ఓట్లతో గెలుపొందినట్లు- ఎన్నికల అధికారులు ప్రకటించారు.

# ప్రజాస్వామ్యం గురించి మీరు మాట్లాడడమా?

**- మీరు అసెంబ్లీకి వస్తారా రారో చెప్పండి**

**- మీవల్ల రెండుప్రశ్నలు వేస్ట్ అవుతున్నాయి**

**- జగన్ తీరుపై మండిపడ్డ స్పీకర్ అయ్యన్న పాత్రుడు**

**అమరావతి,ఆగస్ట్14( వెలుతురు):**
వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సభ్యులు అసెంబ్లీకి వస్తారా..? రారా అన్నది స్పష్టత ఇవ్వాలని ఏపీ అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు అన్నారు. ప్రజాస్వామ్యం గురించి ఇప్పుడు మాట్లాడుతున్న మాజీ ముఖ్యమంత్రి.. ముందు ఆ పార్టీ సభ్యులు అసెంబ్లీకి ఎందుకు రావడం లేదో చెప్పాలని ఆయన నిలదీశారు. ప్రజాస్వామ్య దేవాలయంకు ఆయన ఇచ్చే గౌరవం ఇదేనా? ఆ సభ్యులు ఇచ్చే గౌరవం ఇంతేనా? అని అయ్యన్న ఫైర్ అయ్యారు. వచ్చేనెల 17, 18 నుండి అసెంబ్లీ సమావేశాల జరగవచ్చు అని స్పీకర్ అన్నారు. భారత దేశంలో ఏ పౌరుడు అయినా ప్రజాస్వామ్యం గురించి మాట్లాడితే బావుంటుంది.. కానీ, మాజీ ముఖ్యమంత్రి జగన్ మాట్లాడితే చాలా అసహ్యంగా ఉంటుందని ఎద్దేవా చేశారు. గత ప్రభుత్వంలో ఎన్ని అరాచకాలు జరిగాయి.. ప్రజాస్వామ్యానికి వ్యతిరేకంగా ప్రభుత్వం చేస్తుందని మాజీ సీఎం ఎలా అంటారు అని నిలదీశారు? ఆ రోజు అక్కడ ఒక్క నామినేషన్ వేయలేదు.. టీవీలో చూశాను సీఎంపై అలా మాట్లాడడం ఏంటి? నీకు మెంటల్ వచ్చిందా..? ఇది పద్దతి కాదు అని హితవుచెప్పారు.. అసలు నీ పార్టీ ఎజెండా ఏంటి..? నీ ఆలోచన ఏంటి? అని ప్రశ్నించారు.. గొప్ప నాయకులే ఓడిపోతారు, గెలుస్తారు.. ఇందిరాగాంధీ, ఎన్టీఆర్ లాంటి నేతలే ఓడిపోయారు.. కానీ, పులివెందులలో ఎప్పుడైనా ఇన్ని నామినేషన్లు వేశారా? అని ప్రశ్నించారు. అంతేకాదు,



ఇప్పుడు 11 నామినేషన్లు పడ్డాయని గుర్తుచేశారు. ప్రతి రోజు అసెంబ్లీలో మీ సభ్యుల కోసం 2 ప్రశ్నలు వస్తాయి.. 10 ప్రశ్నల్లో 2 ప్రశ్నలు మీ సభ్యులకు సంఖ్యాపరంగా కేటాయిస్తాం.. అయితే, వైసీపీ ఎమ్మెల్యేలు మాట్లాడుతున్నారు.. కానీ, ప్రశ్నించడానికి అసెంబ్లీకి ఎందుకు రావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మీ మూలంగా రెండు ప్రశ్నలు వేస్ట్ అవుతున్నాయి.. ఆ రెండు ప్రశ్నలు మీరు రాకపోతే చెప్పండి.. ఆ ప్రశ్నలు మరో పార్టీకి కేటాయిస్తాం అన్నారు. సభ్యులు అందరూ అసెంబ్లీకి రావాలి అని కోరుతున్నా.. మీరు వస్తారా... రారా నాకు క్లారిటీ- ఇవ్వండి.. వీటిపై నేను నిర్ణయం తీసుకోవాలి.. మీ వల్ల ప్రశ్నలు మురిగిపోతున్నాయి అని ఫైర్ అయ్యారు స్పీకర్.. అసెంబ్లీలో చాలా కీలకం ప్రింటింగ్ ప్రెస్.. నేను స్పీకర్ గా వచ్చాక ప్రింటింగ్ ప్రెస్ అన్ని తుప్పు పట్టి ఉన్నాయి. ప్రభుత్వం ఫైనాన్స్ వాళ్లతో మాట్లాడి కొత్త మెషిన్ లు తెచ్చాం.. నూతనంగా వున్న టెక్నాలజీ ఉన్న మెషీన్ తీసుకున్నాం.. నిముషాల్లో కొన్ని వేల పేపర్ లు ప్రింట్ చేసే మెషీన్ ఇది.. ఆటోమేటిక్ మెషీన్ పనిచేస్తుంది. తక్కువ స్థలం లో మెషిన్ పెట్టుకోవచ్చు. దీనితో పాటు- కర్నూలులో ఒకటి.. విజయవాడ లో ఒకటి.. ప్రభుత్వ ముద్రణ చేసే ప్రెస్ లు ఉన్నాయి.. అవి తప్పుపట్టు ఉన్నాయి. వాటిని కూడా రెనోవేట్ చేస్తాం అని స్పీకర్ అయ్యన్నపాత్రుడు ప్రకటించారు. గత ప్రభుత్వంలో 5 ఏళ్లలో కేవలం 75 రోజులు పనిదినాలు మాత్రమే నడిచాయి.. భారతదేశంలో ప్రతి అసెంబ్లీ తక్కువలో తక్కువ 60 రోజులు జరగాలి అని పాట్నాలో తీర్మానించాం.. కొత్త ప్రభుత్వంలో ఇప్పటికీ 31 రోజులు సమావేశాలు జరిగాయని తెలిపారు. పులివెందులలో ఓడారని జగన్ ఇష్టారీతిన మాట్లాడుతున్నారని స్పీకర్ అయ్యన్న పాత్రుడు అన్నారు. జగన్ ప్రజాస్వామ్యం గురించి మాట్లాడుతుంటే అసహ్యం వేస్తోందన్నారు. ఆయన ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఎన్నో అరాచకాలు చేశారని ఆరోపించారు. నామినేషన్లు కూడా వేయనీయ కుండా పాలించారని చెప్పారు. పులివెందుల ప్రజాస్వామ్యం గురించి మాట్లాడే అర్హత జగన్‌కు ఎక్కడిది? ముఖ్యమంత్రి చంద్రబాబుపై జగన్ వ్యాఖ్యలు బాధాకరం. ప్రజాస్వామ్యవాదులంతా ఆ వ్యాఖ్యలను ఖండించాలి. సెప్టెంబర్ 17 లేదా 18 నుంచి అసెంబ్లీ సమావేశాలు ఉంటాయి. జగన్, వైకాపా నేతలు ఇకనైనా అసెంబ్లీకి రావాలి. సమస్యలు అడగాల్సిన బాధ్యత ఆ పార్టీ ఎమ్మెల్యేలకు ఉంది. వచ్చే అసెంబ్లీ సమావేశాలకు వస్తారో? రారో ముందే స్పష్టత ఇవ్వాలి. వైకాపా అసెంబ్లీకి రాకుండా ప్రశ్నలు ఎందుకు వేస్తోంది? ప్రశ్నలు అడిగి సభకు రాకుండా సమయాన్ని వృథా చేస్తోంది. అసెంబ్లీకి రాకుండా ప్రశ్నోత్తరాలకు ప్రశ్నలు పంపుతామంటే కుదరదు. వస్తామంటే వైకాపాకు 2 ప్రశ్నలు కేటాయిస్తాం. రాకపోతే ఆ 2 ప్రశ్నలు ఇతర పార్టీలకు ఇచ్చేస్తామని అయ్యన్నపాత్రుడు తెలిపారు.

# కడపలో ప్రజాస్వామ్యం గెలిచింది

**- 40 ఏళ్లుగా ఇక్కడ వైఎస్ కుటుంబం భయపెట్టింది**

**- రెండు జడ్పీటిసిలు గెల్చుకోవడంతో ప్రజల్లో చైతన్యం**

**- మీడియాసమావేశంలో మంత్రి సవిత**

**కడప,ఆగస్ట్14( వెలుతురు):**
పులివెందుల, ఒంటిమిట్ట జడ్పిటిసి ఎన్నికల్లో ప్రజాస్వామ్యం గెలిచిందని, టిడిపి అభ్యర్థులు భారీ మెజార్టీ సాధించారని జిల్లా ఇన్చార్జి మంత్రి సవిత పేర్కొన్నారు. అభ్యర్థులు గెలిచిన తరవాత ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పులివెందులలో 40 ఏళ్లుగా స్థానిక ఎన్నికల్లో వైయస్ కుటుంబం దోచుకోవడం దాచుకోవడం ద్వారా భయపెట్టి గెలిచేదని తెలిపారు. పులివెందులలో బీటెక్ రవి ధైర్యంగా తన భార్యని ఎన్నికల్లో నిలబెట్టారని చెప్పారు. అదే నమ్మకంతో కూటమి సహకారంతో ఆమె భారీ మెజార్టీతో గెలిచిందని పేర్కొన్నారు. ఇంటింటికి వెళ్లి ధైర్యంగా ఓట్లు- వేయమని ప్రజలకు చెప్పడంతో వారు ధైర్యంగా వచ్చి ప్రజాస్వామ్యబద్ధంగా ఓటును మొదటిసారి వేశారని తెలిపారు. అవినాష్ రెడ్డి ఇంటింటికి వచ్చి ఓటు వేయమని సేవ్ డెమోక్రసీ అడుగుతుంటే ప్రజలు నవ్వుకున్నారని గుర్తు చేశారు. జగన్మోహన్ రెడ్డి, అవినాష్ రెడ్డి గెలవమని తెలుసుకుని 4 రోజులు నుంచి డ్రామాలాడుతూ ఎన్నికలు రద్దు చేయాలంటున్నారని విమర్శించారు. రెండు స్థానాలు రీపోలింగ్ అన్నారు, మళ్లీ రీపోలింగ్ జరిపారని పేర్కొన్నారు. ఇప్పుడు ఎన్నికలను రద్దు చేయాలని అంటున్నారని తెలిపారు. ప్రజలే వైసిపి ప్రభుత్వాన్ని బైకాట్ చేస్తున్నారనే విషయం జగన్



మోహన్ రెడ్డి తెలుసుకోవాలని చెప్పారు. పులివెందులలో గెలిచిన జగన్మోహన్ రెడ్డి ఏ రోజు కూడా పులివెందులను పట్టించుకున్న పాపానపోలేదని పేర్కొన్నారు. గతంలో బీటెక్ రవి గెలిచారని, ఇప్పుడు తన భార్యను గెలిపించుకున్నారని తెలిపారు. రోడ్డు రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ జడ్పిటిసి ఎన్నికల విజయం మా యువ నాయకుడు లోకేష్ కు బహుమతిగా ఇస్తున్నామని చెప్పారు. భయపెట్టి గెలిచిన ఎన్నికల స్థాయి నుంచి ప్రజాస్వామ్య పద్ధతిలో గెలిచి చూపించామని పేర్కొన్నారు. జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి మాట్లాడుతూ పులివెందులలో క్రూయల్ డెమోక్రసీ నుంచి రియల్ డెమోక్రసీ వచ్చిందని తెలిపారు. వైసిపి అరాచక పాలన, నిధుల దోపిడీతో మా కూటమి పోరాట ఫలితం చంద్రబాబు, మోడీ అభివృద్ధి వల్లే పులివెందుల విజయం అన్నారు. అవినాష్ రెడ్డి, భారతి దగ్గరుండే వివేకానంద రెడ్డిని హత్య చేయించి, పోలీసులను నోరు మూయించిన విషయం బయటకు వచ్చాయని చెప్పారు. స్థానిక ఎన్నికల్లో ఓడిపోయిన వైయస్ కుటుంబానికి సిగ్గుండాలని పేర్కొన్నారు. మళ్లీ మా ప్రభుత్వం వస్తుంది ఏదో పొడుస్తానని విర్రవీగుతు న్నారని, కలలో కూడా జరగదని హితువు పలికారు. మాజీ ఎమ్మెల్సీ బీ-టె-క్ రవి మాట్లాడుతూ ఇది ప్రజా విజయం, జిల్లాలో అందరూ సహకరించారని తెలిపారు. విజయానికి ప్రధానంగా నాలుగు కారణాలు ఉన్నాయని చెప్పారు. చంద్రబాబు సుపరిపాలన, పులివెందులలో ఈరోజు కూడా ప్రజలు స్వేచ్ఛగా ఓటు- వేసిన పరిస్థితి లేదని పేర్కొన్నారు. ప్రజలు స్వేచ్ఛగా వచ్చి ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించు కున్నారని తెలిపారు. వారికి డిపాజిట్ కూడా రాలేదని చెప్పారు. వైయస్ కుటుంబం దారుణంగా పులివెందులను పట్టిపీడిస్తోందని, వచ్చే ఎన్నికల్లో కూడా స్వేచ్ఛగా వచ్చి ఓట్లు- వేసి వైసిపిని తీవ్రమైన పదజాలంతో దూషించి ఓడిస్తామని పేర్కొన్నారు. అది వింటే జగన్ మోహన్ రెడ్డి ఆత్మహత్య చేసుకుంటా రని తెలిపారు. టిడిపి పోలీసు బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ వైసిపి రాష్ట్రంలో కనుమరుగడం ఖాయమని చెప్పారు. పులివెందుల జడ్పిటిసి గా ఎన్నికైన లతా రెడ్డి మాట్లాడుతూ అందరి సహకారంతో విజయం సాధించాలని పేర్కొన్నారు. అనంతరం లతారెడ్డిని అభినందించారు. సమావేశంలో ఎమ్మెల్యే పుత్త చైతన్య రెడ్డి, పుత్తా నరసింహారెడ్డి, హరిప్రసాద్, రిత్విక్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

# 16ననే శ్రీకృష్ణాష్టమి పర్వదినం

- పండితుల నిర్ణయం



**తిరుమల,ఆగస్ట్14( వెలుతురు):**
శ్రీ కృష్ణజన్మాష్టమి ఎప్పుడు జరుపుకోవాలి.. ఆగష్టు 15 శుక్రవారమా – లేక ఆగష్టు 16 శనివారమా అన్నచర్చ ఇప్పుడు మళ్లీ మొదలయ్యింది. అష్టమి తిథి ఎప్పటి నుంచి ఎప్పటి వరకూ ఉంది శ్రీ కృష్ణ జన్మాష్టమి..ఎప్పుడు జరుపుకోవాలి!.. పండితులు ఏమంటున్నానే విషయంలో కూడా సందిగ్ధం ఉంది. అయితే పండుగలన్నీ తిథులను పరిగణలోకి తీసుకునే నిర్ణయిస్తారు. ఏ రోజు సూర్యోదయానికి తిథి ఉంటే ఆ రోజునే పరిగణలోకి తీసుకుంటారు...అయితే కొన్ని పండుగల విషయంలో రోజంతా తిథి ఉండడం ప్రధానంగా భావిస్తారు. ఈ సారి కృష్ణాష్టమి విషయంలో ఆగష్టు 16 శనివారమే పండుగ అని పండితులు నిర్ణయించారు. అయితే ఆరోజు సూర్యోదయం తర్వాత అష్టమి తిథి వచ్చింది. హిందూ క్యాలెండర్ ప్రకారం కృష్ణాష్టమి తిథి ఆగష్టు 15 రాత్రి 11:49 గంటలకు ప్రారంభమై, ఆగష్టు 16 రాత్రి 09:34 గంటలకు ముగుస్తుంది. దీంతో ఈ ఏడాది ఆగష్టు 16వ తేదీన కృష్ణ జన్మాష్టమిని జరుపుకోనున్నారు. సాధారణంగా జన్మతిథి జరుపుకున్నప్పుడు సూర్యోదయానికి తిథి ఉండేలా చూసుకుంటారు. నక్షత్రం ఓ రోజు అటు ఇటుగా ఉన్నప్పటికీ తిథిని మాత్రమే పరిగణలోకి తీసుకుంటారు. అందుకే ఆగష్టు 16 శుక్రవారం సూర్యోదయం సమయంలో అష్టమి తిథి ఉండడంతో ఆ రోజే కృష్ణాష్టమి అని పండితులు నిర్ణయించారు. శ్రావణమాసంలో అమావాస్య ముందువచ్చే అష్టమి రోజు అర్ధరాత్రి జన్మించిన చిన్ని కృష్ణుడు..మర్నాడు సూర్యోదయానికి గోకులంలో నందుడి ఇంట్లో యశోధ దగ్గరకు చేరుకున్నాడు. ఈ తిథి ఆధారంగానే కృష్ణాష్టమిని జరుపుకుంటారు. అయితే వైష్ణవాలయాల్లో మాత్రం అష్టమి తిథితో పాటు,రోహిణీ నక్షత్రం కూడా ఉండాలని అంటారు. అందుకే ప్రధాన వైష్ణవాలయాలతో పాటు, వైష్ణవ సంప్రదాయకులు అంతా సెప్టెంబర్‌లో గోకులాష్టమిని జరుపుకోబోతున్నారు.

# బంగాళాఖాతంలో బలపడుతున్న అల్పపీడనం

- వాయువ్య దిశగా పయనించే అవకాశం
- తీరం వెంబడి 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు
- మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని ఆదేశాలు




**విశాఖపట్నం,ఆగస్ట్14( వెలుతురు):**
బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కొనసాగుతోందని వాతావరణ శాఖ అధికారి వెల్లడించారు. శుక్రవారం ఇది మరింత బలపడి సుస్పష్ట అల్ప పీడనంగా మారే అవకాశం ఉందన్నారు. గురువారం విశాఖపట్నంలో విలేకర్లతో మాట్లాడుతూ.. పశ్చిమ మధ్య వాయువ్య బంగాళాఖాతంలో ఈ అల్పపీడనం కొనసాగుతోందన్నారు. ఇది పశ్చిమ వాయువ్య దిశగా ఉత్తరాంధ్ర – ఒడిశా వైపు కదిలే అవకాశం ఉందని తెలిపారు. రాగల వారం రోజుల పాటు– రాష్ట్రంలో చెదురుమదురు వర్షాలు పడే అవకాశాలున్నాయని పేర్కొన్నారు. రానున్న 24 గంటల్లో రాష్ట్రంలో భారీ నుంచి అతి భారీ వర్షాలు ఒకటి రెండు చోట్ల పడవచ్చని చెప్పారు. ఈ నేపథ్యంలో సముద్ర తీరం వెంబడి 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీచే అవకాశం ఉందన్నారు. దీంతో సముద్రంలో వేటకు వెళ్ల వద్దని మత్స్యకారులకు ఆయన సూచించారు. కళింగపట్నం, భీమునిపట్నం, విశాఖపట్నం, మచిలీపట్నం, గంగవరం, కాకినాడ ఓడరేవుల్లో మూడో నెంబర్ ప్రమాద హెచ్చరిక జారీ చేశామని వివరించారు. విజయవాడలోని ప్రకాశం బ్యారేజి వద్ద వరద నీరు పెరుగుతోంది. ప్రస్తుత ఇన్, ఔట్ ఎ÷–లో 5,52,640 క్యూసెక్కులుగా ఉంది. మరి కాసేపట్లో 2వ ప్రమాద హెచ్చరిక జారీ చేసే అవకాశం ఉందని సమాచారం. అయితే కృష్ణానదికి వరద పోటు– ఎత్తడంతో.. ఆ నది పరీవాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వం సూచించింది. ఏ సమయంలోనైనా.. అత్యవసర సహాయం కోసం 112, 1070 నెంబర్లను సంప్రదించాలని కోరింది. ఇక కృష్ణానదిలో ప్రయాణించడం కానీ.. ఈతకు వెళ్ళడం.. చేపలు పట్టడం వంటి పనులు చేయవద్దని ప్రజలకు వివరించింది. ఈ మేరకు ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ ఒక ప్రకటనలో వెల్లడించారు.

# బేంగబజార్‌లో కుప్పకూలిన పురాతన భవనం

**హైదరాబాద్,ఆగస్ట్14( వెలుతురు):**



హైదరాబాద్‌లోని బేగంబజార్‌లో కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఓ పురాతన భవనం కుప్పకూలింది. అయితే ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఈ భవనం శిథిలావస్థకు చేరుకొందని, దాన్ని కూల్చేయాలని గతంలోనే జీహెచ్ఎంసీ అధికారులు ఆ భవనం యజమానికి నోటీసులు ఇచ్చినా పట్టించుకోలేదు. బేగంబజార్‌లో ఇలాంటి పురాతన భవనాల్లోనే వ్యాపారులు ఇప్పటికీ దుకాణాలను నిర్వహిస్తున్నారు. ఇక్కడ రద్దీ ఎక్కువగా ఉండటంతో శిథిలావస్థకు చేరిన భవనాలను కూల్చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఇలాంటివాటిపై బల్దియా అధికారులు కేవలం నోటీ–సులు ఇచ్చి వదిలేయడమే కాకుండా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

# ట్రంప్ సుంకాలకుకారణాలు అనేకం

- కేవలం రష్యాతో చమురు బేరం మాత్రే కాదు
- విశ్లేషకుల లోతైన అంచనా

**న్యూఢిల్లీ,ఆగస్ట్14( వెలుతురు):**
ట్రంప్ భారీ సుంకాల విధింపు వెనక అనేకానేక కారణాలు ఉన్నాయని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు. కేవలం రష్యా (నుంచి చమురు కొనుగోలు చేస్తున్నారనే కారణంతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్ పై భారీగా సుంకాల భారాన్ని మోపారనడానికి లేదంటున్నారు. ఇదొకకారణం మాత్రమేనని, అలాంటివి ఎన్నో ఇప్పుడు ఆన ముందుకేసుకుని ఉన్నారని అంటున్నారు. ట్రంప్ సుంకాల విధింపుపై భారత మాజీ దౌత్యవేత్త వికాస్ స్వరూప్ మాట్లాడుతూ.. కీలక వ్యాఖ్యలు చేశారు. భారత్– పాక్ మధ్య జరిగిన కాల్పుల విరమణలో ఎవరి ప్రమేయం లేదని న్యూదిల్లీ పేర్కొనడంతోనే సుంకాలు విధించారని విమర్శించారు. ఈ వ్యవహారంలో ట్రంప్ పదేపదే పెద్దన్న పాత్ర పోషించినట్లు ప్రకటించుకున్నారు. అయితే భారత్ దీనిని ఖండించింది. ఇది కూడా ట్రంప్ ఆగ్రహానికి కారణంగా ఆయన చూపాలరు. భారత్‌పై ట్రంప్ సుంకాల భారం మోపడానికి ప్రధానంగా రెండు కారణాలు కన్పిస్తున్నాయని తెలిపారు. బ్రిక్స్ కూటమిలో భారత్ కూడా సభ్యదేశంగా ఉంది. ఈ కూటమి అమెరికాకు వ్యతిరేకంగా




నిర్ణయాలు తీసుకోవడంతో పాటు– డాలర్‌కు ప్రత్యామ్నాయ కరెన్సీని సృష్టించాలనే లక్ష్యంతో ఉందని ఆయన భావిస్తున్నారు. ఇది ఆయనకు నచ్చని అంశం. మరొకటి.. ఉద్రిక్తతల తర్వాత భారత్– పాక్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం జరిగింది. ఇది తానే చేశానని ట్రంప్ పదే పదే ప్రచారం చేసుకున్నారు. అయితే, కాల్పుల విరమణ చర్చల్లో మూడో దేశ ప్రమేయం లేదని భారత్ వాదిస్తోంది. దీనిపై ట్రంప్ అసంతృప్తిగా ఉన్నట్లు తెలుస్తోంది. పాక్ ట్రంప్ ప్రమేయాన్ని గుర్తించడంతో పాటు–.. నోబెల్ శాంతి బహుమతి ఇవ్వాలంటూ ప్రతిపాదనలు కూడా చేసింది. అమెరికాతో జరుగుతున్న వాణిజ్య చర్చల్లో భారత వైఖరిని కూడా పలువురు ప్రశంసించారు. వ్యవసాయం, పాడి పరిశ్రమలపై అమెరికా ఒత్తిళ్లకు లొంగకపోవడం సరైన చర్యేనని అంటున్నారు. ఇకపోతే రష్యా నుంచి చమురు కొనుగోలు చేయొద్దని ట్రంప్ హెచ్చరించినా భారత్ పట్టించుకోలేదు. దీంతో భారీగా సుంకాలు విధించారు. ఇప్పటికే విధించిన 25 శాతం సుంకాలను 50 శాతానికి పెంచారు. ఆ 25 శాతం అదనపు టారిఫ్‌లు ఈనెల 27 నుంచి అమల్లోకి రానున్నాయి. ఈ గడువుకు ముందే యూఎస్‌తో వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోవాలని న్యూదిల్లీ చర్చలు జరుపుతోంది. అయితే ఇవేవీ నిలవవని, ఇది అమెరికాకు కూడా నష్టం కలిగించేదే అని అంటున్నారు.

# పాకిస్తాన్‌లో అపారమైన ఖనిజ సంపద

- దీంతో వ్యాపారంచేయాలని పాక్ తహతహ
- విదేశీ పెట్టుబడుల ఆకర్షణకుప్రత్యేక కార్యాచరణ

**ఇస్లామాబాద్,ఆగస్ట్14 ( వెలుతురు):**
ప్రస్తుతం పాకిస్తాన్ ఆర్థికంగా దివాలా తీసింది. ఇటీవలి ఆపరేషన్ సిందూర్‌తో మరింతగా పతనం అయ్యింది. సింధూజలాల నిలిపివేతతో దిక్కుతోచకుండా ఉంది. కానీ రానున్న రోజుల్లో మాత్రం ఈ దేశం సూపర్ రిచ్ కానుందని పలు నివేదికలు చెబుతున్నాయి. ఎలాగంటే దాదాపు 3 ట్రిలియన్ నుంచి 5 ట్రిలియన్ విలువైన అరుదైన ఖనిజాలు ఈ దేశంలో దాగి ఉన్నాయని భావిస్తున్నారు. ఇప్పుడు ఈ ఖనిజ సంపదను తవ్వి ప్రపంచ దేశాలతో వ్యాపారం చేయడానికి పాకిస్తాన్ సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. అమెరికా, చైనా, సౌదీ అరేబియా, యూకే, టర్కీ, యూఏఈ లాంటి దేశాలు ఈ అవకాశం కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయి. పాకిస్తాన్‌లో బొగ్గు, రాగి, బంగారం, ఇనుము, క్రోమైట్ వంటి ఖనిజాలు పుష్కలంగా ఉన్నాయి. ఇంకా చెప్పాలంటే, ప్రపంచంలోనే రెండో అతిపెద్ద ఉప్పు గనులు, ఐదో అతిపెద్ద రాగి, బంగారం గనులు ఇక్కడే ఉన్నాయంటా. ఈ ఖనిజాలు బలూచిస్తాన్ భూభాగం నుంచి ఉత్తరాన ఉన్న పర్వత ప్రాంతాలు, పంజాబ్ సారవంతమైన భూములు, సింధ్ భూముల వరకు అన్ని ప్రాంతాల్లో దొరుకుతాయని చెబుతున్నారు. ఇంత సంపద ఉన్నా కూడా ఇప్పటివరకు ఈ గనులను సరిగ్గా వినియోగించలేదు. కానీ, ఇప్పుడు ఈ విషయంలో పెద్ద మార్పు రాబోతోంది. అంతర్జాతీయ పెట్టుబడులను సులభతరం చేయడానికి, ఈ గనుల నిర్వహణను ప్రాంతీయ అధికారం నుంచి కేంద్ర అధికారానికి మార్చాలని పాకిస్తాన్ ప్రభుత్వం భావిస్తోంది.




దీనికోసం రాజ్యాంగ సవరణ అవసరం. దానికి సంబంధించిన చట్టం ఇప్పుడు సమీక్షలో ఉంది. ఈ మార్పు వస్తే, విదేశీ కంపెనీలకు బిడ్డింగ్, రెగ్యులేటరీ అనుమతులు, సెక్యూరిటీ క్లియరెన్స్‌లు సులభంగా జరుగుతాయి. అంటే పెట్టుబడులు వేగంగా రానున్నాయని అంచనా వేస్తున్నారు. నివేదికల ప్రకారం రాబోయే ఆరు నుంచి ఎనిమిది నెలల్లో విదేశీ కంపెనీలతో ఒప్పందాలు ఖరారు కానున్నాయి. గిల్గిట్–బల్టిస్తాన్ ప్రాంతంలో ఖనిజాల తవ్వకం హక్కులు పొందే అవకాశం కోసం చైనా ఎదురు చూస్తోంది. చైనా ఇప్పటికే పాకిస్తాన్‌లో అనేక ప్రాజెక్టుల్లో పెట్టుబడులు పెడుతోంది. ఉత్తర బెలూచిస్తాన్, దక్షిణ ఖైబర్ పఖ్తూన్‌ఖ్వాలో మైనింగ్ ప్రాజెక్టులను అభివృద్ధి చేసే హక్కులు పొందవచ్చని అమెరికా భావిస్తోంది. ఇటీవల అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కూడా పాకిస్తాన్ ఖనిజ, ఇంధన రంగాలపై ఆసక్తి చూపారని తెలుస్తోంది. రేకో డిక్ రాగి–బంగారం గనులపై సౌదీ అరేబియా దృష్టి సారించింది. ఈ గనులు ప్రపంచంలోనే అత్యుత్తమ రాగి, బంగారం నిక్షేపాలలో ఒకటిగా పరిగణించ బడతాయి. సౌదీతో చర్చలు దాదాపు చివరి దశలో ఉన్నాయని అంటున్నారు. పాకిస్తాన్ ఇప్పుడు అమెరికా, యూకే, చైనా, సౌదీ అరేబియా, టర్కీ, యూఏఈ లాంటి దేశాల నుంచి వచ్చే పెట్టుబడిదారులతో డీల్స్ కుదుర్చుకుంటోంది. వీటి కోసం ప్రభుత్వం ఒక సులభమైన వన్–స్టాప్ సొల్యూషన్ సిస్టమ్‌ను తీసుకొస్తోంది. తద్వారా పెట్టుబడిదారులకు అన్ని అనుమతులు, సౌకర్యాలు ఒకే చోట దొరుకుతాయి. ఈ ఖనిజ సంపద పాకిస్థాన్ దేశ ఆర్థిక వ్యవస్థను మార్చగల సామర్థం ఉందని నిపుణులు చెబుతున్నారు. ఈ గనులు సరిగ్గా వినియోగించబడితే ఉద్యోగాలు, ఆదాయం, ఆర్థిక అభివృద్ధి వంటి అనేక ప్రయోజనాలు లభిస్తాయి. అప్పుడు ఏకంగా పాక్ గతి మారుతుందని, ఆర్థికంగా బలపడుతుందని అంచనా వేస్తున్నారు.

# నల్లగొండ పోక్సో కోర్టు సంచలన తీర్పు

**మైనర్ బాలికపై అత్యాచారం..హత్య కేసులో ఉరిశిక్ష**

**నల్గొండ,ఆగస్ట్14( వెలుతురు):**
నల్గొండ పోక్సో కోర్టు సంచలన తీర్పు వెల్లడించింది. మైనర్ బాలికపై అత్యాచారం చేసి, ఆపై హత్య చేసిన నిందుతుడికి ఉరిశిక్ష విధిస్తూ సంచలన తీర్పు ఇచ్చింది. పోక్సో, హత్య కేసులో నిందుతుడికి ఉరిశిక్ష విధించింది. అంతేకాదు జరిమానాగా లక్షా పది వేల రూపాయలు కట్టాలని ఆదేశించింది. నిందుతుడికి ఉరిశిక్ష విధించిన నల్గొండ కోర్టుపై బాధిత కుటుంబసభ్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తమ కూతురికి ఇన్నాళ్లకు న్యాయం జరిగిందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. 2013లో మొహమీ ముక్రమ్ అనే వ్యక్తి 12 ఏళ్ల మైనర్ బాలికపై అత్యాచారం చేశాడు. బాలిక ఇంట్లో ఒంటరిగా ఉండటం చూసి అత్యాచారం చేశాడు. అనంతరం మైనర్ బాలికను హత్య చేశాడు. హత్య అనంతరం మృతదేహాన్ని నాలాలో పడేశాడు. మూడు రోజుల తర్వాత పోలీసులు బాలిక మృతదేహాన్ని గుర్తించారు. నిందితుడిపై నల్లగొండ వన్ టౌన్ పోలీస్ స్టేషన్లో కేసు నమోదైంది. 2015లో ఛార్జ్ షీట్ దాఖలు అయింది. గత 10 ఏళ్లుగా జిల్లా కోర్టులో వాదనలు జరిగాయి. పోక్సో, హత్య నేరం కేసులో తాజాగా నల్గొండ పోక్సో కోర్టు సంచలన తీర్పు వెల్లడించింది. పోక్సో కోర్టు ఇన్‌ఛార్జి న్యాయమూర్తి రోజా రమణి తీర్పు వెలువరించారు. మైనర్ బాలికపై అత్యాచారం చేయడంతో పాటు– హత్యకు పాల్పడిన



కేసులో నిందితుడికి పోక్సో చట్టం కింద కోర్టు ఉరిశిక్ష విధించింది. 2013లో నిందితుడు మోహమ్మ్మా ముకట్టము, 12 ఏళ్ల బాలిక నల్గొండలోని ఇంట్లో ఒంటరిగా ఉండటం చూసి అత్యాచారానికి పాల్పడ్డాడు. అనంతరం ఆమెను హత్య చేసి మృతదేహాన్ని కాలువలో పడేశాడు. దీనిపై వన్‌టౌన్ పోలీసులు నిందితుడిపై పోక్సో చట్టం, హత్యా నేరం కింద కేసు నమోదు చేశారు. ఈ ఘటనపై గత 10 ఏళ్లుగా జిల్లా కోర్టులో వాదనలు జరగగా, నేడు పోక్సో కోర్టు ఇన్‌ఛార్జి న్యాయమూర్తి రోజా రమణి తుదితీర్పు వెలువరించారు.

# మాచైల్ మాతా యాత్ర మార్గంలో విషాదం

- క్లౌడ్ బస్ట్ తో 12మంది మృతి

**శ్రీనగర్,ఆగస్ట్14( వెలుతురు):**
జమ్మూ కాశ్మీర్ కిష్టావర్ జిల్లా పద్దార్ సబ్ డివిజన్ పరిధిలోని చిషోటీ– గ్రామ పరిసర ప్రాంతంలో గురువారం మేఘ విస్ఫటనం సంభవించింది. ఆ క్రమంలో 12 మంది మరణించారు. పలువురు తీవ్రంగా గాయపడ్డారు. మాచైల్ మాతా యాత్ర మార్గంలో ఈ గ్రామం ఉండడంతో మృతుల సంఖ్య మరింతగా పెరగవచ్చని ప్రభుత్వ అధికారులు భావిస్తున్నారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న జిల్లా యంత్రాంగం ఆ ప్రాంతానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టింది.



అలాగే ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, భద్రతా దళాలు, పోలీసులు సంయుక్తంగా ఈ సహాయక చర్యలో పాల్గొన్నారు. సహాయక చర్యలు కొనసాగుతున్నాయని కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ వెల్లడించారు. అయితే ఈ వర్షాల కారణంగా మరణించిన వారి సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కిష్టావర్ డిప్యూటీ– కమిషనర్ పంకజ్ కుమార్ శర్మ సహాయక చర్యలను దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు.

# దొంగ ఓట్లతో గెలవడం గెలుపేనా

- అసలు ఓటర్లు ఇక్కడ ఓటే వేయలేదు
- పులివెందుల ఫలితంపై అవినాశ్ రెడ్డి



**పులివెందుల,ఆగస్ట్14( వెలుతురు):**
పులివెందుల జడ్పీటిసి ఉప ఎన్నికల్లో టిడిపి అభ్యర్థి లతారెడ్డి దొంగ ఓట్లు వేసుకుని గెలిస్తే అది గెలుపేనా? అని వైఎస్సార్ సిపి ఎంపి అవినాష్ రెడ్డి ప్రశ్నించారు. అసలు ఈ ఎన్నికలో నిజమైన ఓటర్లు పోలింగ్ బూత్ లకే రాలేదని, టిడిపి నేతలు, కార్యకర్తలు దొంగ ఓట్లు– వేసుకున్నారని ఆయన తీవ్రంగా ఆరోపించారు. ఈ విషయంపై ఆయన మాట్లాడుతూ.. 'అసలు దీన్ని ఎలక్షన్ అంటారా?.. ఇంకేమైనా అంటారా?. మీరు గెలిచామని మీరు (టిడిపినేతలు) అనుకోవాల్సిందే తప్ప ప్రజలు అనుకునే అవకాశమే లేదు. ఎందుకంటే అసలు ప్రజలు ఓట్లు– వేస్తే కదా.. మీరు గెలిచాం అని చెప్పుకోడానికి?. మీ దొంగ ఓటర్లు కూడా మీరు గెలిచారు అని అనుకోరు. ఎందుకంటే జరిగిందతా వారికి తెలుసు కాబట్టి. వారితో ఓట్లు– వేయించలేదు కాబట్టి పులివెందుల మండల ఓటర్లు మీరు గెలిచారని అసలే అనుకోరు' అని అన్నారు. ప్రతిపక్ష పార్టీ ఏజెంట్లను, ఓటర్లను బూత్‌లోకి రానివ్వకుండా చేసుకున్న పోలింగ్‌ను ఎలక్షన్ అంటారా? అని ఆయన ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు ఎవ్వరూ నిరుత్సాహపడాల్సిన అవసరం లేదు. వీరికి గుణపాఠం చెప్పే రోజు వస్తుంది.. అప్పుడు నిజమైన ఓటింగ్‌తోనే వీళ్లకు గుణపాఠం చెబుదాం అని వ్యాఖ్యలు చేశారు.




Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICCATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com